Pubilshed from Ananthapuramu

PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 04 | సంచిక : 75 | ఆదివారం | సెప్టెంబర్ 27, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 04 | Issue No : 75 | Sunday | 27 SEPTEMBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం ఇవ్వండి

- రిజర్వాయర్లను నింపడం... వనరులకు నీళ్లు మళ్లించడంపై దృష్టి
- ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని సూచన
- భారీ వర్షాలతో వివిధ రిజర్వాయర్లల్లో 21 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగాయని అధికారుల వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో నదులు, రిజర్వాయర్లలో పెరిగిన ప్రవాహాలు, ముంపు పరిస్థితులపై శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో నివాస ప్రాంతాలు జలమయం కావడం, పంటలు ముంపునకు గురైన పరిస్థితి, తీసుకుంటున్న సహాయక, పునరావాస చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఐదు రోజులుగా సముద్రంలోకి వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా 50 కేజీల బియ్యం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సహాయాన్ని అందించేందుకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎగువనున్న రాష్ట్రాల నుంచి ప్రస్తుతం పెద్దగా ప్రవాహాలు లేవని, స్థానికంగా వస్తున్న వరద నీటి కారణంగానే ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్థానికంగా వచ్చే వరద నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్యన ఓ కొత్త బ్యారేజీ నిర్మాణం అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

2 పేజీలో..



# కాంగోలో ఘోర విమాన ప్రమాదం..

- 14 మంది మృతి

**కిన్షాసా:** ఆఫ్రికాలోని కాంగోలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. విమానం కుప్పకూలడంతో ఇద్దరు సీనియర్ సైనిక అధికారులు సహా మొత్తం 14 మంది మృతి చెందారు. కిక్విట్ నుంచి రాజధాని కిన్షాసాకు తిరుగు ప్రయాణమైన విమానం కేంజ్ ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. విమానంలో ఉన్న వారిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని కాంగో సైన్యం వెల్లడించింది. కాంగో సైన్యం తెలిపిన వివరాల ప్రకారం.. విమానంలో సైనిక ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు. ప్రయాణ సమయంలో విమానం అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి కేంజ్ ప్రాంతంలో కుప్పకూలింది.

- మిగతా 2లో..

# ప్రజారోగ్య పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం

- ఫిల్టర్ ఛాంబర్లు, బెడ్స్ లో హానికర కీటకాలు ప్రవేశించకుండా జాగ్రత్తలు పాటించాలి
- నీటి వనరులు, వాటి పరిసరాలు కాలుష్యరహితంగా ఉండాలి
- సమగ్ర రక్షిత తాగు నీటి సరఫరా పథకాల నిర్వహణలో లోపాలు సహించం
- గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, జెడ్పీ సీఈవోలు నిరంతర తనిఖీలు చేపట్టాలి
- సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణ, పర్యవేక్షణ పటిష్టం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన, నాణ్యమైన తాగు నీటిని నిరంతరాయంగా అందించే సమగ్ర రక్షిత తాగునీటి పథకాల నిర్వహణ, పర్యవేక్షణను పటిష్టపరచాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులతో సమీక్షించారు. సీపీడబ్ల్యూఎస్ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని ఉప ముఖ్యమంత్రివర్యులు స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

# ఏఐ ఆధారిత జీఎస్టీ అమలులో ఏపీ మోడల్ అద్భుతం

- మేం కూడా యథాతథంగా మా రాష్ట్రంలో అమలు చేస్తం
- ఆసక్తి ప్రదర్శించిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం
- ఏపీ వాణిజ్య పన్నుల శాఖను ప్రశంసలు
- ఛత్తీస్‌గఢ్‌కు సాంకేతిక సహకారం అందించాలని విజ్ఞప్తి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

జీఎస్టీ అమలును సమర్థవంతంగా నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అమలు చేస్తున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఆధారిత ఎండ్ టు ఎండ్ ట్యాక్స్ సొల్యూషన్స్ విధానం దేశంలోని పలు రాష్ట్రాలను ఆకట్టుకుంటోంది. ఈ విధానాన్ని తమ రాష్ట్రాల్లోనూ అమలు చేయడానికి ఆయా రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి.

2 లో



# 33 రోజులుగా కరోనా కేసులు లేవు!

- ఆగస్టు 25 నుంచి శనివారం వరకు కొత్త కేసు నమోదు కాలేదు
- 94 రోజుల్లో 1,086 మందికి పరీక్షలు..
- 78 మందికి పాజిటివ్ ప్రస్తుతంనో కరోనా..

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

రాష్ట్రంలో గత 33 రోజులుగా ఒక్క కొత్త కరోనా కేసు కూడా నమోదు కాలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

- మిగతా 2లో..

# జాతీయ స్థాయిలో ఏపీ సమాచార పౌర సంబంధాల శాఖకు అరుదైన గౌరవం..

- 'స్కోచ్ సిల్వర్ పురస్కారం' దక్కించుకున్న ఐడపీఆర్ శాఖ
- ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్ కు గోల్డ్ స్కోచ్ అవార్డు
- మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియలో అత్యంత పారదర్శకతతో రికార్డు
- డైరెక్టర్ విశ్వనాథన్ దిశానిర్దేశంలో అరుదైన మైలురాయి

**న్యూఢిల్లీ:** పాలనా పారదర్శకత, జవాబుదారీతనం, డిజిటల్ సేవలను అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు జాతీయ స్థాయిలో మరో అరుదైన గుర్తింపు లభించింది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించి ప్రతిష్ఠాత్మక స్కోచ్ సిల్వర్ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. శనివారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో ఘనంగా జరిగిన 109వ స్కోచ్ సమ్మిట్ వేదికగా సమాచార పౌర సంబంధాల శాఖ ఈ గవర్నెన్స్ విభాగంలో మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినందుకు మీడియా అక్రిడిటేషన్ మేనేజ్మెంట్ సిస్టం అంశం గాను సిల్వర్ స్కోచ్

2 పేజీలో..



# సోషల్ మీడియా ఫిర్యాదుల ఆధారంగా పరవాడ ఫార్మాసిటీలో తనిఖీలు



పలు ప్రాంతాల్లో నమూనాల సేకరణ.. శుద్ధి చేయని వ్యర్థాలు వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేసినట్టు గుర్తింపు

- ఫార్మాసిటీ పరిధిలోని 95 పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు
- దిద్దుబాటు చర్యలు నిర్దేశించిన ఏపీ పీసీబీ
- ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ అనంతరమే విడుదల చేయాలని ఆదేశం
- అక్రమంగా ప్రమాదకర వ్యర్థాల విడుదల చేస్తే నిబంధనల మేరకు చర్యలు



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లు, వర్షపు నీటి కాలువల్లో నల్లటి రంగుతో కూడిన నీరు ప్రవహిస్తోందని, దుర్వాసన వస్తుందని శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లోని ఓ అకౌంట్‌లో పోస్ట్ అయిన వీడియోపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. ఆ ప్రాంతంలో పర్యటించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఏపీ పీసీబీ అధికారులను ఆదేశించారు.పవన్ కళ్యాణ్ ఆదేశాలతో వీడియో ఆధారంగా ఆయా ప్రాంతాల్లో మురుగు కాలువల్లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు చేపట్టారు. శుద్ధి చేయని వ్యర్థాలతో కూడిన నీటిని వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేసినట్టు, ఆ పరిసరాల్లో దుర్వాసనకు కారణమైన ఆరోపణలపై వివరణ కోరుతూ ఫార్మాసిటీ పరిధిలోని అన్ని పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మొత్తం 95 కంపెనీలకు ఏపీపీసీబీ నుంచి నోటీసులు జారీ అయ్యాయి.

**వ్యర్థాల నిర్వహణ డిజిటలీకరణకు ఆదేశం :**

ఉప ముఖ్యమంత్రివర్యుల ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులతోపాటు పలు దిద్దుబాటు చర్యలు కూడా తప్పనిసరిగా అమలు చేయాలని ఏపీపీసీబీ పరిశ్రమలకు ఆదేశించింది. వర్షపు నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మురుగునీరు లేదా కలుషిత నీటిని పరిశ్రమల వెలుపలికి విడుదల చేయకుండా చూడాలని, ఎఫ్లుయెంట్, ప్రమాదకర వ్యర్థాలను క్రమం తప్పకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, అవసరమైన స్క్రబ్బర్లను ఏర్పాటు

వివరాలు 2 లో



ప్రజాభూమి
ఆదివారం, సెప్టెంబర్ 27, 2026
2

# మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం ఇవ్వండి

దీంతో పాటు ప్రకాశం బ్యారేజీ దిగువన కూడా ఇంకో బ్యారేజీ నిర్మించాల్సిన అవసరాన్ని గతంలోనే ఆలోచన చేసిన విషయాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇరిగేషన్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో తక్షణమే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. లిఫ్ట్ పనులను పూర్తి చేసి వంశధార నీటిని హిర మండలం రిజర్వాయర్‌లోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వివిధ జిల్లాల్లో రిజర్వాయర్లను నింపేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా సీఎం సమీక్షించారు. తాజా వర్షాలతో రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కోస్తాంధ్రలో ప్రస్తుతం 19.80 శాతం, రాయలసీమలో 42 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయని, అయితే ఉత్తరాంధ్రలో ఎగువ ప్రాంతాల నుంచి నదుల్లోకి నీటి ప్రవాహాలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను కొనసాగించాలని సీఎం ఆదేశించారు.

**రిజర్వాయర్లలో నీటి మట్టాలు...**

**బేసిన్ల వారీ ప్రవాహాలపై సీఎం ఆరా** : ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ రిజర్వాయర్లల్లో నీటి మట్టాలు ఎలా ఉన్నాయి..? అలానే వివిధ నదుల పరివాహక ప్రాంతాల్లో ప్రవాహాల వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 29 రిజర్వాయర్లల్లో నీటి మట్టాలు పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సెప్టెంబర్ 23వ తేదీన ఆయా రిజర్వాయర్లలో నీటి మట్టాలు 101 టీఎంసీలు ఉండగా... 26వ తేదీ నాటికి 21 టీఎంసీలు మేర నీటి మట్టాలు పెరిగాయని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల పరిధిలో సుమారు 5 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగాయని తెలిపారు. ఇక కాకినాడ, పోలవరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లోని 18 రిజర్వాయర్ల పరిధిలో సుమారు 16 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగాయని అధికారులు వెల్లడించారు. పెరిగిన ఈ నీటి మట్టాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక వివిధ బేసిన్లల్లోని ప్రవాహాల విషయానికొస్తే... కృష్ణా, గోదావరి, నాగావళి, వంశధార బేసిన్లల్లో నీటి ప్రవాహాలు గతంతో పోల్చుకుంటే పెరిగాయని అధికారులు వివరించారు. ఉత్తరాంధ్రలో నదుల ప్రవాహాలు, ముంపు పరిస్థితిని మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా జిల్లాల్లోని రిజర్వాయర్లలోకి వస్తున్న నీటి ప్రవాహాలు, నిల్వ పరిస్థితిని ఇరిగేషన్ అధికారులు వివరించారు. వంశధార పరివాహక ప్రాంతంలో గొట్టా బ్యారేజికి సెప్టెంబరు 20న 7,214 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా, 25న 47,100 క్యూసెక్కులకు పెరిగిందని అధికారులు తెలిపారు. నాగావళి పరివాహక ప్రాంతంలోని నారాయణపురం ఆనకట్టకు ఇన్ ఫ్లో 2,100 నుంచి 49,800 క్యూసెక్కులకు పెరిగిందని, మడ్డువలస ప్రాజెక్టులో గతంలో 918 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండే.. ప్రస్తుతం 18 వేల క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో మడ్డువలస ప్రాజెక్టులో నీటి నిల్వ నీటి నిల్వ 1.61 టీఎంసీల నుంచి 2.79 టీఎంసీలకు చేరిందని వివరించారు.తోటపల్లి బ్యారేజీకి కూడా భారీగా ప్రవాహం వచ్చిందని తెలిపారు. ఈ బ్యారేజీ వద్ద గతంలో 2,484 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా... ప్రస్తుతం 23,250 క్యూసెక్కుల మేర ప్రవాహం ఉందని అధికారులు వెల్లడించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లలోనూ నీటి మట్టాలు పెరిగాయని అధికారులు తెలిపారు. సెప్టెంబరు 20న 11.67 టీఎంసీలుగా ఉన్న భూపతిపాలెం రిజర్వాయర్ నిల్వ సెప్టెంబర్ 25వ తేదీ నాటికి 15.78 టీఎంసీలకు చేరిందని, సీలేరు (గుంటవాడ) రిజర్వాయర్‌లో నిల్వ 1.52 నుంచి 3.90 టీఎంసీలకు పెరిగిందని వివరించారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద భారీగా ప్రవాహాలు నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఇక్కడ సెప్టెంబర్ 20వ తేదీన 1.20 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండే... ఈ నెల 25వ తేదీ నాటికి ఆ ప్రవాహాలు 3.50 లక్షల క్యూసెక్కులకు చేరిందని అధికారులు వెల్లడించారు. సెప్టెంబరు 20న ప్రకాశం బ్యారేజీకి 8,187 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా, 25న అది 40,521 క్యూసెక్కులకు పెరిగినట్టు తెలిపారు. మున్నేరుకు వచ్చే ప్రవాహం కూడా 3,210 నుంచి 9,000 క్యూసెక్కులకు పెరిగిందని వివరించారు. పెరిగిన ప్రవాహాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. ఓవైపు సహాయక చర్యలపై దృష్టి పెడుతూనే.. మరోవైపు రిజర్వాయర్లకు నీటిని మళ్లించే అంశంపై దృష్టి సారించాలన్నారు. అలాగే చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి వినియోగం ఉండాలని.. అలాగే నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సహా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఈ టెలికాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

## సంపాదకీయం

### బిజెపి పావుగా సిఇసి

ఎన్నికల రూపంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వ్యక్తమవుతుంది. రాజకీయ వారసత్వ పాలన రద్దయి ఎన్నికల ద్వారా పాలకులను ఎన్నుకోవడమనేది ఆధునిక సమాజం సాధించిన పురోగతి. ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో ఉన్న అనేక లోపాలను సరిదిద్దు కుంటూనే దానిని కాపాడుకోవడం అవసరం. భారత రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి దాని విధివిధానాలను రూపొందించింది. పాలక పార్టీలు అన్ని వ్యవస్థలను తమ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నట్లే ఎన్నికల వ్యవస్థను కూడా అనేక సందర్భాల్లో దుర్వినియోగం చేశాయి. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన భారత ఎన్నికల సంఘం 2014 తర్వాత వరుస వివాదాల్లో కూరుకు పోయింది. తాజాగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై వచ్చిన ఆరోపణలు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) విశ్వసనీయతనే ప్రశ్నార్థకంగా మార్చాయి. మెజారిటీ నిర్ణయాధికారానికి భిన్నంగా, కేంద్ర పాలకుల రాజకీయ, మతతత్వ ప్రయోజనాల కోసం జ్ఞానేష్ కుమార్ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదంగా మారింది. ముగ్గురు సభ్యుల కమిషన్‌గా వున్న ఎన్నికల సంఘానికి ప్రధాన కమిషనర్ (సిఇసి)గా జ్ఞానేష్ కుమార్, కమిషనర్లుగా సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఉన్నారు. అస్సాంలో మొదలై బీహార్, పశ్చిమ బెంగాల్‌లో ఉధృతమై ప్రస్తుతం దేశవ్యాప్తంగా సాగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) ద్వారా సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓటు హక్కును ప్రమాదంలో పడవేసింది. ఈ 'సర్' తో పాటు, కొత్త ఓటర్లను నమోదు చేసే విధానంలో మార్పులు, ఓటర్ల జాబితాల భద్రత వంటి విషయాలపై జ్ఞానేష్ కుమార్ కమిషన్ సభ్యుల అభిప్రాయాలను భిన్నంగా ఏకపక్షంగా వ్యవహరించిందని ప్రముఖ ఆంగ్ల పత్రిక 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఆధారాలతో బయటపెట్టింది. గత 10 నెలల్లో కనీసం 14 సార్లు కమిషనర్లు సంధు, జోషిలు వివిధ అంశాలపై అభ్యంతరాలు చెప్పినా వారికి తెలియకుండానే జ్ఞానేష్ కుమార్ పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నియంతృత్వ చర్యలను సహించలేని ఆ ఇద్దరు కమిషనర్లు భారత ప్రభుత్వంలోని అత్యున్నత అధికారి అయిన ప్రధాన కార్యదర్శికి విడివిడిగా ఫిర్యాదు చేసారంటే ప్రమాదం ఎంత స్థాయికి చేరిందో స్పష్టమవుతుంది.

**ఎవరీ జ్ఞానేష్ కుమార్ గుప్తా?**

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కోర్ ఎజెండా ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణంతో పాటు, సహకార వ్యవస్థను గుజరాత్ తరహాలో కేంద్రీకృతం చేయడంలో జ్ఞానేష్ కుమార్ గుప్తా కీలక పాత్ర పోషించారు. బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి మోడీ, షా లతో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ, ఎదుగుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ స్థాయికి చేరారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన ఈయన 1988 బ్యాచ్‌కు చెందిన కేరళ క్యాడర్ ఐఎఎస్ అధికారి. 2014కు ముందు వరకు కేరళలో పనిచేసిన ఈయన మోడీ ప్రధాని అయిన తర్వాత కేంద్ర సర్వీసుల్లోకి వచ్చారు. రక్షణ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సెక్రటరీగా పనిచేశారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 తొలగింపునకు అవసరమైన చర్యలను రూపొందించిన కమిటీలో ఈయన ఉన్నారు. అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఆలయ నిర్మాణం కోసం ఏర్పడిన రామ మందిర్ ట్రస్ట్ ప్రారంభ కమిటీలో కేంద్రం ఎంపిక చేసిన ఎక్స్- అఫీషియో సభ్యుడిగా, దాని ఏర్పాటులో ఆయన భాగస్వామిగా ఉన్నారు. వ్యవసాయ శాఖ కింద ఉన్న సహకార వ్యవస్థను హోంశాఖ కిందకు బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చింది. అమిత్ షా నాయకత్వంలో దేశంలోని సహకార సంఘాలను కేంద్రం ఆధీనంలోకి తీసుకురావడానికి 'బహుళ రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) చట్టం, 2023-ను జ్ఞానేష్ కుమార్ రూపొందించారు. పాలకుల అండదండలతో 2025 ఫిబ్రవరి 19న జ్ఞానేష్ కుమార్ 26వ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యారు. ఈయన ఈ బాధ్యతలు చేపట్టడానికి కొద్ది రోజుల ముందే ప్రధాన కమిషనర్ ఎన్నికకు సంబంధించిన కీలక చట్ట సవరణలు జరిగాయి. న్యాయ నిపుణులు అందించిన నివేదిక ఆధారంగా దేశ ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ కమిషనర్‌ను ఎంపిక చేసే విధానం ఉండేది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి కేంద్ర క్యాబినెట్ మంత్రిని ఆ కమిటీలో చేర్చారు. దీని ప్రకారం ప్రస్తుతం మోడీ, అమిత్ షా, రాహుల్ గాంధీ ఎంపిక కమిటీలో ఉన్నారు. ఎన్నికల కమిషనర్‌ను మెజారిటీ నిర్ణయం ప్రకారమే ఎంపిక చేసినామనే మాటకు అర్థం ఏముంది? ఈ సవరణ చేసిన కొద్ది రోజులకే అప్పటి వరకు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న అరుణ్ గోయెల్ 2024 పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొన్ని గంటల ముందు ఆకస్మికంగా రాజీనామా చేయడం, రాష్ట్రపతి ఆమోదించడం వెంటవెంటనే జరిగిపోయాయి. ఈ రాజీనామా వెనుక బలమైన కారణాలున్నట్లు ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయి. అరుణ్ గోయెల్ స్థానంలో జ్ఞానేష్ కుమార్ నియమించబడ్డారు. దీనిపై ఎంపిక కమిటీ సభ్యుడుగా ఉన్న రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో అభ్యంతరాలను రాతపూర్వకంగా ఇచ్చినా ఖాతరు చేయలేదు. ఈ తర్వాత కొద్ది నెలలకు ప్రధాన కమిషనర్ గడువు ముగియడం ఆ స్థానంలో జ్ఞానేష్ కుమార్ కూర్చోవడం చకచకా జరిగిపోయాయి. ఇంతటితోనే బిజెపి లక్ష్యం పూర్తి కాలేదు. జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు చేపట్టే నాటికే ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకున్న నిర్ణయాలను, విధానాలను భవిష్యత్తులో సమీక్షించడం కానీ, పదవి విరమణ తర్వాత ఆయనను విచారించడం కానీ, క్రిమినల్ చర్యలు తీసుకోవడం కానీ చేయరాదని చట్ట సవరణ చేశారు. ఇవి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ప్రమాదంలో వేసే అత్యంత తీవ్రమైన చర్య. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలు వివాదాస్పదంగా మారాయి. మహారాష్ట్రతో పాటు బిజెపేతర ప్రభుత్వాలున్న పది రాష్ట్రాల ఎన్నికల్లో అత్యంత పక్షపాతంతో ఎన్నికల కమిషన్ బిజెపి వైపు మొగ్గింది. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి గెలవడంలో ఎన్నికల కమిషన్ కీలక పాత్ర పోషించిందనే విమర్శలు కారణమైంది. ఇటీవల ఎన్నికల కమిషన్ తీసుకున్న ఓటర్ల సవరణ దేశవ్యాప్తంగా పెద్ద కలకలమే సృష్టించింది. ఓటర్ల జాబితాలను ఎన్నుకోవడం కాకుండా, పాలకులే ఓటర్లను ఎన్నుకునే విధానా 'సర్' ప్రక్రియ నడుస్తుంది. ఇందులో మతతత్వ ఎజెండా కూడా ఉంది. బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌తో పాటు అనేక కీలక రాష్ట్రాల్లో సుమారు కోటి మంది ఓట్లను తొలగించి ఎన్నికలకు ముందే బిజెపి గెలుపునకు కావలసిన పరిస్థితులను ఎన్నికల కమిషన్ సృష్టించింది. ఇందులో జ్ఞానేష్ కుమార్ పాత్ర కీలకమైంది.

## సోషల్ మీడియా ఫిర్యాదుల ఆధారంగా

### పరవాడ ఫార్మాసిటీలో తనిఖీలు

చేసి ఆన్‌లైన్ మానిటరింగ్ నిర్వహించడం, తేదీ, సమయం నమోదయ్యే విధంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం, శుద్ధి చేసిన వ్యర్థాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కనీసం ఆరు నెలల పాటు భద్రపరచడం, కన్‌సెంట్ టు ఆపరేట్ (జుూ), హాజర్డస్ వేస్ట్ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించడం వంటి చర్యలను కాలుష్య నియంత్రణ మండలి సూచించింది. అకస్మాత్తుగా మురుగునీరు, ప్రమాదకర వ్యర్థాలు, ఉప ఉత్పత్తుల వంటి వాటిని విడుదల చేస్తున్నట్లు నిర్ధారణ అయితే ఆయా పరిశ్రమలపై పర్యావరణ నిబంధనలను అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామని ఏపీపీసీబీ హెచ్చరించింది. షోకాజ్ నోటీసుకు స్పందించేందుకు పరిశ్రమలకు ఏడు రోజుల గడువు ఇచ్చారు. నిర్దేశిత సమయంలో సంతృప్తికరమైన వివరణ ఇవ్వాలని పేర్కొంది. పై చర్యలను వివరిస్తూ ఒక నివేదికను ఏపీపీసీబీ ఉప ముఖ్యమంత్రివర్యుల వారి కార్యాలయానికి పంపింది.

## కాంగోలో ఘోర విమాన ప్రమాదం..

మృతుల్లో కాంగో మిలటరీ కోర్టు చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ముటొంబో కటలాయి టియెంటే, సాయుధ దళాల ఆడిటర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ బకమె లికులియా ఉన్నారు. వీరితో పాటు మరో 12 మంది ప్రతినిధులు, విమాన సిబ్బంది మృతి చెందినట్లు సైనిక ప్రతినిధి మేజర్ జనరల్ ఎఫామ్ ఎకెంజె తెలిపారు. విమానం కిక్విట్ నుంచి కిన్సాసాకు బయలుదేరిన సమయంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు స్థానిక అధికారులు తెలిపారు. విమానం ఎందుకు నియంత్రణ కోల్పోయిందనే అంశంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## 33 రోజులుగా కరోనా కేసులు లేవు!

ఆగస్టు 25 నుంచి శనివారం వరకు కొత్త కేసులు నమోదు కాలేదని ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం క్రియాశీల కరోనా కేసులు ఏవీ లేవని వెల్లడించారు. జూన్ 24 నుంచి సెప్టెంబరు 25 వరకు 94 రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా 1,086 కరోనా నమూనాలను పరీక్షించామని మంత్రి తెలిపారు. వీటిలో 78 మందికి కరోనా నిర్ధారణ కాగా, 74 మంది కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారని చెప్పారు. ఈ 94 రోజుల వ్యవధిలో 66 రోజులు ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా కరోనా కేసులు సమూహంగా నమోదైన పరిస్థితి లేదని చెప్పారు. పరిస్థితి నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం

ముఖ్యంగా తాను గుర్తించిన ఫిల్టర్ భాంబర్లు, బెడ్ల నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక సూచనలు చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో 512 సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 11,221 నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరుగుతోందని, సుమారు 1.65 కోట్ల మంది ప్రజలు ఈ పథకాలపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి పథకం పరిశుభ్రంగా, సురక్షితంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పథకాలపై గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ అధికారులు, జెడ్పీ సీఈవోలు సంయుక్తంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నీటి వనరులు, శుద్ధి కేంద్రాలు, పంప్ హౌస్‌లు, ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, వాల్వులు తదితర మౌలిక వసతుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. దేవని నిల్వ ట్యాంకులను పూర్తి సామర్థ్యంతో నిర్వహించడంతో పాటు వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, జంతువులు, కాలుష్య కారకాలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లీకేజీలు, విద్యుత్ సంబంధిత లోపాలు, మౌలిక సదుపాయాల దెబ్బతినడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

**ఫిల్టర్ బెడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

తాగు నీటి నాణ్యత పరిరక్షణలో ఫిల్టర్ బెడ్లు కీలకమని ఉప ముఖ్యమంత్రివర్యులు పేర్కొన్నారు. ఫిల్టర్ హౌస్‌లను అత్యంత పరిశుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. కప్పలు, బల్లులు, ఎలుకలు, పాములు, కీటకాలు వంటి జీవులు ఫిల్టర్ బెడ్లలోకి ప్రవేశించకుండా అన్ని ఓపెనింగ్‌లకు రక్షణ వలలు ఏర్పాటు చేయాలని సూచించారు. శుద్ధి చేసిన నీటి నాణ్యతను భౌతిక, రసాయన, బ్యాక్టీరియాలజికల్ ప్రమాణాల ప్రకారం నిరంతరం పరీక్షించాలని, ఏవైనా వ్యత్యాసాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. వెంటిలేటర్లు, ఓవర్‌ఫ్లో పైపులు, ఇన్‌లెట్ అవుట్‌లెట్లకు తుప్పు పట్టని మెష్ స్క్రీన్లు అమర్చాలని, ఫిల్టర్ మీడియాను నిర్దేశిత మందం మరియు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని, అవసరమైన మేరకు స్క్రాపింగ్, బ్యాక్‌వాషింగ్, శుభ్రపరిచే పనులు క్రమం తప్పకుండా చేపట్టడంతో పాటు ఇన్‌లెట్, అవుట్‌లెట్ వ్యవస్థలు, చానెల్స్, పైప్‌లైన్లు, వాల్వులు, వాష్‌వాటర్ వ్యవస్థలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచనలు చేశారు. ఫిల్టర్ హౌస్ పరిసరాలను నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచాలి. నిర్వహణ అవసరాలకు సంబంధించిన వాటిని మినహాయించి ఇతర రసాయనాలు, వ్యర్థ పదార్థాలు లేదా పరికరాలను ఫిల్టర్ హౌస్‌లలో నిల్వ చేయవద్దని చెప్పారు. పైకప్పులు, గోడలు, ప్లాట్‌ఫామ్‌లు, మెట్లు, గ్రేటింగ్‌లు, నిచ్చెనలు వంటి నిర్మాణ భాగాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు.

వీటితోపాటు నీటి వనరులు, వాటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా, కాలుష్య రహితంగా ఉంచాలని, వేసవి నిల్వ ట్యాంకులను (ఎబివిఐటీ రాశితృస్వ ఖుఐఎం) తగిన సామర్థ్యంతో నింపి నిర్వహించడంతో పాటు ట్యాంకుల కట్టలను బలోపేతం చేసి, జంతువులు, పశువులు, ఇతర కాలుష్య కారకాలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు నీటి నాణ్యత పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించి, పరీక్షల ఫలితాలను వాటర్ క్వాలిటీ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి సీపీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించిన నిర్వహణ రికార్డులు, తనిఖీ నివేదికలు, మరమ్మతుల వివరాలు సక్రమంగా నిర్వహించాలని, నిర్దేశిత ప్రమాణాలు పాటించిన తర్వాత మాత్రమే చెల్లింపులను సిఫారసు చేయాలని స్పష్టం చేశారు.

తాగునీటి నాణ్యత, ప్రజారోగ్యం, భద్రత, నిరంతర సరఫరాకు సంబంధించిన లోపాల నివారణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రివర్యులు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి నమ్మకమైన తాగునీటి సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# ఏఐ ఆధారిత జీఎస్టీ అమలులో ఏపీ మోడల్ అద్భుతం

ఇందులో భాగంగా పలు రాష్ట్రాలకు చెందిన పన్నుల శాఖ ప్రతినిధుల బృందం ఏపీ వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ విధానాన్ని అధ్యయనం చేయడానికి రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా తమ రాష్ట్రంలో ఏపీ మోడల్‌ను అమలు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేస్తోంది. దీనికోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పన్నుల శాఖకు చెందిన ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖను సందర్శించి ఆ శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ మోడల్‌ను అధ్యయనం చేస్తోంది. ఛత్తీస్‌గఢ్ ఐఆర్ఎస్ ప్రత్యేక కమిషనర్ తరన్నుమ్ వర్మ నేతృత్వంలో జాయింట్ కమిషనర్ నరేంద్ర వర్మ, డిప్యూటీ కమిషనర్లు హేమంత్ సిన్హా, ప్రకాశ్ గుప్తా, అసిస్టెంట్ కమిషనర్ పూర్వ గుప్తా, సిస్టమ్ అనలిస్ట్ రిధిమా శర్మ లతో కూడిన ప్రత్యేక బృందం మూడు రోజుల పాటు ఏపీలో అధ్యయనం చేసింది. ఈ బృందానికి రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ సాదర స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ ప్రక్రియల గురించి వారికి వివరించారు. మూడు రోజుల పాటు ఈ బృందం ఐటీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లీగల్ ఏఐ, కేస్ మేనేజ్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పన్ను ఎగవేతల నిరోధక వ్యవస్థ, ఆదాయ వృద్ధి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, సాంకేతిక ఆధారిత క్షేత్రస్థాయి కార్యకలాపాల వంటి అంశాలపై చర్చలు జరపడంతో పాటు వాటిని అధ్యయనం చేశారు. తొలిరోజు ఐటీ, డీఎస్ విభాగంలో వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఐటీ, డేటా అనలిటిక్స్, ఏఐ కార్యక్రమాలపై ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందానికి అవగాహన కల్పించారు. లీగల్ విభాగంలో ఆధ్వర్యంలో కేస్ మేనేజ్‌మెంట్, లిటిగేషన్ ట్రాకింగ్ న్యాయపరమైన కేసుల నిర్వహణలో ఏఐ వినియోగంపై సోదాహరణంగా వివరించారు. రెండవ రోజు ఎన్‌ఫోర్స్‌మెంట్, పన్ను ఎగవేతల నిరోధక చర్యలు, ఆదాయ వనరుల వృద్ధి వ్యూహాలు, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ) పనితీరుపై ప్రతినిధి బృందానికి వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలు, వాహనాల తనిఖీల కోసం రూపొందించిన మొబైల్ అప్లికేషన్లను, వాటి పనితీరు గురించి వివరించారు.

ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ మాట్లాడుతూ జీఎస్టీ చట్టం అమలులో కృత్రిమ మేధ వినియోగిస్తున్న విధానంపై సమగ్రంగా ఛత్తీస్ గఢ్ ప్రతినిధి బృందానికి వివరించారు. చట్టబద్ధమైన పన్నుల నిర్వహణ ప్రక్రియలో ఏఐ, అధునాతన డేటా అనలిటిక్స్‌ను అనుసంధానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. డేటాను సమగ్రంగా విశ్లేషించడం ద్వారా అది క్షేత్రస్థాయిలో అధికారులకు సహకరించడమే కాకుండా నిర్దేశిత లక్ష్యాలు సాధించడానికి, పన్ను ఎగవేతలను నిరోధించడానికి కూడా ఏ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. చట్టబద్ధమైన నిర్ణయాలను మాత్రం సంబంధిత అధికారులే తీసుకుంటారని స్పష్టం చేశారు.

**జీఎస్టీ విచారణలో ఎండ్ టు ఎండ్ ఏఐ ఆధారిత పరిష్కారం**

జీఎస్టీ కేసుల విచారణకు సంబంధించి ఏపీ వాణిజ్యపన్నుల శాఖ రూపొందించిన ఎండ్ టు ఎండ్ ఏఐ ఆధారిత పరిష్కారం ఛత్తీస్‌గఢ్ బృందాన్ని ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ప్రమాదకరమైన, క్లిష్టతరమైన పన్ను చెల్లింపుదారులను గుర్తించడానికి రిస్క్ ప్రొఫైలింగ్, కేసుల ఎంపిక, కేసుల కేటాయింపు, డేటాలో వ్యత్యాసాలు, అనుమానాస్పద లావాదేవీల నమూనాలను గుర్తించడం, విచారణ విశ్లేషణతోపాటు జీఎస్టీ చట్టం, నిర్దేశిత విధానాలకు అనుగుణంగా చట్టబద్ధమైన నోటీసులు, సమాచార పత్రాలు, ఉత్తర్వుల ముసాయిదాలను రూపకల్పన వరకు సమస్తం ఈ ఏఐ సహకారంతో నిర్వహిస్తున్నామని బాబు ఏ వివరించారు. ఏఐని కేవలం డేటా విశ్లేషణ సాధనంగా కాకుండా, జీఎస్టీ పరిపాలనా ప్రక్రియ మొత్తంలో సమగ్ర నిర్ణయ సహాయక వ్యవస్థగా వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు. పన్ను చెల్లింపుదారుల సమాచారం, రిస్క్ సూచికలు, గుర్తించిన వ్యత్యాసాలు, చట్టబద్ధమైన నిబంధనలను ఒకే వ్యవస్థలో అనుసంధానం చేయడం ద్వారా కేసుల ఎంపిక నుంచి దర్యాప్తు విశ్లేషణ, సంబంధిత దశల్లో అవసరమైన చట్టబద్ధ పత్రాల ముసాయిదా తయారీ వరకు అధికారులకు ఈ వ్యవస్థ సహాయపడుతుందని, తుది పరిశీలన, ఆమోదం మాత్రం సంబంధిత సమర్థ అధికారి ద్వారానే జరుగుతుందని వివరించారు.

**ఏపీ మోడల్ మేం కూడా అమలు చేస్తాం**

జీఎస్టీ నిర్వహణలో ఏఐని ఎండ్ టు ఎండ్ విధానంగా ఏపీ అమలు చేస్తున్న తీరును, రిస్క్ ఆధారిత కేసుల ఎంపిక, దర్యాప్తు, ముసాయిదాల తయారీ వంటి అంశాలను ఒకే సమగ్ర విధానంలో అనుసంధానం చేసి అమలు చేస్తున్న తీరును ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. పన్నుల నిర్వహణలో ఏఐ వినియోగానికి ఉన్న ప్రస్తుత ప్రయోజనాలు, భవిష్యత్తు అవకాశాలపై రెండు రాష్ట్రాలకు చెందిన అధికారులు విస్తృతంగా చర్చించి అభిప్రాయాలను పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వాణిజ్యపన్నుల శాఖ అభివృద్ధి చేసిన ఏఐ ట్యాక్స్ సొల్యూషన్స్‌ను తమ రాష్ట్రంలో యథాతథంగా అమలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందం తెలిపింది. దీనికి కావాల్సిన శిక్షణ, సామర్థ్య నిర్మాణంలో ఏపీ సహకారం కావాలని కోరింది.

# జాతీయ స్థాయిలో ఏపీ సమాచార పౌర సంబంధాల శాఖకు అరుదైన గౌరవం..

అవార్డు దక్కింది. ఈ అవార్డును సమాచార శాఖ డైరెక్టర్ తరపున జాయింట్ డైరెక్టర్ ఐ.సూర్యచంద్రరావు, ఆర్.ఐ.ఈ డా.నాగరాజ అందుకున్నారు. స్కోచ్ అధికారిక రికార్డుల్లోనూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ చేపట్టిన ఈ డిజిటల్ అక్రిడిటేషన్ విధానం పారదర్శకతకు ప్రతీకగా నమోదైంది.

**అక్రిడిటేషన్ విప్లవాత్మక మార్పులతో దేశవ్యాప్తంగా ప్రశంసలు** : సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్ అందిస్తున్న సమర్థవంతమైన మార్గదర్శకత్వం అక్రిడిటేషన్ ప్రక్రియను డిజిటలైజ్ చేయడంలో కీలకపాత్ర పోషించింది. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీలో ఎలాంటి సిఫార్సులు లేకుండా, పూర్తిగా నిబంధనలకు కట్టుబడి వ్యవహరించడం విశేషం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనకు ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ జాతీయ పురస్కారం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. మీడియా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు



తలెత్తకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, బిల్లాల్ జోడించి దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించడం, అర్హులైన జర్నలిస్టులకు సకాలంలో అక్రిడిటేషన్లు అందజేయడం వంటి చర్యల ద్వారా ఎలాంటి జాప్యానికి తావులేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

**ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్ కు గోల్డ్ స్కోచ్ అవార్డు** : సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్ డిజిటల్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆఫ్ అమరావతి 'క్వాంటం వ్యాలీ' అంశంలో (అమరావతి) గోల్డ్ స్కోచ్ అవార్డును అందుకుంది. ఈ అవార్డును డిజిటల్ కార్పొరేషన్ ఈడి రాణి సుస్మిత, స్పెషల్ ఆఫీసర్ శేషు కుమార్ అందుకున్నారు.

**"టీమ్ ఐ ఎ పీఆర్ అంకితభావానికి దక్కిన అరుదైన గుర్తింపు"** : ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. మీడియా రంగానికి మరింత పారదర్శకమైన సేవలు అందించేందుకు శాఖ చేస్తున్న కృషికి ఈ స్కోచ్ అవార్డులు లభించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ జాతీయ పురస్కారాలు కేవలం శాఖకు మాత్రమే దక్కిన విజయం కాదని, అక్రిడిటేషన్ మరియు డిజిటల్ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అహర్నిశలు శ్రమించిన 'టీమ్ ఐ ఎ పీఆర్' ప్రతి ఒక్కరి అంకితభావానికి, సమిష్టి కృషికి దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు.అలాగే, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌కు 'గోల్డ్ స్కోచ్ అవార్డు' రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ సంస్థ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. పారదర్శక పాలనను మరింత బలోపేతం చేసేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తూ, డిజిటల్ రంగంలోనూ రాజీపడని జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కీర్తిని ఇనుమడింపజేస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ మరియు ఏపీ డిజిటల్ కార్పొరేషన్ పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

ఆదివారం, సెప్టెంబర్ 27, 2026




# మౌలిక వసతుల ప్రాజెక్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలి



❖ జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి: మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపేలా స్పష్టమైన విధానాలు, కాలపరిమితితో కూడిన ప్రక్రియలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యానికి దారితీస్తున్న అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి శాఖల వారీగా సమగ్ర సిఫారసులు రూపొం దించాలని సూచించారు.శనివారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్ తో కలిసి జాతీయ స్థాయి చీఫ్ సెక్రటరీల కాన్ఫరెన్స్‌కు సంబంధించి మౌలిక వసతుల ప్రాజెక్టులపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వ హించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఎదుర్కొం టున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అభిప్రా యాలను సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించేం దుకు ఈ సమావేశం నిర్వహించారు.ప్రాజెక్టుల అమలులో ప్రధానంగా భూసేకరణ, అటవీ–వన్య ప్రాణి–పర్యావరణ అనుమతులు, యుటిలిటీ షిఫ్టింగ్, రాష్ట్రస్థాయి పరిపాలనా అనుమతులు వం టి కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు. భూసేకరణలో పరిహా రం నిర్ణయం, చెల్లింపు, భూమి స్వాధీనం, మ్యుటేషన్ తదితర ప్రక్రియల్లో అనవసర జాప్యాన్ని నివారించాల్సిన అవసరాన్ని కలెక్టర్ స్పష్టం చేశారు.జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబం ధించి ఎల్‌ఏ ఆర్ఆర్ చట్టం, 2013, జాతీయ రహదా రుల చట్టం, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, పరిహారం నిర్ణయ విధానాలపై స్పష్టత తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. చట్టపరమైన అంశాలపై నిపుణుల అభిప్రాయాలను తీసుకుని, భవిష్యత్‌లో వ్యక్తిగత నిర్ణయాలపై ఆధారపడకుండా ఒకే విధమైన స్పష్టమైన విధానం ఉండేలా సిఫారసులు రూపొం దించాలని సూచించారు. అటవీ, వన్య ప్రాణి, పర్యావరణ అనుమ తుల విషయంలో చేపట్టాల్సిన ప్రక్రియలను ముందు గానే పూర్తి చేసి జాప్యాన్ని తగ్గించాలని తెలిపారు. డిజిటల్ రీసర్వే, భూ రికార్డుల డిజిటలైజేషన్ వంటి సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆ యా శాఖలు తమ పరిధిలోని సమస్యలు, వాటికి కారణాలు, ప్రస్తుతం ఉన్న అడ్డంకులు, అవసరమైన విధానపరమైన మార్పులు, పరిష్కార సూచనలను సమగ్రంగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని సిఫారసులను క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించనున్నట్లు తెలిపారు.సమావేశంలో గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, జిల్లా అటవీ శాఖ అధికారిణి సునీత, ఏపీ మారిటైమ్ బోర్డు డైరెక్టర్ పల్లారావు, బిఎస్ఎన్ఎల్ జీఎం శ్రీను, మెగా ఇంజినీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, ఎన్‌హెచ్ఏఐ, మోర్త్, రైట్స్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం

❖ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార బాలికల పోషణపై ప్రత్యేక అవగాహన

❖ ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార బాలికల పోషణపై అవగాహన పెంపొందించడమే పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యం




ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8, 2026 వరకు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సేవలను పురస్కరించుకుని "అంగన్వాడీ ఉత్సవాలు" సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో, పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయవాడలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని మేరీస్టెల్లా కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి డిఎం హె చ్ఓ డా.ఎ.శ్రవణ్ బాబు, డిఇఓ ఎల్. చం ద్రకళ, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.కె.శాంతిశ్రీ తదితరులు హాజర య్యారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ & సాధికారత అధికారి రుక్సానా సుల్తానా బేగం మాట్లాడుతూ, గర్భం దాల్చిన వెంటనే గర్భిణీలు సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని గర్భిణీలు తప్పనిసరిగా తీసుకోవాలని, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. డిఎంహెచ్ఓ డా.ఎ.శ్రవణ్ బాబు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య, పోషకాహార సేవలను సమర్థవంతంగా అందిం చాలని సూచించారు.డిఇఓ ఎల్.చంద్రకళ మాట్లాడు తూ, కౌమార బాలికలు పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచిం చారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే బాలికలు చదు వుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి విద్యలో రాణించగలరని తెలిపారు.

నాగార్జున యూనివ ర్సిటీ ప్రొఫెసర్ డా.కె.శాంతిశ్రీ పోషకా హార ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రోటీన్లు, విటమి న్లు, ఖనిజ లవణాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. వివిధ ఆహార పదార్థాల్లో లభించే విటమిన్లు, వాటి ప్రాధాన్యత, ఆరోగ్యంపై వాటి ప్రభావాన్ని వివ రించారు. సీమంతాలు, సన్మాన కార్యక్రమాలుపోషణ మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని గర్భిణీలకు సీమంత కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా సుదీర్ఘకాలంగా సేవలందించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సిడిపిఓలు, సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 10 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు

### 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హత... జిల్లా కలెక్టర్, డాక్టర్ జి. లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో జాబ్ మేళాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.సెప్టెంబర్ 28, 2026 (సోమవారం) ఉదయం 9:00 గంటలకు నందిగామ నియోజకవర్గంలోని ఏపీ ఎన్జీవోస్ బిల్డింగ్, గాంధీ సెంటర్, నందిగామలో జాబ్ మేళా నిర్వహించనున్నారు.సెప్టెంబర్ 29, 2026 (మంగళవారం) ఉదయం 9:00 గంటలకు మైలవరం నియోజకవర్గంలోని డా.జకీర్ హుస్సేన్ డిగ్రీ కాలేజీ, ఇబ్రహీంపట్నంలో జాబ్ మేళా జరుగుతుంది. సెప్టెంబర్ 30, 2026 (బుధవారం) ఉదయం 9:00 గంటలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని SAV & NVJR డిగ్రీ కాలేజీ, జగ్గయ్యపేటలో జాబ్ మేళా నిర్వహించనున్నారు.

ప్రతి జాబ్ మేళాకు సుమారు 10 ప్రముఖ కంపెనీలు హాజరై వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు గల యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 నుంచి రూ.35, 000 వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆసక్తి మరియు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జాబ్ మేళాకు హాజరయ్యే సమ యంలో రెస్యూమ్/బయోడేటా,, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్, పాన్ కార్డు కాపీ, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు.

మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు నందిగామ జాబ్ మేళా – 28.09. 2026: 8919951682, 72072 08075 ఇబ్రహీం పట్నం జాబ్ మేళా – 29.09.2026: 950277 57755, 80083 76100 జగ్గయ్యపేట జాబ్ మేళా – 30.09.



2026: 9666815987, 96765 83213జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# పేద కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

### ప్రభుత్వ విప్,సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

### 12కుటుంబాలకు రూ.4.5లక్షలవిలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు కార్యాలయంలో సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 64వ డివిజన్ ప్రాంతానికి చెందిన 12 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.4.5లక్షల విలువైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు,డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కె. రవికుమార్తో కలసి అంద జేశారు.ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లా డుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుం బాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని అన్నారు. అనారోగ్యం, వైద్య చికిత్స వంటి అనుకోని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ప్రభు త్వం అండ గా ఉంటుందని తెలిపారు.

పేద ప్రజల కు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆర్థికం గా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు కూటమి ప్రభు త్వం కృషి చేస్తోందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయో జనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని బొం డా ఉమా స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను పరిష్క రించడమే తన ప్రధాన లక్ష్యమని, ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తన కార్యాలయాన్ని సంప్ర దించాలని సూచించారు, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలోని కూట మి ప్రభుత్వం పేదల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం, సామాజిక భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, 64వ డివిజన్ అధ్యక్షుడు కె. రవికుమార్, నవణితం ,ఎస్. కె బాబు,కోమరి రాజేష్, కంకణాల బాబు,జనసేన నాయకులు పుప్పాల శివ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి



బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం మోపిదేవి మండలం కోసూరువారిపాలెం గ్రామ సచివాలయం, గొల్లపాలెం అంగన్వాడీ కేంద్రం, ఉత్తర చిరువోలు లంక, అడపావారిపాలెం గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో కార్యాలయాలకు చేరుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో అలక్ష్యంగా ఉండవద్దని సూచించారు. హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు వేగవంతం చేయాలని, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా



చేయాలని సూచించారు.

# కలెక్టరేట్‌కు సైకిల్‌పై కలెక్టర్

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వాయు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు సందేశమిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి శనివారం సైకిల్‌పై కలెక్టరేట్‌కు చేరుకుని విధులకు హాజరయ్యారు. కలెక్టర్ సూచనల మేరకు కలెక్టరే ట్‌లోని వివిధ కార్యాలయాల అధికా రులు, సిబ్బంది కూడా సైకిల్ లేదా కాలినడకన విధులకు వచ్చారు. పర్యావరణహిత జీవన విధానా ల ను ప్రోత్సహిం చడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సాధించవచ్చని కలె క్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా



కలెక్టరేట్ ప్రాంగణంలోకి సైకిళ్లను మాత్రమే అనుమతించారు.

# డప్పు కళాకారుడికి సహాయం అందించిన లంకిశెట్టి బాలాజీ



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి: అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన మచి లీపట్నం శారదానగర్ డప్పు కళాకా రుడు కుటుంబానికి శనివారం లంకి శెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ తరఫున న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, 15వ డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ బాధిత కుటుం బానికి చేయూత అందించారు.మచిలీపట్నం నగరపాలక సంస్థకు31వ డివిజన్ కు చెందిన పులవర్తి సురేష్, శ్రీలక్ష్మి దంప తులు వృద్ధురాలైన తల్లి సులోచనతో ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. పులవర్తి సురేష్ డప్పు డప్పు కళాకారుడిగా కుటుంబాన్ని పోషించుకుంటూ ఉన్నాడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణించడంతో తల్లి భార్య ముగ్గురు పిల్లలతో చాలా పేదరికంలో ఉన్నాడు దురదృష్టవశాత్తు సెప్టెంబర్ 15 జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయాడు. ప్రాణాలతో కట్టుబట్టలతో బయటపడ్డారు. శనివారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ తరఫున లంకిశెట్టి దంపతులు బాధిత కుటుంబానికి బట్టలు నిత్యవసర వస్తువులు వంటసామాగ్రి కూరగాయలు పోషక ఆహారం మరియు 3,000 రూపాయలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ బాధ్యత కుటుంబానికి ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇంటి నిర్మాణానికి సామాగ్రిని అందజేయాలని కోరారు. నగర జనసేన పార్టీ అధ్యక్షులు గడ్డం రాజు మాట్లాడుతూ సర్వస్వం కోల్పోయిన పేద కుటుంబాన్ని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో 31 వ డివిజన్ జనసేన పార్టీ డివిజన్ ఇన్చార్జి ఉడుముల బుజ్జి, శారదా నగర్ యువజన సంఘం నాయకులు సంఘం రాజేష్, శ్రీను రాకేష్, కొమ్ము కూరి జాకబ్, కారుమూరి కళ్యాణ్ పాల్గొన్నారు.

# తెలుగు విభాగంలో డా. రాజు కు పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి : కృష్ణా విశ్వవిద్యాలయం నందు తెలుగు విభాగంలో "ఈతకోట సుబ్బారావు రచనలు – సమగ్ర పరిశీలన" అనే అంశంపై పరిశోధన చేసిన దేవరపల్లి రాజు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ అందుకు న్నారు. డా. దార్ల వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ బి. వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఎన్.వి. కృష్ణారావు లు పరిశోధనా గ్రంథాన్నీ పరిశీలించారు. ఈ నెల 7 వ తేదీన నిర్వహించిన వైవా పరీక్షకు ప్రొఫెసర్ ఎన్.వి. కృష్ణారావు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా హాజరయ్యారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష, రెక్టారు ఆచార్య యమ్. వి. బసవేశ్వరరావు, ఛైర్మన్ యన్. వి కృష్ణారావు, పరిశోధన పర్యవేక్షకులు డా. గుమ్మా సాంబశివరావు లు పాల్గొన్నారు. డాక్టరేట్ సాధించిన డా. రాజు ను పలువురు అభినందించారు.

# స్వర్గపురి దారే.. నరక ప్రాయం

### వసుమట్ల కాలనీ వాసుల దుస్థితి నెలలో రెండెవసారి పాడె మోసేందుకు నరక యాతన



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ అవనిగడ్డ పంచాయతీ వసుమట్ల ఎస్సీ కాలనీ వాసుల స్మశాన వాటిక రహదారి సమస్య పరిష్కరించే నాథుడే లేడా అని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు.80 ఏళ్ల స్వాతంత్రం ప్రజాస్వామ్య వ్యవస్థ నేటి పాలకుల దార్శినికతకు ఈ ఎస్సీ కాలనీలలో కనిపిస్తున్న దుస్థితికి అద్దం పడుతుంది, దళితుల అభివృద్ధి అటుంచి స్వర్గపురి ధారైన సవ్యంగా లేక వారు పడుతున్న అవస్థలు చూడమని మొరపెట్టుకుంటున్న గ్రామస్తులు ఆవేదన వినండి పాడె మోసేందుకు ప్రాణం మీదకు వస్తున్న దయనీయ పరిస్థితి చూడండి సంక్షేమం పరుగులు పెడుతుందని చెప్పే పాలకులారా విశాలమైన రోడ్లు వేస్తున్నామని ప్రచారం చేసుకునే నాయకులారా నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన అవనిగడ్డ పంచాయతీలో ఈ దుస్థితికి కారకులెవరో బదులిస్తారాగ్రామంలో నెలకొన్న చిన్న సమస్యను పరిష్కరించేందుకు అంత పెద్ద అధికార వ్యవస్థ రాజకీయ వ్యవస్థ ఎందుకు ముందుకు రావడం లేదని గ్రామస్తులు ప్రశ్ని స్తున్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఎందుకు నెరవేర్చరని పాలకులను ప్రశ్నిస్తున్నారు.

# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

ఆదివారం 27 సెప్టెంబరు 2026


# నష్టపోయిన మినుము రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి.

### కొత్తూరులో మినుము రైతులు ఆందోళన.

**ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు.**

వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన మినుము రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పెదపాడు మండలంలోని కొత్తూరు, కొత్తముప్పరు గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పర్యటించి నీట మునిగిన మినుము పంటను పరిశీలించారు. చనిపోయే దశలో ఉన్న మినుము పంటతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం ఉందని కృష్ణా డెల్టాలో వరి పంట వేయవద్దు ఆరుతడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం,వ్యవసాయ అధికారులు సూచనలతో రైతులు మినుము పంట సాగు చేశారని చెప్పారు. కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంతో మరో అవకాశం లేక రైతులు ఆరుపడి పంటలు సాగు చేశారని చెప్పారు. ఎల్ నినో తీవ్రత తగ్గి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్పినా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోలేదని, వర్షాలు వస్తే ఆరుతడి పంటలు దెబ్బ తింటాయని రైతులు ఎంత చెప్పినా పెడచెవిన పెట్టారని, ఇప్పుడు ఆరుతడి పంటలు సాగు



చేస్తున్న రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 4 రోజులుగా వర్షాలు కురిసి మినుముపంట నీట మునిగినా ఇంత వరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన కూడా చేయలేదని, రైతులను పలకరించిన పరిస్థితి లేదని విమర్శించారు. భారీ వర్షాలకు మినుము పంటతో పాటు జిల్లాలో వరి, అరటి, కూరగాయలు, ఆయిల్ పామ్ తదితర పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. పంట నష్టాలను వెంటనే నమోదు చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు,కౌలు రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, పంటల బీమా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మినుము పంట నష్టపోయిన చెడుగొండి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి పంట సాగు కోసం ముందుగా నారుమడి వేసి నీరు అందక ఎండిపోయే నష్టపోయానని, అధికారుల సూచనలు మేరకు మినుము పంట వేసి అధిక వరకు వర్షాలకు నష్టపోయానని పది ఎకరాల సాగులో దాదాపు రూ.3లక్షల వరకు నష్టపోయినని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మినుము రైతులు పాల్గొన్నారు.

# కాకుమాను రాజశేఖర్‌కు దళిత సేన ఘన నివాళి

### పలువురు నాయకులను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి:రవి ప్రకాష్



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

మాజీ లీడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ అకాల మరణం పట్ల దళిత సేన నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.శనివారం ఉదయం ఒంగోలులో రాజశేఖర్ పార్థివదేహానికి దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ.. కాకుమాను రాజశేఖర్ దళిత జాతికి ముద్దుబిడ్డగా,నిగర్వి గా, అందరితో ఆప్యాయంగా మెలిగే మనసున్న మంచి వ్యక్తిగా గుర్తింపు పొందారని అన్నారు.అనేకమంది నాయకులను ప్రోత్సహిస్తూ, వారికి తనవంతు సహకారం అందించిన గొప్ప వ్యక్తి రాజశేఖర్ అని పేర్కొన్నారు.ఆయన అకాల మరణం దళిత సమాజానికి, ఆయనను అభిమానించే వారికి తీరని లోటు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా దళిత సేన అధ్యక్షులు పింగుల ఈదియా,దళిత సేన లీగల్ సెల్ అధ్యక్షులు తేళ్ల జోసెఫ్ పాల్గొని రాజశేఖర్‌కు నివాళులర్పించారు.

# మంత్రి పార్థసారధిని, మర్యాదపూర్వకంగా కలిసి, ఏలూరు రేంజీ ఐజి జి.వి.జి.అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి..

**ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా**



పోలీసు పెరేడు గ్రౌండులో శనివారం పెదవేగి పోలీసు ట్రైనింగు సెంటరు( పిటిసి ) ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న స్టైఫండ్రీ క్యాడెటు ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల (ఎస్ఎస్సి టి పి సి) పాసింగు ఔట్ పరేడులో విశిష్ట అతిథిగా హాజరు అయిన రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ని, మర్యాదపూర్వకంగా కలిసి, ఏలూరు రేంజీ ఐజి జి.వి.జి.అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పూలమొక్కలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, ఏఎస్పీ వై.ప్రసాదరావు, ఏఆర్ ఏఎస్పీ జి.పులిరాజు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, పోలీసు అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వాసురెడ్డి నియామకం పట్ల హర్షాతిరేకాలు

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్రకు చెందిన ప్రముఖ వైసిపి నేత కర్రి వెంకట నారాయణ రెడ్డి( వాసు రెడ్డి) వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జగన్మోహన్ రెడ్డి నియమించడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే వాసిరెడ్డిని పెనుమంట్ర,పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వయం గా కలిసి శుభాకాంక్షలు తెలిపి, పూల మాలలతో అభినందించారు. వాసిరెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి కూడా కీలక బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలుపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారు. అంతేకాకుండా మండల పరిషత్ అధ్యక్షులుగా మండలంలోని గ్రామాలు అభివృద్ధికి కృషి చేసి ప్రజలు మనలను పొందు తున్నారు .ఈ సందర్భంగా వాసు రెడ్డి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తనని నియమించడం పట్ల అధినేత జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి, నియోజకవర్గం ఇంచార్జి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, జిల్లా పార్టీ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ క్షీరా రామలింగేస్వర స్వామి దేవుస్థాన కార్య నిర్వహణ అధికారిగా శ్రీనివాసరావు

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా రామలింగేస్వర స్వామి దేవుస్థాన నూతన కార్య నిర్వహణ అధికారి గా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, విజయ వాడ ఉత్తర్వులు మేరకు ఆర్ శ్రీనివాసరావు ఉద్యోగ బాధ్యత లు చేపట్టారు . ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మీసాల రామచంద్ర రావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు సమక్షంలో ఈఓ శ్రీనివాస్ రావు బాధ్యత లు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తు దేవస్థానం అభివృద్ధి కి మంత్రి నిమ్మల సమక్షంలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# మాజీ ఎంపిటిసి కోటి దైవ అలంకారం మృతి

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



పశ్చిమగోదావరి జిల్లా వెలివెల గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు కోటి దైవ అలంకారం(57) శనివారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమారుడు కలరు. ఆయన మృతికి టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సోదరుడు కోటి రాంబాబు, టిడిపి బీసీ సెల్ నాయకులు దుమ్మేటి ఏసుదాసు, ఎంపీటీసీ కండిబోయిన నాగేశ్వరరావు, కొప్పునీడి శ్రీను, బోడపాటి పెదకాపు, గెడ్డం జయప్రకాష్, నరసింహారావు, మేడిది రాజబాబు, విపర్తి ఏడుకొండలు, సంఘ పెద్దలు సంతాపం తెలిపి అంత్యక్రియ లో పాల్గొన్నారు.

# ఏలూరులో కూటమి నాయకుల భేటీ

### స్థానిక పోరుకు సమైక్యంగా సిద్ధం కావాలి



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సమైక్యంగా ముందుకు సాగాలని కూటమి నాయకులు నిర్ణయించారు. ఏలూరు రామచంద్రరావుపేటలోని కళ్యాణి ల్యాండ్‌మార్క్ హోటల్‌లో మూడు పార్టీల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.జిల్లా టీడీపీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు,కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలని సమావేశంలో చర్చించారు.అభ్యర్థుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తూ మూడు పార్టీల మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా సమన్వయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు.సంక్షేమం,అభివృద్ధిని ప్రధాన అజెండాగా ప్రజల ముందుకు వెళ్లాలని నాయకులు సూచించారు.స్థానిక ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమన్వయం చేసేందుకు ఏలూరులో 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి,జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.కూటమి శ్రేణులంతా “ఒకే మాట.. ఒకే బాట”తో పనిచేసి ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం లో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లు కొనసాగుతున్నాయని మంత్రులు పేర్కొన్నారు.ఏలూరు జిల్లాను అభివృద్ధిలో రోల్‌మోడల్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.



### నిమజ్జనం నేర్పే సత్యం.

ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే గణపతి స్వామి.

**ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు.**

నిమజ్జనం రోజున నీటిలో కరిగిపోయి, చివరికి మళ్లీ భూమిలో కలిసిపోతారు. ఈ సృష్టిలో పుట్టిన ప్రతీ ప్రాణి, ప్రతీ వస్తువు ఏదో ఒక రోజు ఈ ప్రకృతిలో కలిసిపోవాల్సిందే. అందుకే ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు. మనం కూడబెట్టే ఆస్తులు, హోదాలు, తాత్కాలిక బంధాలు, అహంకారాలు... ఏవీ మనతో పాటు శాశ్వతంగా ఉండవు.ఈ జీవితం చాలా చిన్నది. ఉన్న కొద్ది రోజుల్లో ఎవరికీ చెడు తలపెట్టకుండా, అందరితో ప్రేమగా ఉండాలి. మనం వెళ్ళిపోయేటప్పుడు ఏదీ వెంట తీసుకెళ్ళలేం.అందుకే ఉన్నంతలో మంచిగా జీవించండి... నలుగురికీ మంచి చేసి వెళ్ళండి! అదే నిజమజ్జనం మనకు నేర్పే అసలైన జీవిత సత్యం.

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ.

**ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయిగూడెం.**

స్థానిక సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయం రామ నరసయ్య భవనం నందు ఖమ్మంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం నాలుగవ జాతీయ మహాసభల పోస్టర్ ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రాఘవ మాట్లాడుతూ ఈ సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో ఖమ్మంలో అఖిలభారత రైతు కూలీ సంఘం నాలుగవ జాతీయ మహాసభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా




నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎల్ నినో ప్రభావం వలన ప్రస్తుతం రైతులు పంటలు పండించడానికి తీవ్రమైన భయాందోళనలకు గురవుతున్నారన్నారు. రైతులు తీసుకున్న అప్పులను పూర్తిగా రద్దు చేసి, కొత్త అప్పులను ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ జాతీయ మహాసభలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చర్చించుకోవడం జరుగుతుందన్నారు. కావున పెద్ద ఎత్తున రైతులు పాల్గొని జాతీయ మహాసభలను జయ ప్రదం చేయాలని కోరారు. అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈ. భూషణం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధరలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా కన్వీనర్ టి. బాబురావు, న్యాయవాది భాష శ్యాం బాబు, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు ఎం డి వి ప్రసాద్,రైతు కూలీ సంఘం మండల కమిటీ సభ్యులు కలుముల రాముడు, దువ్వెల గంగరాజు, నూపా పాపారావు, కలుమల లక్ష్మి, ఎం. నందా, బి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ ముగింపు వేడుకలు.

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

ఏలూరు జిల్లాలో 136 మంది సివిల్ పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ ముగింపు వేడుక ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఆవరణలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న చిత్తూరు జిల్లాకు చెందిన 136 మంది సివిల్ పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ ముగింపు వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థ



సారథి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ హాజరయ్యారు. వీరికి పోలీస్ అధికారులు, శిక్షణ సిబ్బంది, శిక్షణార్థులు ఘనస్వాగతం పలికారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళు గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా పెదవేగి డీటీసీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ, 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 136 మంది కానిస్టేబుళ్లను అభినందించారు. పోలీస్ ఉద్యోగం కేవలం వృత్తి మాత్రమే కాదని, ప్రజాసేవ, బాధ్యత, క్రమశిక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. నిజాయితీ, నిష్పక్షపాత వైఖరి, మానవత్వంతో విధులు నిర్వర్తించాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బలహీన వర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సమర్థవంతమైన పోలీసింగ్‌ను అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వై. ప్రసాద్ రావు, ట్రైనీ ఐఏఎస్ శ్యామ్ కుమార్ రెడ్డి, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటి.

**ప్రజాభూమి ప్రతినిధి- చాట్రాయి.**

చాట్రాయి గ్రామంలోని ప్రకృతి వ్యవసాయం చేయు అందే రాంబాబు వరి పొలాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివశంకర్ తన సిబ్బందితో శనివారంక్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగినది. అనంతరం ఆయన మాట్లాడుతూ పొలంలో వరి నాట్లు వేయకముందు పచ్చి రొట్టె ఎరువులు వేసే సమయంలో నవధాన్యాలు సాగు చేయడం ద్వారా వర్షపాతం లేనప్పటికీ కూడా ప్రక్కన ఉన్న రైతులతో పోల్చుకున్నట్లయితే ఈ నేలలో తేమశాతం ఎక్కువ ఉండడం గమనించడం జరిగినదనీ అన్నారు.కాబట్టి రైతులందరూ కురిసినటువంటి వర్షాన్ని



సమయపాలనతో సమపాళ్లలో వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మనము పంటను కాపాడుకోవచ్చనీ అంతేకాకుండా రసం పీల్చే పురుగులను నియంత్రించుటకు పసుపుపచ్చ అట్టలు కర్రలకి కట్టి ఎకరానికి 10 చొప్పున ఉంచడం మంచిదనీ జీవామృతం తన పొలంలోనే తొట్టిలో కలుపుకొని పంటపై చల్లడం ద్వారా నీళ్లల్లో వదిలిపెట్టడం ద్వారా పంట చాలా నాణ్యతగా ఉన్నదనీ కాబట్టి రైతులందరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవామృతంను పొలాల్లో వినియోగించుకుంటూ నీటి ఎద్దడిని తట్టుకుంటూ వర్షాభావ పరిస్థితుల్లో మన పంటను పది రోజులు వరకు కాపాడుకోవచ్చనీ అన్నారు. జీవామృతం తయారు చేసే విధానాన్ని డెమోల ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది డెమో ద్వారా చూపించడం జరిగినదనీ అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ,వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా జాయిన్ అయిన మండల పరిషత్ ప్రత్యేక అధికారి అయిన అగ్రికల్చరర్ ఏ డి మూరలకృష్ణ అధ్యక్షతన శనివారం పర్యావరణ పరిరక్షణ రోజు కావడం తో గ్రామాల్లో (వర్మి షేడ్లు పురోగతి) మరియు తడి చెత్త పొడి చెత్త సేకరణ శానిటేషన్ పరిసరాల పరిశుభ్రత మండల లెవెల్ అధికారులు ఎంపిడిఓ ఉమ మహేశ్వరరావు, తహసీల్దార్ దుర్గా కిషోర్, అగ్రికల్చర్ ఏ ఓ రాజశేఖర్, పీహెచ్ సి నుంచి గుడాల హరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి బాబు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్లు ఎ ఎన్ ఏం లు పాల్గొన్నారు.

# తుఫాన్ నష్టంపై తక్షణమే ఎన్యుమరేషన్ పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే చింతమనేని

**ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు**

తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెందులూరు నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటల వివరాలను తక్షణమే నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ప్రధానంగా అపరాల సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని,నీట మునిగిన ప్రతి ఎకరా పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట తీవ్రతను పక్కాగా అంచనా వేయాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క రైతు నష్టపోకుండా పారదర్శకంగా ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పెదపాడు మండలంతో పాటు నియోజకవర్గంలోని పలు మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం నమోదు చేస్తున్నారు.సర్వే నంబర్లు, పంట విస్తీర్ణం,నష్ట తీవ్రత తదితర వివరాలను ఈ-క్రాప్ ఆధారంగా నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు.నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారంతో పాటు పంటల బీమా ద్వారా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.



ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

ఆదివారం 27 సెప్టెంబరు 2026

# మహిళల ఆర్థిక సాధికారతే చంద్రబాబు విజన్

## డ్వాక్రా వి ఓఏ ,వి ఓబీ ల ఆత్మీయ సమావేశంలో మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

వైసిపి ఐదేళ్ల పాలన ధ్వంసం , విధ్వంసం తప్ప అభివృద్ధి సున్నా. గత ఐదేళ్ల నష్టాన్ని వడ్డీతో సహా భర్తీ చేసుకునేలా పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి రాత్రింబవళ్లు నిరంతరం శ్రమిస్తూ అధిక నిధులు తీసుకు రాగలుగుతున్నానంటే నా కుటుంబ సభ్యులైన పాలకొల్లు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమేనని రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలన్నదే చంద్రబాబు విజన్ అని, ఆ దిశగా అడుగులు వేస్తూ దేశానికే ఆదర్శంగా, స్ఫూర్తిగా డ్వాక్రా సంఘాలు నిలిచాయి అన్నారు. పూలపల్లి ఎస్ ఎస్ ఎస్ కళ్యాణ మండపంలో శనివారం పాలకొల్లు పట్టణ మరియు పాలకొల్లు మండలం డ్వాక్రా వీఓఏ, వీఓబీల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు వినాయక చవితి, దసరా పండుగలను పురస్కరించుకుని చీరలను అందజేశారు. సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ సమాజంలో సగం జనాభా మహిళలేనని, మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. డ్వాక్రా అంటేనే చంద్రబాబు అని ,మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేలా భారత దేశంలోనే తొలిసారిగా స్వయం సహాయక సంఘాల ఉద్యమాన్ని విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనన్నారు. మహిళల పొదుపు శక్తిని సంఘటిత శక్తిగా మార్చి, బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేశారని చెప్పారు.డ్వాక్రా సంఘాల ద్వారా లక్షలాది మహిళలు చిన్న వ్యాపారాలు, పశుపోషణ, కుట్టు కేంద్రాలు, ఆహార



ఉత్పత్తులు, హస్తకళలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారారని వివరించారు. ఒకప్పుడు కుటుంబ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడిన మహిళలు నేడు కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. డ్వాక్రా ఉద్యమ విజయాల్లో వీఓఏలు, వీఓబీల పాత్ర అత్యంత కీలకమని మంత్రి కొనియాడారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ నాయకులు అంటే ఎన్నికల సమయంలోనే కనిపిస్తారని ప్రజల్లో ఉండే భావనను ఎప్పుడు ప్రజలతో మమేకమవుతు పూర్తిగా మార్చివేసిన నాయకుడు మంత్రి నిమ్మల రామానాయుడు అని తెలిపారు. గత రెండు ఏళ్ల క్రితం బుడమేరు ముంపు గురైనప్పుడు ఎవరు ఉండని విధంగా రాత్రింబవళ్లు గట్టుపైనే ఉండి ముంపు నివారణ పనులను దగ్గరుండి చేయించారంటూ కొనియాడారు కూటమి నాయకులు కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చిన్నబాబు , కర్నేన గౌరు నాయుడు, జక్కంపూడి కుమార్, రియా, పాముల రజనీ కుమార్, పొట్నూరి శ్రీనివాస్, ఇంటి శ్రీరాముడు, పీతల శ్రీనివాస్, కొల్లి కొండ ప్రసాద్, ధనాన్ని సూర్యప్రకాష్, దాసరి రత్నం రాజు, పాలవలస తులసిరావు, మేడిది జాన్ రాజు , కలిదిండి రామచంద్ర రాజు,,దొడ్డ ఏడుకొండలు, మండేల రాంప్రసాద్, సత్యనారాయణ రాజు, నెక్కంటి ఆదినారాయణ, కిలారి రామారావు, వరద శేషు తదితరులు , పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# పెద్దాపురంలో ఇంటి దొంగతనం కేసు ఛేదింపు

## రూ.17 లక్షల నగదు, 105.4 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజాభూమి ప్రతినిధి–పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి ఓ నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.15 లక్షల నగదు, 105.4 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా సుమారు రూ.2 లక్షల విలువైన చోరీ సొత్తు రికవరీ కావాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దాపురం రామారావుపేటలోని ఆర్డీవో నివాసంలో జూలై 25వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఇంటి వెనుక తలుపు ద్వారా ప్రవేశించి, బీరువాలోని లాకర్‌ను తెరిచి సుమారు 276 గ్రాముల బంగారం, 48 గ్రాముల వెండి, రూ.75 వేల నగదును అపహరించాడు. దీని పై పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 194/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్, పెద్దాపురం ఎస్‌డీపీవో ఏబీజీ తిలక్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎలాంటి ప్రత్యక్ష క్లూస్ లభించకపోయినప్పటికీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.అడ్డతీగల మండలం కొత్త



పాలెం గ్రామానికి చెందిన మామిడి శివకుమార్ అలియాస్ శివ (30)ను వడ్లమూరు గ్రామ శివారులోని శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద పెద్దాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.15 లక్షల నగదు, 105.4 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం



చేసుకున్నారు.కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పెద్దాపురం ఎస్‌డీపీవో ఏబీజీ తిలక్, దర్యాప్తు అధికారి సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సీసీఎస్ సీఐ అంకబాబు, ఐటీ కోర్ సీఐ దుర్గా శేఖర్‌రెడ్డి, ఎస్ఐ యు.పాపారావు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ అభినందించారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

- ప్రత్యేక అధికారి మధుసూదన్.
- ఘనంగా స్వాగతం పలికిన కార్యాలయ సిబ్బంది.
- మండల అధికారులతో సమీక్షా సమావేశం.
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సూచనలు.

ప్రజా భూమి ప్రతినిధి–కాజులూరు.

తుఫాను ప్రభావత ప్రాంతాల్లో అధికారులు కనీస సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాజులూరు మండల ప్రత్యేక అధికారి ఎస్ .మధుసూదన్ రావు మండలస్థాయి అధికారులకు సూచించారు.కాజులూరు మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన





డ్వామా పిడి యస్. మధుసూదనరావు ఈ సందర్భంగా భాద్యతలు స్వీకరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.తొలుత ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న ఆయనకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు , మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అన్ని గ్రామాల వివరములు, పోలింగ్ బూతుల వివరములు అడిగి తెలుసుకున్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్య సహాయం, త్రాగు నీరు , పారిశుద్యం వంటి అంశాలపై తగిన శ్రద్ధ వహించాలని ఈసందర్భంగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబుతో పాటు పరిపాలనాధికారి పద్మలత, డిప్యూటీ ఎం. పి. డి. ఓ ముద్రగడ సత్యనారాయణ మూర్తి, కార్యాలయ సిబ్బంది, విబిజి రాంజీ కార్యాలయ సిబ్బంది , ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

## "చలో విజయవాడ" కార్యక్రమానికి వెళ్లేందుకు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులకు అనుమతి లేదు.

ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం

స్వర్ణ గ్రామం–స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో 27.09.2026న "చలో విజయవాడ" కార్యక్రమం నిర్వహించి, విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించేందుకు కొంతమంది ఉద్యోగులు సమీకరణకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసు శాఖ దృష్టికి వచ్చింది. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం, పెండింగ్‌లో ఉన్న 9 నెలల బకాయిలను విడుదల చేయడం, స్పష్టమైన పదోన్నతి మార్గాన్ని ఏర్పాటు చేయడం, G.O. No.11ను రద్దు చేయడం తదితర సర్వీస్ సంబంధిత డిమాండ్లపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం.ఈ కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు ఉద్యోగులకు ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి అనుమతి లేని కార్యక్రమానికి వెళ్లే ఉద్యోగులపై నిబంధనల మేరకు శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.కావున స్వర్ణ గ్రామ మరియు స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, అనుమతి లేని "చలో విజయవాడ" కార్యక్రమానికి వెళ్లకుండా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## గుమ్మరేగుల రామాలయం పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు



రౌతులపూడి మండలం గుమ్మరేగుల గ్రామంలోని పాత వీధిలో శిథిలావస్థకు చేరిన రామాలయం స్థానంలో నూతన రామాలయం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కోరారు.శనివారం ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పసగడుగుల రమణ నాయకత్వంలో గుమ్మరేగుల గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పురాతన రామాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, భక్తులు, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దాని స్థానంలో నూతన రామాలయం నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సమస్యను పరిశీలించి, సాధ్యమైన మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

## వి ఆర్ ఏ లకు పే స్కేల్ అమలు చేయాలి



ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు

పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ ప్రత్తిపాడు మండలానికి చెందిన వి ఆర్ ఏ లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కోరారు.శనివారం ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కలిసివి ఆర్ ఏ లు వినతిపత్రం అందజేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం తమకు గౌరవ వేతనం అందిస్తోందని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని తమకు పే స్కేల్ అమలు చేసే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వి ఆర్ ఏ లు ఎమ్మెల్యేను కోరారు.

# ప్రజాక్షేత్రంలో అందరివాడుగా జనసేన యువనేత డాక్టర్ దేగల నాగేంద్ర...!

- పవన్ మెచ్చిన జన సేవకుడు – ప్రజా నాయకుడుగా గుర్తింపు.
- పార్టీలకు అతీతంగా డిఎన్ఎఫ్ ద్వారా ఆపన్నులకు చేయూత.
- దాతృత్వంలో ఆదర్శప్రాయుడు నాగేంద్ర.
- సేవాకార్యక్రమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు.
- సేవ నుంచి రాజకీయాల వైపు మళ్లిన నాగేంద్ర దృష్టి.
- ఇంతకీ ఎవరీ నాగేంద్ర?

ప్రజాభూమి ప్రతినిధి–కాజులూరు

కాజులూరు మండలం బంధనపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేగల తిరుమలవేణి సత్యనారాయణ తనయుడు, డిఎన్ఎఫ్ వ్యవస్థాపకులు ,జనసేన యువనేత డాక్టర్ దేగల నాగేంద్ర చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలో ప్రజాక్షేత్రంలో ఆయన సేవలకు ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది . దీంతో నాగేంద్ర పార్టీలకు అతీతంగా అందరివాడుగా ప్రజల నుండి మన్ననలు పొందుతున్నారు.

సేవ నుంచి రాజకీయాల వైపు... ప్రజా సమస్యలే కేంద్రంగా సాగుతున్న ప్రయాణంలో దేగల నాగేంద్ర పేరు రాజకీయవర్గాల్లో వినిపించినప్పటికీ, ఆయన ప్రయాణాన్ని కేవలం రాజకీయ కార్యకలాపాలతోనే పరిచయం చేస్తే పూర్తి చిత్రం కనిపించదు. సామాజిక సేవా కార్యక్రమాలు, నిత్యం ప్రజా సమస్యలపై స్పందన, ఆ తర్వాతే రాజకీయ రంగంలోకి ప్రవేశం – ఈ మూడు అంశాల చుట్టూనే ఆయన ప్రయాణం సాగిందని ఆయన అభిమానులు



వర్గాలు చెబుతున్నాయి.

**ఆపన్నుల సేవకు ఒక రూపమే... డీఎన్ఎఫ్ సంస్థ**

దేగల నాగేంద్ర ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, నిరుపేద కుటుంబాలకు సహాయం వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బాలికల చదువు మధ్యలో ఆగిపోకూడదనే ఉద్దేశంతో వివిధ సందర్భాల్లో సుమారు 20 నుంచి 30 మంది బాలికలకు ఉచితంగా ఫీజులు, విద్యా సహాయం అందించినట్లు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన బాలికల వివాహాలకు సహకరించడం, వైద్య ఖర్చులు భరించలేని పలు కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడం, అవసరమైన వస్తువులు అందించడం వంటి కార్యక్రమాలు కూడా చేపట్టినట్లు తెలిపారు. రెడ్ క్రాస్ వంటి సేవా సంస్థల కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడంతో పాటు,ఆపదలో ఉన్న కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు డీఎ న్ఎఫ్ ప్రతినిధులు చెబుతున్నారు.

**ఇల్లు కాలిపోయినా వెంటనే స్పందిస్తూ....అండగా.**

అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన నిరుపేద కుటుంబానికి తిరిగి గృహ నిర్మాణం చేపట్టేందుకు సహాయం అందించిన సంద



ర్భాన్ని నాగేంద్ర సేవా కార్యక్రమాల్లో ఒకటిగా ఆయన అనుచరులు ప్రస్తావిస్తున్నారు. అనారోగ్యంతో వైద్యానికి డబ్బులు లేని పలు కుటుంబాలకు వైద్య సహాయం, చదువు కొనసాగించలేని విద్యార్థులకు విద్యా సహాయం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తమకు సాధ్యమైన మేరకు అండగా నిలవడం వంటి కార్య క్రమాలు కొనసాగుతున్నాయని వారు చెబుతున్నారు. "సమస్య ఏమిటి?" అని తెలుసుకోవడంతో పాటు, "తన వంతుగా ఏం చేయగలను?" అన్న దానిపై స్పందించడం నాగేంద్ర ప్రత్యేకతతో పాటు సేవా కార్యక్రమాల లక్ష్యమని ఆయన బృందం వివరించింది.

**తాగునీటి సమస్యపైనా తక్షణ స్పందన.**

ఇటీవల ఒక ప్రాంతంలో తాగునీటి సమస్య తన దృష్టికి రావడంతో తన సొంత ఖర్చులతో ప్రత్యేక వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు అందించే చర్యలు చేపట్టడంతో పాటు, సమస్య శాశ్వత పరిష్కారానికి సంబంధిత వ్యవస్థ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిం చినట్లు



ఆయన బృందం తెలిపింది. ప్రజా సమస్యలపై సమాచారం అందినప్పుడు క్షేత్రస్థాయిలో స్పందించడానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు.

**జనసేన పార్టీలో క్షేత్రస్థాయి కార్యకలాపాలు.**

సామాజిక సేవతో పాటు దేగల నాగేంద్ర రాజకీయ ప్రయాణంలో జనసేన పార్టీ తరపున ఆయన చేసిన కార్యకలాపాలు కీలకంగా మారాయి. తన బృందం తెలిపిన వివరాల ప్రకారం ఒక దశలో 3,000కు పైగా సభ్యత్వాల నమోదు చేయించి పార్టీ కోసం తన వంతు కృషి చేసి పార్టీలో దృష్టిలో నాగేంద్ర స్థానం సంపాదించుకున్నారు. సభ్యత్వ రుసుము చెల్లించే ఆర్థిక స్థోమత లేని కొందరికి ఫౌండేషన్ ద్వారా సహాయం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. అంతకు ముందు పలు విడతల లోనూ వందల సంఖ్యలో సభ్యత్వాల నమోదులో భాగస్వామ్యమైనట్లు ఈసందర్భంగా పేర్కొన్నారు.

**గ్రామాల్లో డిజిటల్ వ్యాన్ ద్వారా జనసేన సభ్యత్వాలకు శ్రీకారం.**



మారుమూల గ్రామాల్లో డిజిటల్ వ్యాను ఏర్పాటు చేసి జనసేన సభ్యత్వాలు చేర్పించేందుకు ప్రజలను చైతన్యపరిచే విధంగా పార్టీ కార్యక్రమాలపై అవగాహన కల్పించే ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. కార్యకర్తలను గ్రామస్థాయిలో సమన్వయం చేయడం, సభ్యత్వ కార్యక్రమాలను నిర్వహించడం, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడం వంటి కార్య కలాపాల్లో ఆయన పాల్గొంటున్నారని అనుచరులు పేర్కొన్నారు.

**కుటుంబ నేపథ్యం నుంచి రాజకీయ ప్రయాణం వరకు**

దేగల నాగేంద్ర రాజకీయ ప్రయాణంలో కుటుంబ నేపథ్యానికి కూడా స్థానం ఉంది. ఆయన తల్లి దేగల తిరుమల వేణి సత్యనారాయణ కాజులూరు మండలం బంధనపూడి గ్రామ సర్పంచ్‌గా పనిచేయడం తో పలు సందర్భాల్లో ఎదురైన పరిస్థితులు, అప్పటి రాజకీయ పరిణామాలు, కుటుంబపరమైన అనుభవాలే ప్రత్యేకించి ఆయనకు రాజకీయ ఆలోచనలపై ప్రభావం చూపినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. తరువాత జనసేన పార్టీలో చేరి, తాను నమ్మిన రాజకీయ విధానంతో పార్టీ విధివిధానాలు తోపాటు సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సా గుతున్నానని డాక్టర్ నాగేంద్ర తన మనసులో మాటను ప్రజాభూమి ప్రతినిధితో పంచుకున్నారు.

**ప్రజాసేవే... రాజకీయాలకు పునాది?**

దేగల నాగేంద్ర ప్రయాణాన్ని పరిశీలిస్తే సామాజిక సేవ, స్థానిక సమస్యలపై స్పందన, రాజకీయ కార్యకలాపాలు పరస్పరం అనుసంధానమై కనిపిస్తాయి. ఒక వ్యక్తి రాజకీయాల్లోకి ఎప్పుడు వచ్చాడన్నది ఒక అంశం మాత్రమే. అంతకుముందు సమాజంతో ఆయనకు ఉన్న సంబంధం ఏమిటి? రాజకీ యాల్లోకి వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు? ప్రజా సమస్యలపై ఎలా స్పందించారు? తన వనరులతో ఎలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు? వంటి అంశాలు కూడా ఆయన రాజకీయ ప్రయాణాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. దేగల నాగేంద్ర తన ప్రయాణాన్ని సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై స్పందన, జనసేన పార్టీ కార్యకలాపాలతో కొనసాగిస్తున్నట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి.

**సేవ ఒకరోజు కార్యక్రమం కానే కాదు...**

సేవా అనే సంకల్పం ఒకరోజు కార్యక్రమం కానే కాదని కష్టం వచ్చినప్పుడు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకోవడమే సేవ అన్న భావనతో ముందుకు సాగుతున్నట్లు దేగల నాగేంద్ర తాను ఇప్పటివరకు చేసిన సేవా కార్యక్రమాలుపై తన మనసులో మాటను పంచుకున్నారు.ఇకపై ప్రజాసేవలో తన ప్రయాణం ఏ రీతిలో ఉంటుందో వేచి చూడాల్సిందే.



# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

ఆదివారం 27 సెప్టెంబరు 2026


## రెజోనియా కంపెనీ టోల్ ఫ్రీ నెంబర్‌ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

### - : రైతుల అనుమానాల నివృత్తికి ప్రత్యేక హాట్‌లైన్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జిల్లాలో భారీ ఎత్తున ప్రారంభమైన విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి రైతులకు ఎటువంటి అపోహలు లేకుండా ప్రత్యేకంగా టోల్ ఫ్రీనెంబర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని విద్యుత్ ఉత్పత్తిని వివిధ ప్రాంతాలలోని గ్రిడ్‌లకు అనుసంధానించేందుకు హైపవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం సాగుతోంది. ఈ పనులను రెజోనియా కంపెనీ చేపట్టగా, సదరు కంపెనీతో రైతులు తమతమ సందేహాలను నేరుగా కంపెనీతో చర్చించే విధంగా ఒక హాట్‌లైన్ టోల్ ఫ్రీనెంబర్‌ని ఏర్పాటు చేశారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో హాట్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌ని (1800 309 4401) రెజోనియా కంపెనీ



ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాలా వరకు ట్రాన్స్‌మిషన్ టవర్ నిర్మాణాలు సాగుతున్న ప్రాంతాల్లోని రైతులు వివిధ సందేహాలతో సతమతమవుతున్నారని, వారి సం దేహాలు నివృత్తి కోసం ఈ హాట్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ ఎంతో దోహదపడుతుందన్నారు. హాట్‌లైన్ నెంబర్ వల్ల మధ్యలో ఎటువంటి దళారులు లేకుం డా నేరుగా రైతులు సదరు కంపెనీతో మాట్లాడేం దుకు వీలవుతుందన్నారు. ఇదొక మంచి పరిణామమన్నారు. అనంతపురం జిల్లాలో, రాయలసీమ జిల్లాలలో రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్స్ కి చాలా అవకాశాలు ఉన్నాయని, చాలావరకు ట్రాన్స్‌మిషన్ లైన్స్ బాగా ముందుకు వచ్చినట్లయితేనే సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజ్ అన్నీ కూడా జిల్లాలో ఇంకా పెంచడానికి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా రెజోనియా ప్రాజెక్టు హెడ్ గిరిప్రసాద్ మాట్లాడుతూ కర్నాటక నుంచి అనంతపురం జిల్లా మీదుగా కడపజిల్లా సీకే దిన్నెవరకు తమ ట్రాన్స్‌మిషన్ లైను పనులు సాగుతున్నాయని మా కంపెనీ పరిధిలో దాదాపు 40 వేలమంది వరకు రైతులు ఉంటారని, వారికి ఉపయోగపడే రీతిలో ఈ టోల్ ఫ్రీ నెంబర్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెంబర్ సోమవారం నుంచి శుక్రవారం వరకు పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందన్నారు. రైతులు తమకు ఎటువంటి అపోహలు ఉన్నా ఈ నెంబర్‌కి కాల్ చేసి తమతమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓడబ్ల్యు మేనేజర్ వినోద్, సీఎస్ఆర్ మేనేజర్ కృతిక లక్ష్మి, ఎక్స్‌క్యూజన్ మేనేజర్ జైకుమార్, రెజోనియా కంపెనీ ప్రతినిధి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## యువత భవితకు భరోసా కార్యక్రమంలో పాల్గొన్న :ఎంపీ అంబిక

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం నగరంలోని శ్రీ వాణి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని విద్యార్థులతో ముచ్చటించడం ఎంతో ఆనందంగా అనిపించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.



ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు, తీసుకోవాలని విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న కృషిని వివరించాను. శ్రీ వాణి కళాశాల ఫౌండర్ డాక్టర్ నారాయణమ్మ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యతో పాటు ఉచిత బస్సు సౌకర్యం, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు వంటి అనేక వసతులు కల్పిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న సేవలను అభినందించాను. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వనజమ్మ, కోఆర్డినేటర్ సుధీర్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదువుకోవాలి. నేటి సమాజానికి, మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నూతన నైపుణ్యాలను అలవర్చుకోవాలి. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలన్నారు ఎంపీ అంబిక. విద్యార్థులు మంచి విద్యతో పాటు చక్కగా మాట్లాడటం, క్రమశిక్షణతో వ్యవహరించడం, మన సంస్కృతి మరియు సంప్రదాయాలను గౌరవించడం వంటి విలువలను కూడా అలవర్చుకోవాలన్నారు. ఆత్మవిశ్వాసంతో స్వయం ప్రకాశంగా ఎదిగి, సమాజానికి మరియు దేశానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి. యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తు. వారి కలలకు, లక్ష్యాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు ఎంపీ అంబిక. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నాయకులు సత్య రామ్, వెంకటేశ్వర్ రెడ్డి, బంధుకు రాజా, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం

### మండల వ్యవసాయ అధికారి ఎన్ అన్వేష్ కుమార్

ప్రజా భూమి శింగనమల





శింగనమల: మండలంలో సాగు చేసిన పంటల వివరాలు, పశుగ్రాసం అవసరం--లభ్యత, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనపై వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శింగనమల రైతు సేవా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో, మండలంలోని ప్రతి సర్వే నంబర్‌లో పంటల సాగు జరిగేలా వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. విధానంలో సాగుపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని తెలిపారు.అలాగే ఉపాధి హామీ సిబ్బంది సహకారంతో అర్ధచంద్రాకార ట్రెంచుల తవ్వకాలకు అనువైన పొలాలను గుర్తించి, వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చీని, దానిమ్మ తదితర తోటల్లో ్రావీణూ విధానం ద్వారా కూరగాయలు, ఇతర స్వల్పకాలిక పంటలను సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్. అన్వేష్ కుమార్, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణరెడ్డి మృతికి టీడీపీ నేతల సంతాపం

ప్రజా భూమి నార్పల



మండలపరిధిలో ని కురగానిపల్లి గ్రామానికి చెందిన వర్దిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ద్విసభ్య కమిటీ సభ్యులు, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు కురగానిపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రంగారెడ్డి, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, సొసైటీ అధ్యక్షులు మహేష్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు ఎర్రినాగప్ప, మోహన్, నాయకులు గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, కేశవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీరాములు, పుల్లయ్య, రామాంజిరెడ్డి, వెంకటనారాయణ, శేషారెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్ఠకు ఎన్‌సీసీ విద్యార్థుల విరాళం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. పట్టణంలో స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్ఠాపన కోసం ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం రూ.లక్ష విరాళాన్ని విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులకు అందజేశారు. ఎన్‌సీసీ మేజర్ శేషు నాయకత్వంలో విద్యార్థులు ఈ విరాళాన్ని అందించారు. స్వామి వివేకానంద ఆశయాలు, యువతలో దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించేందుకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం దోహదపడుతుందని విద్యార్థులు తెలిపారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలనే ఉద్దేశంతో తమవంతు సహకారంగా విరాళం అందించినట్లు పేర్కొన్నారు. ఎన్‌సీసీ విద్యార్థుల సేవా దృక్పథాన్ని కమిటీ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధులు నిమ్మకాయల రాము, మార్కండేయులు, రాఘవేంద్ర, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

### రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

### ప్రజల సమస్యలపై పోలీసులు చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, వ్యవహరించాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి అనంతపురం

అనంతపురం నగరంలో పిటిసి యందు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించిన పాసింగ్ అవుట్ పెరేడ్" బ్యాచ్ 2025-26 కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి మాట్లాడుతూ.... పోలీస్ బాధ్యతలు చేపట్టే అభ్యర్థులు ఇప్పటివరకు విద్యావంతులుగా ఉండి నేటి నుంచి పోలీస్ సేవల్లోకి రావడం అభినందనీయమన్నారు. ఖాకీ యూనిఫార్మ్ అధికారంతో పాటు బాధ్యతను ఇచ్చిందని శిక్షణార్థులందరూ తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. పోలీసు బాస్ ఎవరు అంటే రోడ్డు మీద విధులు నిర్వహించే పోలీసు అని ప్రతిసారి గర్వంగా చెబుతుంటానన్నారు. రోడ్డు మీద కనిపించే ప్రభుత్వ ప్రతినిధులు మీరేనని మీ ప్రవర్తన ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. అన్ని ఉద్యోగాలకు వేళలు ఉంటాయని పోలీసులకు నిరంతరం బాధ్యత మాత్రమే ఉంటుందన్నారు. ప్రమాదాలకు ఎదురు వెళ్లి విధులు నిర్వహించేవారు పోలీసులు. పోలీసులు రక్షణ కల్పిస్తూ కాపలా కాస్తున్నారు కాబట్టే మనం పండుగలు చేసుకుంటూ హాయిగా నిద్రపోతున్నామన్నారు. ఎంతోమంది పోలీసులు త్యాగాలు



చేయడం వల్ల నేడు సమాజం ప్రశాంతంగా ఉందన్నారు. పోలీసులను చూసి రౌడీలు భయపడాలని ప్రజలు ప్రతి యూనిఫార్మ్ వెనుక ఓ మంచి పోలీసు ఉన్నాడన్నది గుర్తించే విధంగా పోలీసులు సమాజానికి బాధ్యతగా సేవ చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ పెరిగిపోతుందని ప్రతి ఒక్కరు టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని నేరస్తులు మిమ్మల్ని చూసి భయపడేలా పనిచేయాలన్నారు. పోలీస్ లు నిరంతరం అప్డేట్ అవుతూ మానవత్వంతో బాధ్యతతో పనిచేసి మిమ్మల్ని ఈ స్థాయికి తీసుకురావడానికి కష్టపడిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. యూనిఫార్మ్ ఓ నమ్మకం, బాధ్యత ను కల్పిస్తుంది బాధితులకు నమ్మకం కల్పించే విధంగా మన ప్రాంతానికి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద బ్యాచ్ అనంతపురం నుంచి పాసింగ్ ఔట్ జరగడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మీరు ఇకనుంచి తమదైన శైలిలో విధులు



నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ....తొమ్మిది నెలల పాటు శిక్షణను పూర్తి చేసుకుని విధుల్లోకి ప్రవేశిస్తున్న పోలీసులకు అభినందనలు తెలిపారు. నేటి నుంచి శిక్షణార్థులకు బాధ్యతలు ఉంటాయని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వహించాలన్నారు. పోలీసులుగా ఎంపికైన వారందరూ క్రమశిక్షణతో ఉన్నతాధికారుల సూచనలు సలహాలు పాటిస్తూ మీకు మీ కుటుంబానికి సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజలు పోలీసుల నుంచి న్యాయం, భద్రత, మంచి సేవలను ఆశిస్తారని వారి ఆశయాలకు అనుగుణంగా మీరు పని చేయాలన్నారు. సమాజంలో జరుగుతున్న అన్ని వర్గాల ప్రజల సమస్యలపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు న్యాయం అందించే విధంగా విధులు నిర్వహించాలని, పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఇండోర్, అవుట్ డోర్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు మొమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్ ,పిటిసి ప్రిన్సిపల్ సుప్రజ, ట్రైనింగ్ ఆర్ఐలు, ట్రైనింగ్ ఆర్ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, వీఐపీలు, పోలీసు అధికారులు సిబ్బంది, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు, అసోసియేషన్ ప్రెసిడెంట్ తలారి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్ - వీడియో, రీల్స్ కంటెస్ట్ లో విరివిగా పాల్గొనండి

### -ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించండి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురము

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్ అనే నినాదంతో రాయలసీమ ఉద్యాన పంటల సాగుతో ప్రపంచ స్థాయికి ఎగుమతి చేసే దిశగా లక్ష కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసే కార్యక్రమం రూపొందించి మదనపల్లి నందు రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల సమక్షంలో ప్రారంభించుకోనున్న నేపథ్యంలో దీనిపై ప్రజలలో విరివిగా అవగాహన కొరకు వీడియో/రీల్ కంటెంట్ కంటెస్ట్ ఆహ్వానించడం జరిగిందని సమాచార పౌర సంబంధాల శాఖ కోరుతోందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ ప్రాంతం దీర్ఘకాలంగా నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతోంది. తరచూ కరువులు, సరైన నీటిపారుదల వసతి లేకపోవడం వల్ల రైతులు తక్కువ ఆదాయం ఇచ్చే వర్షాధార పంటలపైనే ఆధారపడ్డారనీ, అయినప్పటికీ, ఈ ప్రాంత శీతోష్ణస్థితి విలువైన పండ్లు, కూరగాయల సాగుకు ఎంతో అనుకూలమని 2003లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవన రంగంలో నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు "ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ)"ను ప్రారంభించారనీ, ప్రస్తుతం ఉద్యానవన రంగాన్ని 'స్వర్ణాంధ్ర' సాధనకు మూలస్తంభంగా మార్చాలనే దృష్టితో సమీకృత ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక రూపొందించబడిందనీ తెలుపుతూ వీడియో కంటెస్ట్ వివరాలను తెలిపారు. రీల్ / వీడియో కాంటెస్ట్ ముఖ్య నిబంధనలు మరియు మార్గదర్శకాలు కాన్సెప్ట్ / థీమ్: ఈ ప్రాజెక్ట్ రాయలసీమ, ప్రకాశం మరియు మార్కాపురం ప్రాంతాలను భారతదేశపు "గ్లోబల్ హార్టికల్చర్ హబ్"గా ఎలా మారుస్తుందో సృజనాత్మకంగా



చూపించాలి. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, దాని ప్రభావం, వ్యవసాయ భవిష్యత్తు మరియు ఉపాధి అవకాశాలపై 60-90 సెకన్ల నిడివి గల వీడియోను రూపొందించాల్సి ఉంటుంది. పాల్గొనే కంటెంట్ క్రియేటర్స్ ఏదైనా ఒక జిల్లాను లేదా ఒక నిర్దిష్ట ఉత్పత్తినైనా ఎంచుకోవచ్చునని, ఇన్‌ఫ్లుయెన్సర్లు, వీడియో మేకర్లు, మీడియా, విద్యార్థులు లేదా ఎవరైనా పాల్గొనవచ్చనీ తెలిపారు. ఈ నెల సెప్టెంబర్ 26 నుండి ప్రారంభమై, సెప్టెంబర్ 30 మధ్యాహ్నం 12:00 గంటలకు ఈ కంటెస్ట్ ముగుస్తుంది. సెప్టెంబర్ 30 ఆఖరు నాటికి మధ్యాహ్నం 12 గంటల వరకు వచ్చిన వీడియోలలో ఉత్తమ5 వీడియోలను ఎంపిక చేసి, అక్టోబర్ 1వ తేదీన విజేతలకు తెలియజేస్తా రనీ, ఎంపికైన ఉత్తమ 5 వీడియోలను మదనపల్లి లో అక్టోబర్2న నిర్వహించే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ బహిరంగ సభ సమావేశంలో 50,000 మంది సమక్షంలో ప్రధాన కార్యక్రమంలో ప్రదర్శి స్తారు. అలాగే ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా సత్కారం అందుకుంటారనీ తెలిపారు.

## హీరోయిజం కాదు.. ప్రజా బలంతోనే మాట్లాడుతున్నాం

### రైతులకు ముందుగా కాలువ నీరు అందించాలి: వైఎస్సార్‌సీపీ నేతలు

ప్రజాభూమి నార్పల

నార్పల మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, సింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు పట్నం పనీంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే బురద చల్లుతున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం హీరోయిజం కాదని, ప్రజా బలంతోనే తాము మాట్లాడుతున్నామని స్పష్టం చేశారు.



డాక్టర్ సాకే శైలజానాథ్ పిలుపుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 6కు 6 జడ్పీటీసీ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు సినిమా డైలాగులు కాదని, పార్టీపై ప్రజల్లో ఉన్న నమ్మకం, కార్యకర్తల బలంతోనే చెబుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, పంటలు ఎండిపోకుండా ముందుగా కాలువలకు నీరు అందించడంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, సాగునీటి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలపై విమర్శలు చేయడం కంటే వాటికి పరిష్కారం చూపించడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అబ్జర్వర్ వెంకటనారాయణరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రమణ, శివారెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, వేదాంత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## యువతతోనే ఆదర్శ సమాజం సాధ్యం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఆదర్శ సమాజం, ఆరోగ్య సమాజం నిర్మాణం యువతతోనే సాధ్యమని ఉమ్మడి జిల్లాల హెచ్ఐవి ఎయిడ్స్ విభాగపు క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జి.వెంకటరత్నం, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ జి.వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.అంజలీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. హెచ్ఐవి ఎయిడ్స్ ప్రభావం యువతను నిర్వీర్యం చేయకుండా అడ్డుకోవడంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి విద్యార్థి హెచ్ఐవి ఎయిడ్స్‌పై కనీస అవగాహన కలిగి ఉండటంతో పాటు, వ్యాధి నివారణ మార్గాలపై సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్ఐవి వ్యాప్తి, నివారణ పద్ధతులపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్‌పై విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ముఖ్య అతిథులు నివృత్తి చేశారు. అపోహలకు తావులేకుండా శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం సమాజ హితం కోరే మంచి పౌరులుగా, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యశోదారాణి, హెచ్ఐవి ఎయిడ్స్ విభాగపు సిపిఓ ఈ.వీ.రమణ, చైతన్య స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆర్.తిప్పేస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
ఆదివారం 27 సెప్టెంబరు 2026

# 'సేవా సంకల్ప్ అభియాన్' క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు సన్మానాలు

## సేవా స్ఫూర్తితో అంగన్‌వాడీల బలోపేతం - చిన్నారులు, తల్లుల సంక్షేమమే బిజెపి లక్ష్యం




ప్రజాభూమి పోరుమామిళ్ల : గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, మహిళలు, గర్భిణీల ఆరోగ్య సంరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సేవలకు అరుదైన గౌరవం దక్కింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శ్రీ అవదూత కాశినాయన మండలం గంగనపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'సేవ సంకల్ప అభియాన్ - అంగన్‌వాడీ ఉత్సవం' అత్యంత వైభవంగా నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర నాయకులు, సేవ సంకల్ప అభియాన్ అంగన్‌వాడీ ఉత్సవాల బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ బుసిరెడ్డి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ కాశినాయన మండల సూపర్వైజర్ చంద్రకళ అధ్యక్షతన, బీజేవైఎం రాష్ట్ర నాయకులు, సేవ సంకల్ప అభియాన్ అంగన్‌వాడీ ఉత్సవాల బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ బుసిరెడ్డి మనోహర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పోషకాహార పథకాలను క్షేత్రస్థాయి లోకి విజయవంతంగా తీసుకెళ్లడంలో అంగన్‌వాడీల పాత్రను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, దేశ ప్రగతి చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలపైనే ఆధారపడి ఉంటుందని, దానికి అంగన్‌వాడీ కేంద్రాలే మూలస్తంభాలని పేర్కొన్నారు. గంగనపల్లె గ్రామీణ ప్రాంతంలో చిన్నారులలో పోషకాహార లోపాన్ని నివారించడానికి, వారికి ప్రాథమిక అక్షరాస్యతను అందించడానికి టీచర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం బిజేపీ కాశినాయన మండల అధ్యక్షుడు బిజీవేముల నారాయణ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శులు బుసిరెడ్డి ప్రశాంతి,ఎదురు భాస్కర్ రెడ్డి లు మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు సంపూర్ణ పోషణ వంటి పథకాలను సక్రమంగా అందించడంలో సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. చిన్నారుల బరువు, ఎత్తు వంటి ఎదుగుదల పారామితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది పడుతోందని వివరించారు.

**విజయవంతం చేసిన ఐసీడీఎస్ బృందం:** గంగనపల్లెలో అంగన్వాడి ఉత్సవాలు విజయవంతం కావడంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చంద్రకళ, హరిప్రియ, అంగన్వాడి టీచర్లు కీలక పాత్ర పోషించారు. కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై వారు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.సాధారణంగా విధుల ఒత్తిడిలో ఉండే తమను గుర్తించిన బిజెపి నాయకులు సన్మానించడం పట్ల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం తమలో మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు. గంగనపల్లె గ్రామంలో పండుగ వాతావరణంలో జరిగిన ఈ ఉత్సవాల పట్ల స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎదురు నాగార్జున రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, ప్రతాప్ రెడ్డి,అభిలాష్, ప్రసాద్ , బాలింతలు, గర్భిణీలు పలువురు అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# "దేశం చూడమ్మా... దిశలన్నీ తిరగమ్మా!" - ప్రపంచ పర్యాటక దినోత్సవ ప్రత్యేక వ్యాసం



ప్రజాభూమి పోరుమామిళ్ల :
"చదవడం కంటే చూడడం మేలు... పుస్తకం చెప్పలేని పాఠాన్ని ప్రపంచం నేర్పుతుంది!" మన పెద్దలు ఊరికే అనలేదు – "తిరిగే కాలు, అడిగే నోరు ఊరికే ఉండవు!" అని. ప్రయాణం అంటే కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడం మాత్రమే కాదు; కొత్త మనుషులను కలవడం, కొత్త సంస్కృతులను పరిచయం చేసుకోవడం, ప్రతి అడుగులోనూ కొత్త జీవిత పాఠాన్ని నేర్చుకోవడం.

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న జరుపుకునే 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా... ప్రయాణ ప్రాధాన్యతను, పర్యాటక సౌందర్యాన్ని మన సామెతల వెలుగులో ఒకసారి చూద్దాం!

"కూర్చొని తింటే కొండలైనా కరుగుతాయి... అదే కొండలు చూస్తే మనసు తేలికవుతుంది!"

ఇంట్లోనే నాలుగు గోడల మధ్య బంధీ అయిపోతే జీవితం ఒకే మూసలో సాగిపోతుంది. "ఉన్న ఊరు చిన్నదైనా... చూసే లోకం చాలా పెద్దది!" అంటారు. మన దైనందిన ఒత్తిళ్లను, ఆందోళనలను పక్కన పెట్టి కాసేపు ప్రకృతి ఒడిలోకి వెళ్తే లభించే ప్రశాంతత అమూల్యం. పచ్చని అడవులు, నింగిని తాకే పర్వతాలు, అలల సవ్వడులు మనస్సును కొత్త ఉత్సాహంతో నింపుతాయి.

"దేశాలు తిరిగినవాడు... దేవుడితో సమానం!"

ఒక సామెత ఉంది – "చదువుకున్న వానికంటే అనుభవజ్ఞుడే మిన్న." పుస్తకాల్లో చదివే నదుల వర్ణనలు, చరిత్రల కంటే... సొంతంగా అక్కడికి వెళ్లినప్పుడు కలిగే అనుభవం గొప్పది. ప్రపంచాన్ని చుట్టి వచ్చిన కొద్దీ మనిషిలో జ్ఞానంతో పాటు నమ్రత పెరుగుతుంది. వైవిధ్యాన్ని గౌరవించడం, భిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడం అలవడుతుంది.

"ఆచారాలు వేరైనా... అనుబంధాలు ఒకటే!"

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా... ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా!" అన్నట్లుగా, మనం పర్యటించిన ప్రతి ప్రాంతం మనకు కొత్త మిత్రులను ఇస్తుంది. "దేశ భాషలందు తెలుగు లెస్స" అయినా, ప్రయాణంలో మాట్లాడే "ఆప్యాయత" అనే భాషకు హద్దులు లేవు. కొత్త ప్రదేశాలలో స్థానిక ఆహారాన్ని రుచి చూడటం, వారి జీవన విధానాన్ని గమనించడం మన అనుభవాల పరిధిని విస్తరింపజేస్తుంది.

పర్యాటకులకు చిన్న మనవి: "తీసుకెళ్తే జ్ఞాపకాలు... వదిలేస్తే పాదముద్రలు!" మనం పర్యటించే ప్రదేశాల సౌందర్యాన్ని కాపాడటం కూడా మన బాధ్యతే. "ఇల్లు చూసి ఇల్లాలుని చూడు... పర్యాటక ప్రాంతం చూసి పర్యాటకుడిని చూడు!" అనే కొత్త మాటను పాటిద్దాం. ప్లాస్టిక్ చెత్తను పడేయకండి. స్థానిక సంస్కృతికి, పర్యావరణానికి భంగం కలి గించకండి. "సురక్షితమైన ప్రయాణం- సమగ్రమైన ఆనందం" అని గుర్తుంచుకోండి.

ముగింపు: ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున ఒక కొత్త నిర్ణయం తీసుకుందాం. "కాలం వేగంగా పరుగెడుతుంది... ప్రయాణ జ్ఞాపకాలు మాత్రమే శాశ్వతంగా నిలుస్తాయి!" కాబట్టి, బ్యాగ్ సర్దుకోండి, కొత్త దారులను వెతకండి, ప్రపంచాన్ని కళ్లారా చూడండి! ప్రపంచ పర్యాటక దినోత్సవ శుభాకాంక్షలు!

వ్యాసరచన : బొల్లు రామమోహన్, రచయిత, పోరుమామిళ్ల.

# పోలీసు అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా

- క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వహించాలి: మంత్రి సవిత
- దీక్షాంత్ పరేడ్‌లో 521 మంది నూతన కానిస్టేబుళ్లకు అభినందనలు




ప్రజాభూమి, సిద్దవటం: పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యం, మానవత్వం అత్యంత కీలకమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత అన్నారు. పోలీసు అంటే భయం కాదని, ప్రజలకు భరోసా అనే భావన కలిగేలా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని నూతన కానిస్టేబుళ్లకు సూచించారు. సిద్దవటం మండలం బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసు పరేడ్ మైదానంలో శనివారం తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 521 మంది నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సవిత నూతన కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞానం, కొత్త చట్టాలపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ పోలీసు యూనిఫాం గౌరవంతో పాటు గొప్ప బాధ్యతను కూడా ఇస్తుందన్నారు. ప్రజలతో మర్యాదగా, నిష్పక్షపాతంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ బాధితులకు అండగా నిలవాలని సూచించారు. "క్రమశిక్షణతో విధి.. నిజాయితీతో సేవ.. మానవత్వంతో ప్రజలకు రక్షణ" అనే స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దారుఢ్యం, విధి నిర్వహణ నైపుణ్యాలను సేవలో కొనసాగించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యతని, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నూతన కానిస్టేబుళ్లకు మంత్రి సవిత, కలెక్టర్, ఎస్పీ పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, పోలీసు అధికారులు, సిబ్బంది, నూతన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్ ఆర్థిక మాంత్రికుడు, కారణజన్ముడు

## - భారతరత్నకు మన్మోహన్ సింగ్ అన్ని విధాలా అర్హుడు
## - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె
భారత మాజీ ప్రధాని, పద్మవిభూషణ్ స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ 94వ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ విశిష్టమైన రాజకీయ నాయకుడని కొనియాడారు. దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆర్థిక మాంత్రికుడిగా, కారణజన్ముడిగా అభివర్ణించారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్, యూజీసీ చైర్మన్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఆర్థిక మంత్రి, ప్రధానమంత్రిగా ఆయన దేశానికి విశేష సేవలందించారని తెలిపారు. 1991లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యాహక్కు వంటి కీలక చట్టాలు ఆయన పాలనలో అమలులోకి వచ్చాయని తెలిపారు. మన్మోహన్ సింగ్ నిరాడంబరుడు, స్థితప్రజ్ఞుడు, గొప్ప పరిపాలనా దక్షుడని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తులసి రెడ్డి పేర్కొన్నారు. భారతరత్న పురస్కారానికి ఆయన అన్ని విధాలా అర్హుడని, కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి అలివేలమ్మ, జయశ్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, వెంకటేశు, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఏపీ టీం మేనేజర్‌గా మాస్టర్ నాయబ్ రసూల్




ప్రజాభూమి పోరుమామిళ్ల :
మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నందు అక్టోబర్ 2, 3, 4 తేదీలలో జరగనున్న సబ్ జూనియర్, జూనియర్ జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా పోరుమామిళ్ళకి చెందిన మాస్టర్ నాయబ్ రసూల్‌ను ఏపీ టీం మేనేజర్‌గా నియమిస్తూ న్యూ ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సి. ఫెయిజ్ వేణుగోపాలరావు ఆదేశాలు జారీ చేసినట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. ఈ బాధ్యతను అప్పగించిన న్యూ ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌కు మాస్టర్ నాయబ్ రసూల్ కృతజ్ఞతలు తెలిపారు.

# స్వచ్ఛత షెడ్‌లో పీడీఓలు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

## - తడి, పొడి, హానికర వ్యర్థాల నిర్వహణపై అవగాహన

ప్రజాభూమి, వేంపల్లె
మండలంలోని పీడీఓలు, గ్రీన్ అంబాసిడర్లకు ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా వేంపల్లె గ్రామ పంచాయతీ స్వచ్ఛత (ఎస్‌డబ్ల్యూసీపీ) షెడ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పులివెందుల డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ), వేంపల్లె ప్రత్యేకాధికారి వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాలసేకరణ,వేరుచేయడం, పునర్వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానం, బిన్ బ్యాగ్ విధానం,వర్మీ కంపోస్టు తయారీ, స్వచ్ఛ రథం నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో పీడీఓలు, గ్రీన్ అంబాసిడర్లు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. ప్రజలకు చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి అందించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.



# దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

## - అంత్యోదయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలి
## -: బీజేపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం



ప్రజాభూమి, సిద్దవటం: వంతెనపల్లి పోలింగ్ స్టేషన్ నంబర్ 12 పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మంగేరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్తగా, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాతగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశానికి విశిష్ట సేవలు అందించారని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దేశంలోని ప్రతి చిట్టచివరి వ్యక్తికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల భాస్కర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి భూశి కిరణ్‌కుమార్‌రెడ్డి, యువమోర్చా సభ్యుడు ముసలి బాలకృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా సభ్యుడు కాకర్ల మోహన్‌రెడ్డి, బత్తల శ్రీధర్, ఎస్సీ మోర్చా సభ్యుడు కోలా కాశి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా బంద్

## - మట్టటర్ రిపేరు చెయ్యాలని అధికారులకు విజ్ఞప్తి



ప్రజాభూమి, ఒంటిమిట్ట: రాజగుడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాచపల్లి గ్రామంలో తాగునీటి సరఫరా మోటారు నాలుగు రోజులుగా పనిచేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెయిన్‌రోడ్డులోని నీటి సరఫరా మోటారు పనిచేయకపోవడంతో సంబంధిత ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్థులు తెలిపారు. తాగునీటితో పాటు రోజువారీ అవసరాలకు కూడా ఈ నీటి సరఫరాపైనే ఆధారపడే కుటుంబాలు ఉండటంతో, ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మోటారు పనిచేయడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. వెంటనే మోటారును మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని, అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయంగా తాగునీటిని సరఫరా చేయాలని రాచపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

# భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములు స్వాధీనం



ప్రజాభూమి పోరుమామిళ్ల : కాశీనాయన మండలం నాయనపల్లె రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ హెచ్చరించారు. కోర్టు పరిధిలో ఉన్న 8 ఎకరాలను మినహాయించి, మిగిలిన ప్రభుత్వ భూములను రెవెన్యూ శాఖ ఆధీనంలోకి తీసుకుని ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి వెంకటేష్, వరికుంట్ల బాబు, బాల ఓబయ్య తదితరులు ఆర్డీఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయనపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 129, 130, 217లో పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న వందలాది ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయని వారుఆరోపించారు. భూముల్లోకి వెళ్లే పేదలపై దాడులకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులపై నమోదైన కేసులను పరిశీలించి న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత గ్రామాల పేదలు, దళితులు పాల్గొన్నారు.


# 28న కడప సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలి



ప్రజాభూమి పోరుమామిళ్ల : కడపలో ఈ నెల 28న జరిగే సీపీఐ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు పోరుమామిళ్ల పట్టణంలోని పురవీధుల్లో దుకాణాలకు కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలను సభకు ఆహ్వానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, విభజన హామీల సాధన కోసం ప్రజలు ఉద్యమించాలని వారు కోరారు. కడప ఉక్కు పరిశ్రమ, చక్కెర ఫ్యాక్టరీ పనులు ప్రారంభించడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, నిత్యావసర ధరలు తగ్గించడం, ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ బోర్డుల ఏర్పాటు, పేదలకు ఇళ్ల స్థలాలు, భూమి పంపిణీ తదితర అంశాలపై సీపీఐ రాష్ట్ర ప్లీనరీలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు నాయకులు తెలిపారు. సోమవారం కడపలో జరిగే ర్యాలీ, బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని వారు కోరారు.

# టిడిపిని వీడి వైఎస్సార్‌సీపీలోకి పలువురు

## - ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో పలువురి చేరిక



ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఇడుపులపాయలో టిడిపికి చెందిన పలువురు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని ఇడుపులపాయ పంచాయతీ పరిధిలోని మారుతినగర్‌కు చెందిన వారు గండి దేవస్థానం మాజీ చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ అవినాష్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పెద్దింటి చిన్నరెడ్డయ్య, పెద్దింటి బాబు, తుమ్మలూరు కుళ్లాయప్ప, బంగారు గంగయ్య, పెద్దింటి విష్ణువర్ధన్, యంగళ్ల విశ్వనాథ్, మామిళ్లపల్లి చిన్న కుళ్లాయప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి శ్రావణ్‌కుమార్, పి.జి. గోపినాథ్, సుధాకర్, సుకర్ణ, మాజీ ఉపసర్పంచ్ కోలా శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ హనుమంతు, రామాంజనేయులు, వెంకటరత్నం, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యావంతులు పోలీస్ సేవల్లోకి రావడం అభినందనీయం

- పోలీస్ శాఖలో పెండింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత - జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- కానిస్టేబుల్ ప్రజలకు అత్యంత చేరువగా ఉండే ప్రభుత్వ ప్రతినిధి: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- శిక్షణలో సాధించిన క్రమశిక్షణను విధుల్లో కొనసాగించాలి: ఎస్పీ తుషార్ డూడి

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

ఉన్నత విద్యావంతులు పోలీస్ సేవల్లోకి రావడం అభినందనీయం అని పోలీస్ శాఖలో పెండింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక చిత్తూరు జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో బ్యాచ్‌కు చెందిన 142 మంది(శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన,పోలీస్ కానిస్టేబుల్ శిక్షణార్థులు తొమ్మిది నెలల కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. పాసింగ్ అవుట్ పరేడ్ అనేది పోలీస్ కానిస్టేబుల్ శిక్షణార్థులు తమ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని పోలీస్ శాఖలో విధుల్లోకి ప్రవేశించడాన్ని సూచించే ముఖ్యమైన కార్యక్రమం. ఈ సందర్భంగా శిక్షణార్థులు క్రమశిక్షణతో నిర్వహించిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ, యువజన క్రీడల శాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చుడా చైర్మన్ కటారి హేమలత, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ట్రైనీ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ, పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది, శిక్షణార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ, యువజన క్రీడల శాఖ మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో 5,000 కానిస్టేబుల్ పోస్టులకు ఒకేసారి నోటిఫికేషన్ జారీ చేసి నియామక ప్రక్రియను పూర్తి చేసినట్లు చెప్పారు. చిత్తూరు డీటీసీలో 142 మంది కానిస్టేబుల్ శిక్షణార్థులు తొమ్మిది నెలల కఠిన శిక్షణను పూర్తి చేసుకుని విధుల్లోకి అడుగుపెడుతున్నందుకు అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, విధుల్లో నిజాయితీ, బాధ్యతతో వ్యవహరించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని శిక్షణార్థులకు సూచించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ నేరాలు వంటి కొత్త సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరమన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన యువత పోలీస్ శాఖలో చేరి సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ ఉద్యోగాన్ని ఎంచుకోవడం అభినందనీయమన్నారు. ప్రజలకు నాణ్యమైన, మెరుగైన పోలీస్ సేవలు అందించేలా విధులు నిర్వహించాలని సూచించారు. శిక్షణార్థులకు ప్రభుత్వం అందించే స్టైఫండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,000కు పెంచినట్లు తెలిపారు. రానున్న




కాలంలో పోలీస్ శాఖతో పాటు డ్రైవర్, ఫైర్ సేఫ్టీ, ట్రాన్స్‌పోర్ట్ తదితర విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న పోస్టులను కూడా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, తొమ్మిది నెలల శిక్షణను పూర్తి చేసుకుని విధుల్లోకి ప్రవేశిస్తున్న 142 మంది కానిస్టేబుళ్లకు అభినందనలు తెలిపారు. నేటి నుంచి ప్రతి ఒక్కరిపై బాధ్యతలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోలీస్ కానిస్టేబుల్ ప్రజలకు అత్యంత చేరువగా ఉండే ప్రభుత్వ ప్రతినిధి అని, ప్రభుత్వ వ్యవస్థకు ప్రజల ముందు కనిపించే ముఖంగా కానిస్టేబుల్ కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ప్రజలు పోలీసుల నుంచి న్యాయం, భద్రత, మంచి సేవలను ఆశిస్తారని తెలిపారు. విధుల్లో భాగంగా సమాజంలోని వివిధ వర్గాలతో, ముఖ్యంగా బలహీన వర్గాలు, బాధితులు, నేరాలకు సంబంధించిన వ్యక్తులతో వ్యవహరించాల్సి ఉంటుందని, ప్రతి సందర్భంలో చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు న్యాయం అందించే విధంగా విధులు నిర్వహించాలని, పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని అంకితభావంతో పనిచేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ, తొమ్మిది నెలల క్రితం శిక్షణ కోసం వచ్చిన యువతను డీటీసీ చిత్తూరు శిక్షణ ద్వారా క్రమశిక్షణతో కూడిన పోలీస్ సిబ్బందిగా తీర్చిదిద్దిందన్నారు. శిక్షణ సమయంలో సాధించిన క్రమశిక్షణ, ఉత్సాహం, సమర్థత పాసింగ్ అవుట్ పరేడ్‌లో స్పష్టంగా కనిపించాయని తెలిపారు. ఇకపై ప్రతి ఒక్కరూ నీతి, నిజాయితీతో పనిచేసి తమ కుటుంబాలకు, డీటీసీ చిత్తూరుకు, పోలీస్ శాఖకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శాంతిభద్రతలు, లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన శిక్షణార్థులను అధికారులు అభినందించారు. పాసింగ్ అవుట్ పరేడ్‌ను తిలకించిన శిక్షణార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల పై అవగాహన



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

మా అభియాన్ పోషణ్అనేది దేశవ్యాప్తంగా పోషకాహార లోపాన్ని నివారించడానికి, ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం.పోషణ్ మా అభియాన్ ముఖ్యంగా గర్భిణీ స్త్రీలుబాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం. రక్తహీనత (అనీమియా) సమస్యను తగ్గించడం. చిన్నారులఎదుగుదలకు అవసరమైనపోషకాహారాన్ని అందించడం. గర్భిణులు,బాలింతలకు సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పిస్తూ. యుక్తవయస్సుబాల బాలికల్లో పోషకాహారంపైఅవగాహన పెంపొందించడం.తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ ఆహారం అందించే విధానాలపై అవగాహన కల్పించడం. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం. పోషణ్ మా అభియాన్‌లో ప్రధానంగా చేపట్టే కార్యక్రమాలు గర్భిణులకు పోషక విలువలతో కూడిన ఆహారంపై అవగాహన.బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం. ఆరు నెలల తర్వాత శిశువులకు అనుబంధ ఆహారం అందించడం. చిరుధాన్యాలు,ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయల వినియోగాన్ని ప్రోత్సహించడం. రక్తహీనత నివారణకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రాముఖ్యతను వివరించడం.పిల్లల బరువు, ఎత్తు కొలిచి ఎదుగుదలను పర్యవేక్షించడం.పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. ఆరోగ్య శాఖ పాత్ర. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి పోషణ్ మా అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలబాలికలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం. పోషణ్ మా అభియాన్ నినాదం ఉద్దేశమని తెలిపారు.

## తిరుపతిలోని శిల్పారామంలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రోజున తిరుపతిలోనిశిల్పారామం, ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్, పర్యాటక, సాంస్కృతిక శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పర్యాటక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, మన రాష్ట్ర సాంస్కృతిక వైభవం, కళలు మరియు సంప్రదాయాలను ప్రజలకు పరిచయం చేసే ఉద్దేశంతో ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు తదితర కళారూపాల ప్రదర్శనలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఆదివారం సాయంత్రం 06:00 గంటల నుండి రాత్రి 08:00 గంటల వరకుతిరుపతిశిల్పారామంలో,శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు మరియు ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు జరగనున్నాయి.ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో తిరుపతి ప్రజలు, పర్యాటకులు, కళాభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని మీడియా ముఖంగా తిరుపతి నగర ప్రజలును ఆహ్వానిస్తున్న రమణ ప్రసాద్ రీజనల్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపీటీడీసీ, జనార్ధన్ రెడ్డి జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి, తిరుపతి, శ్రీనివాస రావు డివిజనల్ మేనేజర్, ఏపీటీడీసీమరియు ఖాదర్ వల్లి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తెలిపారు.

## వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి..

### వీఆర్ఏల నిరసనకు సిఐటియు సంఘీభావం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్




రాష్ట్రంలో ఉన్న గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లకు ప్రభుత్వం పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ గత వారం రోజులుగా వీఆర్ఏలు మండల తాసిల్దార్ కార్యాలయాల వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపడుతున్న సంగతి అందరికీ విధితమే. ఇందులో భాగంగా శనివారం శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏలకు సిఐటియు సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, అలాగే అర్హులైన వీఆర్ఏలను వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని సిఐటియు తరఫున డిమాండ్ చేశారు. అలాగే నామిని వీఆర్ఏలను రెగ్యులర్ వీఆర్ఏలుగా క్రమబద్ధీకరించాలని కోరారు. వీఆర్ఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటాలు ఉధృతం చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంధం మణి, వీఆర్ఏలు బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి జన్మదిన సందర్భంగా మొక్కలు నాటిన పేట బ్రదర్స్ మిత్రబృందం



ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

జనసేన పార్టీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొని జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ సూచనలతో సేనాతో సేనాని కార్యక్రమాన్ని నిర్వహించి సమాజం పట్ల బాధ్యత, మంచి ఆలోచన విధానం ఉన్నటువంటి వందలాదిమంది నాయకులను గుర్తించి అదేవిధంగా పిఠాపురంలో వేలాదిమంది జనసైనికులతో స్వయంగా కలిసి సరికొత్త కార్యాచరణ చేయడంలో, అదేవిధంగా తెలంగాణ మున్సిపల్ ఎలక్షన్స్ లో ప్రతి ఒక్క కార్పొరేటర్ ను ధైర్యంగా నడిపించే దిశగా కృషిచేసి, పవన్ కళ్యాణ్ కలలను సాకారం చేసే దిశగా తెలంగాణలో అతి తక్కువ సమయంలోనే లక్షలాది మంది జనసైనికులను ఒక తాటిపైకి తీసుకొని వచ్చి నిరంతరం కృషి చేస్తున్నటువంటి రామ్ తాళ్లూరి జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, గంధం శ్రీను, రమేష్ బాబు, ఆరిఫ్, కల్లిపూడి వెంకటేష్, దినేష్, దివాకర్, సాయి వీర మహిళ శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు

# సుబ్రహ్మణ్యస్వామి వారి కొండ ఆక్రమణ యత్నంపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

- ఆలయ భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.
- శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కొండ ను తవ్వేస్తున్న విజువల్స్ బయట వచ్చినా కూడా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరం.
- సనాతన ధర్మ పవన్ కళ్యాణ్ శ్రీకాళహస్తి వైపు ఒకసారి చూడు.
- విజ్ఞానగిరి అక్రమాణాలపై దేవస్థానం ఈవో కు వినతి పత్రం సమర్పించారు.

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన విజ్ఞానగిరి (కుమారస్వామి తిప్ప) పై వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి కొండను తెలుగుదేశం పార్టీ నాయకుడు అక్రమంగా తవ్వుతూ ఆక్రమించుకోవడాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ఈ దారుణ సంఘటనా స్థలాన్ని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఈరోజు నేరుగా సందర్శించారు. కొండను బ్రేకర్ యంత్రాలతో తవ్వి వేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పవిత్రమైన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సాక్షాత్ కుమారస్వామి కొండను సైతం వదలకుండా టీడీపీ నాయకుడు బహిరంగంగా ఆక్రమణలకు పాల్పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? హిందువుల పవిత్ర మనోభావాలను, నమ్మకాలను దెబ్బతీస్తూ దేవాలయ భూములను దోచుకుంటున్నా ఇప్పటివరకు సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత శోచనీయం.ఆలయ సిబ్బంది ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నప్పటికీ, తవ్వకాలకు ఉపయోగించిన యంత్రాలను సీజ్ చేయకుండా, ఈ ఘటన బయటకు రాకుండా తొక్కిపెట్టే ప్రయత్నం చేయడం వెనుక ఉన్న మర్మమేమిటి గతంలో ఎంతో శ్రమించి ఆరు ఇళ్లను ఖాళీ చేయించి వినాయకుడి మండపాన్ని, పిల్లర్ నిర్మాణాలు పూర్తి చేశామని, అయితే ఇప్పుడు అనుమతులు లేకుండా వేల సంవత్సరాల చరిత్ర కలిగిన సుబ్రహ్మణ్యస్వామి కొండను ఆక్రమిస్తుంటే అధికారులు చూస్తూ ఊరుకోవడం తగదని ప్రశ్నించారు. అక్రమ



నిర్మాణాలు పై ఇఓ మరియు ఎమ్మెల్యే స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, హిందూత్వం, సనాతన ధర్మం అంటున్న పవన్ కళ్యాణ్ శ్రీకాళహస్తిలో జరుగుతున్న ఇంత దౌర్జన్యాల గురించి ఎందుకు శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు.ఈ అక్రమ నిర్మాణాలపై తక్షణమే స్పందించి ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఆలయ ఆస్తులను పరిరక్షించడంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే జిల్లా నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉత్తరాజీ శరవణ కుమార్, కంఠా ఉదయ్ కుమార్, మున్నా రాయల్,బుల్లెట్ జై శ్యామ్ రాయల్, శ్రీవారి సురేష్,తిరుమల చౌదరి, పీఎం చంద్ర, ముని కృష్ణారెడ్డి,సుమతమ్మ, కొట్టే శరవణ, జీవీకే రెడ్డి, గాదిపాకుల కిరణ్, మనీ, గుణ తదితరులు పాల్గొన్నారు.

## వెలవేడు-ముచ్చివోలు రోడ్డులో ప్రమాదకర మలుపు పరిష్కారానికి కృషి: దండి నరేంద్ర

### - ఆర్ అండ్ బి డిఈ , రాంబాబుతో దండి నరేంద్ర చర్చలు -- సెప్టెంబర్ 28న క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్



వేలవేడు--ముచ్చివోలు రహదారిలోని ప్రమాదకరమైన మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, జనసేన నాయకులు దండి నరేంద్ర తమ బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు వేగాన్ని నియంత్రించలేక సెల్ఫ్ యాక్సిడెంట్లు జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ సమస్యపై ఆర్ అండ్ బి శాఖ డి ఈ



రామ్ బాబు, ఏ ఈ దుర్గేష్‌ని జనసేన నాయకులు దండి నరేంద్ర కలిసి సమస్యను వివరించగా, వారు సానుకూలంగా స్పందించారు. సెప్టెంబర్ 28, సోమవారం డి ఈ స్వయంగా ప్రమాదకర ప్రాంతాన్ని పరిశీలించి, అసలు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. ప్రజల భద్రతే అత్యున్నత ప్రాధాన్యత అని, సమస్యకు త్వరితగతిన పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని జనసేన నాయకులు దండి నరేంద్ర తెలిపారు.వాహనదారులకు విజ్ఞప్తి: వేలవేడు నుంచి ముచ్చివోలు వైపు ప్రయాణించే సమయంలో వేగాన్ని తగ్గించి, అప్రమత్తంగా మరియు సురక్షితంగా ప్రయాణించండి.

## వాకాడు మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ మంజుల

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు



వాకాడు మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డాక్టర్ సి.హెచ్. మంజుల శనివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సాయి ప్రసాద్ మండల ప్రజా పరిషత్‌కు సంబంధించిన కార్యకలాపాలు, పరిపాలనా అంశాలను డాక్టర్ మంజులకు వివరించారు.బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, ఏపీవో విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపినేత, మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే పులివర్తి నాని..!

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:



చంద్రగిరి పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తిని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకటమణిప్రసాద్ (నాని) మర్యాదపూర్వకంగా కలిశారు. రామ్మూర్తి నివాసానికి స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే, ఆయనతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులు, పట్టణ పురోగతికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారిద్దరూ కూలంకషంగా చర్చించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో సీనియర్ నాయకుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తమ అనుభవంతో యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ, అభివృద్ధి కార్యక్రమాలకు తగిన సూచనలు, సలహాలు అందించి సహకరించాలని దుబాసి రామ్మూర్తిని కోరారు. దుబాసి రామ్మూర్తిని పరామర్శించిన సమయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని వెంట మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వాసుతో పాటు పలువురు మండల స్థాయి నాయకులు, పట్టణ సీనియర్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## చెత్తను సంపదగా మార్చే దిశగా అవగాహన కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండలం వాలమేడు గ్రామంలోని చెత్త ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రం వద్ద పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రీన్ అంబాసిడర్లకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.ఎంపీడీవో సాయిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, చెత్తను సక్రమంగా సేకరించడం, ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర కీలకమని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ప్రజాభూమి ప్రతినిధి,?ఇంద్రకీలాద్రి:
శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న 'ధర్మపథం' సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ ఆటోనగర్, పటమటకు చెందిన 'కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ' పి. మౌనిక, ఎ. గీతల శిష్యబృందం ఈ నృత్య ప్రదర్శనను అత్యంత మనోహరంగా ప్రదర్శించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో చిన్నారులు, కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య అంశాలు భక్తిభావాన్ని నింపాయి. గణపతి ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించి సభను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. మహిషాసురమర్దిని స్తోత్రానికి లయబద్ధమైన అడుగులతో అమ్మవారి ఉగ్ర, శాంత రూపాల భావాలను అద్భుతంగా ఆవిష్కరించారు. శ్రీమహావిష్ణువు లీలలను కీర్తిస్తూ సాగిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అన్నమయ్య సంకీర్తనకు చిన్నారులు ఒలికించిన హావభావాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. బ్రహ్మాండ నాయకుడు : జగద్రక్షకుడైన స్వామివారి వైభవాన్ని చాటుతూ ముగింపు అంశంగా ప్రదర్శించిన నృత్యం ప్రశంసలు అందుకుంది. శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో ప్రతిభ చూపిన కళాకారులను ఆలయ అధికారులు అభినందించారు. అనంతరం కళాకారులకు శ్రీ అమ్మవారి ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

# పులివెందుల మున్సిపాలిటీలో రిజర్వేషన్ జాబితా ప్రదర్శన

**అభ్యంతరాల స్వీకరణకు 28వ తేదీ వరకు గడువు**

**- రాజకీయ పార్టీలతో కమిషనర్ తనూజ సమావేశం**



ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని 40 వార్డులకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మహిళా ఓటర్ల రిజర్వేషన్ జాబితాలను శనివారం మున్సిపల్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జాబితాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 28 లోపు మున్సిపల్ కమిషనర్ కు లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు. అదేవిధంగా 40 వార్డుల పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తనూజ అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు తెలిపిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయండి

**-వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేయాలి**

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:
తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, తదనంతర వరదల మూలంగా పిఠాపురం నియోజకవర్గంలో తలెత్తిన పరిస్థితులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. భారీ వర్షాలు, వరదల ప్రభావంపడిన ప్రాంతాల్లో ప్రజలకు వెంటనే సహాయం అందించడంతోపాటు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలకు జరిగిన నష్టాన్ని త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టంపై సమగ్ర నివేదికను సిద్ధం చేసే ప్రక్రియను తక్షణం చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వ్యవసాయం, రోడ్లు--భవనాలు, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు వెళ్లి సహాయక చర్యలను వేగవంతం చేయాలని చెప్పారు. ముఖ్యంగా పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, రైతులకు ఎదురవుతున్న సమస్యలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలన్నారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పంటలు నీటమునిగి దెబ్బతిన్న విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. వరి, పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటలకు జరిగిన నష్టాన్ని గ్రామాల వారీగా అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు. పంట దశ, నీటిమునక తీవ్రత, దెబ్బతిన్న విస్తీర్ణం, నష్టం స్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు రైతులకు జరిగిన పంట నష్టాన్ని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, సమగ్రంగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో నమోదు చేసి, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పూర్తి వివరాలతో నివేదికలను సత్వరమే ప్రభుత్వానికి సమర్పించాలని దిశా నిర్దేశం చేశారు. జల్లూరు కల్వర్టు వద్ద భారీ వర్షాల కారణంగా పెరిగిన నీటి ప్రవాహం, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని రోడ్లు--భవనాల శాఖ అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. కల్వర్టుపై నీటి మట్టం గణనీయంగా తగ్గిందని, ఇప్పటికే అమర్చిన పైపుల భాగం సురక్షితంగా ఉందని, ప్రస్తుతం వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు పవన్ కళ్యాణ్ కి తెలిపారు. జల్లూరు కల్వర్టు నిర్మాణంలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. కల్వర్టు పరిసర ప్రాంతాలతో పాటు సుద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు, తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఇతర రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సుద్దగడ్డ వాగు వంతెన, అప్రోచ్ రోడ్డును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిస్థితిని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. భారీ వర్షాల కారణంగా వంతెన పరిసర ప్రాంతాలు నీటమునిగిన నేపథ్యంలో అప్రోచ్ రోడ్డులో స్వల్ప స్థాయిలో సెటిల్మెంట్ క్రాక్ ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. లోపాన్ని గుర్తించిన వెంటనే ఇంజనీరింగ్ అధికారులు స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టి పూర్తిగా సరిదిద్దినట్లు వివరించారు. ప్రస్తుతం సుద్దవాగు వంతెన, అప్రోచ్ రోడ్డు సురక్షితంగా ఉన్నాయని, ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఈ పని డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో ఉన్నందున నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా జల్లూరు కల్వర్టు, సుద్దగడ్డ వాగు వంతెన అప్రోచ్ రోడ్డు సహా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఇతర రహదారుల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. ప్రజల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని విద్యుత్ శాఖ అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. విద్యుత్ సరఫరాకు ఏర్పడిన అంతరాయాన్ని తొలగించేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. అధికారులు అందించిన వివరాలపై స్పందించిన పవన్ కళ్యాణ్ దెబ్బతిన్న విద్యుత్ లైన్ల మరమ్మతులు, కూలిన స్తంభాల పునరుద్ధరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, అవసరమైన చోట్ల కొత్త పరికరాల ఏర్పాటు వంటి పనులను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

# ఈసీ ప్రకటనపై ఎక్స్ వేదికగా ట్వీట్ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పై ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవంగా చేసిన ప్రకటన అపోహలకు ముగింపు పలికింది.**

**ఉమ్మడి ప్రకటన ఈసీ విశ్వసనీయతను స్పష్టం చేసింది:**

**- సిఎం నారా చంద్రబాబు నాయుడు**

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:
"ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్. ఎస్. సంధూ, వివేక్ జోషి కలిసి ఏకగ్రీవంగా ఇచ్చిన వివరణ మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను మరోసారి స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న అపోహలకు తెరదించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన నిర్ణయాలు సమిష్టిగా, సంస్థాగత విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ తీసుకుంటారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు దురదృష్టకరం. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయి. బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాతనంతో స్వీకరించడం కూడా నాయకత్వ లక్షణమే. మన రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యం. భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత"అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# తిరుపతి జిల్లా వాల్మీకి కోశాధికారి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పౌర్ణమి పూజలు



ప్రజాభూమి, ప్రతినిధి తిరుపతి
తిరుపతి జిల్లా వాల్మీకి కోశాధికారి మండల బాలాజీ గారి ఆధ్వర్యంలో పౌర్ణమి పురస్కరించుకుని తిరుపతి వాల్మీకి సర్కిల్ కపిలతీర్థం మాల్వాడి గుండం ప్రక్కన వాల్మీకి ఆశ్రమంలో శనివారం ఘనంగా స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నదానం తోపాటు ప్రసాద వితరణ ఘనంగా జరిగింది అనంతరం జిల్లా లోని నా కుటుంబ సభ్యులు వాల్మీకి ప్రజల సంక్షేమే ధ్యేయంగా మా జిల్లా కమిటీ తరఫున స్వామివారికి పూజా నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వాల్మీకి అధ్యక్షులు శోభన్ బాబు వరలక్ష్మి తలారి బాలయ్య గజేంద్ర నగేష్ పావయ్య రామచంద్రయ్య ప్రసాద్ వెంకటేష్ ధనుష్ కుమార్ రంజిత్ కుమార్ వాల్మీకి కుటుంబ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పొడి చెత్త ఇస్తే బహుమతులు.. రేణిగుంట మండలంలో వినూత్న కార్యక్రమం






ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
దసరా పండుగను పురస్కరించుకుని రేణిగుంట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రవి చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 26 వరకు స్వచ్ఛ రథానికి 3 కిలోలకు పైగా పొడి చెత్త (డ్రై వేస్ట్) అందజేసే వారికి కూపన్లు అందజేయనున్నారు. అనంతరం అక్టోబర్ 26న గ్రామ పంచాయతీల వారీగా లక్కీడిప్ నిర్వహించి ఎంపికైన వారికి మూడు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందజేసి గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలని ఎంపీడీఓ,డిప్యూటీ ఎంపీడీఓలు కోరారు.

# గోవింద నామస్మరణతో మారుమోగిన కల్లూరు కొత్తపాలెం ఆలయం



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు
వాకాడు మండలం కల్లూరు కొత్తపాలెంలో వేద మంత్రోచ్ఛారణలు, గోవింద నామస్మరణలతో కల్లూరు కొత్తపాలెం గ్రామంలోని శ్రీ ఏడుకొండల స్వామి ఆలయం భక్తిశ్రద్ధలతో మారుమోగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త, టీడీపీ యువ నాయకుడు దువ్వూరు జనార్ధన్ రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించగా, శ్రీ వెంకటేశ్వర స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నామాల స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్ని గంటల పాటు ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్తులను ధర్మకర్త జనార్దన్ రెడ్డి చిరునవ్వుతో ఆహ్వానించి, భక్తిపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని అందించారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారి సేవా కార్యక్రమాలను నిర్వహించిన జనార్దన్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆటోలో వ్యక్తిపై దాడి.. నగదు, సెల్‌ఫోన్ దోపిడీ



ప్రజాభూమి ప్రతినిధి
రేణిగుంట. (రూరల్)
ముగ్గురు నిందితుల అరెస్ట్.. రెండు ఆటోలు, మొబైల్ స్వాధీనంఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తిని అడ్డగించి దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ దోపిడీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను గాజులమండ్యం పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 26న దామినేడు క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 24న రాత్రి తిరుపతి నుంచి పుత్తూరు వైపు వెళ్తున్న వ్యక్తిని ఆటోలో ఎక్కించుకుని, తూకివాకం చెరువు సమీపంలోని చీకటి ప్రాంతంలో ఆటోను నిలిపి దాడి చేసి రూ.500 నగదు, సుమారు రూ.10 వేల విలువైన వివో మొబైల్ను దోచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఎస్. జయకుమార్ ఏ స్వామి (43), జరుపాల్ హన్మంతు ఏ తెలుగు రవి (27), సుంకర మోహిత్ సాయి (21)లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు బజాజ్ మాక్సి మాఆటోలు, వివో వై 28,,5+ మొబైల్ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుల్లో జయకుమార్‌పై 12, హన్మంతుపై 12, మోహిత్ సాయిపై 2 పాత కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గాజులమండ్యం గ్రాలో జతీ.చీశీ.135/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# చంద్రగిరిలో అంబరాన్నంటిన వినాయక నిమజ్జన వేడుకలు: ఆర్.ఎఫ్ రోడ్డులో వైభవంగా శోభాయాత్ర!

**గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ఘనంగా వీడ్కోలు..**



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి పట్టణంలోని ఆర్.ఎఫ్ రోడ్డులో వినాయక స్వామి నిమజ్జన మహోత్సవం అత్యంత వైభవంగా, కోలాహలంగా సాగింది. గణేశ్ నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా కొలువుదీరిన లంబోదరుడిని సాగనంపేందుకు భక్తులు, స్థానిక ఆర్.ఎఫ్ రోడ్డు యువత భారీ ఎత్తున తరలివచ్చారు. స్వామివారి శోభాయాత్ర ఆద్యంతం భక్తిప్రపత్తులతో, ఆనందోత్సాహాల నడుమ సాగుతోంది. దారిపొడవునా మార్మోగిన బ్యాండ్ బాజాలు, డీజే (ఐజీ) పాటల హోరు, సాంప్రదాయ మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక శోభతో ముంచెత్తాయి. యువకులు, భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. వీధుల్లో స్వామివారి ఊరేగింపు సాగుతుండగా మహిళలు హారతులు పడుతూ మొక్కులు తీసుకున్నారు. భక్తుల జయజయధ్వానాల నడుమ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ఇరంగారిపల్లిలో ఇరుగు జగదీష్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు..!

**70 మందికి ఉచితంగా కంటికి పరీక్షలు నిర్వహించిన వాసన్ ఐ కేర్..**




ప్రజాభూమి ప్రతినిధి,
పాకాల :(చంద్రగిరి)
తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, ఇరంగారిపల్లి గ్రామంలో ఇరుగు జగదీశ్ సహకారంతో వాసన్ ఐ కేర్ తిరుపతి బ్రాంచ్ వారు ఉచిత మెడికల్ క్యాంపు శనివారం నిర్వహించారు. డాక్టర్ బాలకృష్ణ 70 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి,కంటి జాగ్రత్తల గురించి తగు సూచనలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరుగు జగదీష్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఉచిత మెడికల్ క్యాంపులను వాసన్ ఐ కేర్ వారి సహకారంతో నిర్వహిస్తుంటానని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది శ్రీనివాసులు మంజునాథ్,గ్రామస్తులు ఇరుగు విశ్వనాథ్,ఎ.మోహన,గంజి సుబ్రహ్మణ్యం రెడ్డి,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# మోహన్ బాబు యూనివర్సిటీలో ఘనంగా 'ప్రపంచ ఫార్మసిస్ట్" దినోత్సవం..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఫార్మసిస్టుల బాధ్యతలు నిరంతరం విస్తరిస్తున్నాయని, వారు కేవలం ఔషధాలను పంపిణీ చేసే వ్యక్తులు మాత్రమే కాదని, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, రోగుల సలహాదారులు, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక భాగస్వాములు అని ఎంబీ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ ఎం. ఆర్. జయప్రకాష్ పేర్కొన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించిన 'ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం' వేడుకల్లో ఆయన కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు వృత్తిపరమైన నైతిక విలువలు పాటిస్తూ రోగుల భద్రతకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. అలాగే సమాజంలో సూక్ష్మజీవ నిరోధకత పెరుగుతున్న నేపథ్యంలో, యాంటీబయాటిక్స్, ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు నాటకాలు, రంగోలి, సైటూన్స్, పోస్టర్లు మరియు రీల్ మేకింగ్ వంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. ఫార్మసీ కౌన్సిల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వి. షణ్ముగం మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యానికి, డీన్, అధ్యాపకులు, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.హో

# పట్టాలు చేతికొచ్చి... ఉత్సాహం వెల్లివిరిసే విద్యార్థులు



ప్రజా భూమి ప్రతినిధి
రామచంద్రపురం
అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ లక్ష్య సాధనకు కృషి చేయాలని జే.ఎన్. టీయుని వర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ కె.బి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. రామచంద్రపురం మండలం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో శనివారం నాడు పదవ గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.బి. చంద్రశేఖర్, మరియు గౌరవ అతిథిగా తిరుపతి ఆదాయపు పన్ను శాఖ అధికారి శివశంకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అందించిన పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. బి. ఫార్మసీ, యం. ఫార్మసీ, ఫార్మా డి. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు, విభాగాధిపతులు శరవర కుమార్, జ్యోతి బసిని, శివగామి, పరీక్షల నియంత్రణ అధికారి సతీష్ కుమార్ పాల్గొన్నారు.



# ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నిధులతో ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకుల సౌకర్యార్థం విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన మంత్రి, ఎంపీ అంబిక





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. శనివారం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నిధుల నుండి రూ. 75 లక్షల వ్యయంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ , ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఓలేటి రత్నమయ్య, కోనంకి గంగారాం, వెంకటరమణ, మిద్దెల నరసింహులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, ఆర్ ఎం ఓ లు డా.సుధారాణి, డా. హేమలత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. విజయశ్రీ, ఏ .ఓ. మల్లికార్జున రెడ్డి, మాజీ మేయర్ స్వరూప ఆసుపత్రిలోని వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు వైద్య సిబ్బంది, పలువురు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సేవా తత్పరత భావంతో కృషిచేసి తన నిధుల నుండి విశ్రాంతి భవనాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ఆసుపత్రిలో అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ముఖ్యంగా వివిధ హోదాల్లో ఖాళీగా ఉండే ఉద్యోగాలను భర్తీ చేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఆసుపత్రిలో అనేక ప్రాంతాల నుండి రోగులు వైద్య చికిత్సల కోసం వస్తుంటారని వారి సహాయకుల కోసం నిర్మించిన ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా 550 బెడ్లకు పైగా రోగులు వస్తుంటారని, ఇతర జిల్లాల కంటే అధిక సంఖ్యలో ఈ ఆసుపత్రికి బెడ్లు పెంచవలసిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రిలో వివిధ స్థాయిలో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయని కేవలం కేవలం జీవోలు ఇచ్చారని స్పష్టత లేని కారణంగా వైద్య ఆరోగ్యశాఖలో అభివృద్ధి పనులు పూర్తి కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 756 కోట్ల రూపాయలను మౌలిక సదుపాయాల కల్పన కోసం సహకారం అందిస్తున్నదని అన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై ఐ వి ఆర్ ఎస్ సర్వేలో 78 శాతం వరకు ప్రజల నుండి స్పందన సత్ఫలితాలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతపురంలో క్యాన్సర్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆసుపత్రుల్లో వైద్యులు ఇతర సిబ్బంది బాధ్యత యుతంగా తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడు లేని విధంగాప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల పట్ల ప్రజలకు విశ్వాసం కలుగుతున్నదని మారుమూల ప్రాంతాల్లో సైతం వైద్యులు తమ విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం. ఎంపి అంబిక లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో తొలుత అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్య సేవలు మరింతగా అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు వసతి ఏర్పాటుకు తన నిధుల నుండి రూ.75 లక్షల వ్యయంతో నిర్మించడం జరిగిందన్నారు. అనంతపురం ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గౌరవ ప్రధాని నరేంద్ర మోది నేతృత్వంలో-2047 వికసి భారత్ లక్ష్యాల్లో భాగంగా వైద్య రంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు మాత్రమే కాకుండా చికిత్స కాలమంతా మానసిక మరియు లాజిస్టికల్ మద్దతును అందించే వారి సహాయకులకు కూడా సేవలు అందుతున్నట్లు తెలిపారు. తరచుగా ఈ సహాయకులకు సరైన ఆశ్రయం లేదా సౌకర్యాలు లేకుండా బహిరంగ ప్రదేశాలలో కారిడార్లలో లేదా ఆసుపత్రి ప్రాంగణంలో మరియు చుట్టుపక్కల వేచి ఉండాల్సిన దుస్థితిని ప్రజల ద్వారా గుర్తించి వారి అభ్యర్థన మేరకు ఈ సౌకర్యాన్ని కలిగించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వర్షాకాలం వేసవి సమయాల్లో ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉన్నప్పుడు సహాయకులు వేచి ఉండే సమయంలో లేదా విశ్రాంతి తీసుకునేటప్పుడు వారికి సురక్షితమైన పరిశుభ్రమైన మరియు క్రమబద్ధమైన వాతావరణాన్ని అందించడమే ఈ సౌకర్యం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. ఈ వసతి విశ్రాంతి భవనంలో మహిళలకు పురుషులకు వేరువేరుగా విభాగాలు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. అంతే గాక ఇలాంటి సముదాయాలు ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ప్రతిబింబిస్తుందని ఎంపీ తెలిపారు. ఈ భవన నిర్మాణంలో భాగస్వాములైన దాతలకు ఎంపీ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో రోగులకు సరిపడే విధంగా బెడ్లు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారాలతో ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి పరుస్తామన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అనేక ప్రజల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని ప్రభుత్వం ద్వారా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి అన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ అధిక శాతం మంజూరు అయిందని అలాగే కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్ర అభివృద్ధికి అనేక విధాలుగా సహకరిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రికి సంబంధించి పెండింగ్ లో ఉన్న అన్ని పనులను, సమస్యలను పరిష్కరించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ను ఎంపీ ప్రత్యేకంగా కోరారు. అలాగే సి ఎస్ ఆర్ నిధులతో పాటు ఎంపీ లాడ్స్ ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం వైద్య శాఖలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పలువురు మంత్రాన్ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

## క్రమశిక్షణతో సంస్కారవంతమైన విద్య నేర్చుకోవాలి

### -ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్ డే వేడుకల్లో ప్రిన్సిపల్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ ఎన్.అనురాధ అధ్యక్షతన ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో చేరిన నూతన విద్యార్థినులకు ప్రిన్సిపల్ స్వాగతం పలికారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, సంస్కారాలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాలలో లభించే విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గత మార్చి 2026లో నిర్వహించిన పరీక్షల్లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన హుస్నాబాను, పూజిత, సహిస్తాబాను విద్యార్థినులను కళాశాల తరఫున సత్కరించి అభినందించారు. వారి ప్రతిభను స్ఫూర్తిగా తీసుకుని ఇతర విద్యార్థినులు కూడా విద్యలో రాణించాలని సూచించారు. అనంతరం సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థినులకు కళాశాల ప్రాధాన్యత, విద్యా వాతావరణం, అందుబాటులోఉన్నఅవకాశాలను వివరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథం, బిన్ బ్యాగ్‌పై అవగాహన

### - చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రలకు అందించాలి

### - ఎంపీడీవో కె. శివారెడ్డి



ప్రజాభూమి, చక్రాయపేట

మండలంలోని గండికొవ్వూరు గ్రామ పంచాయతీలో శనివారం ఎంపీడీవో కె. శివారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శోభారాణి పాల్గొని స్వచ్ఛ రథం, బిన్ బ్యాగ్ వినియోగంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో చెత్త నిర్వహణ, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో పేరుకుపోయే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి క్లాప్ మిత్రలకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో శివారెడ్డి కోరారు. స్వచ్ఛ రథం సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఋషికేశవ, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లయోలా పాలిటెక్నిక్ లో విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సు

**సైబర్ నేరాలు, మహిళా భద్రత, రోడ్డు భద్రతపై సీఐ పురుషోత్తం రాజు సూచనలు**



ప్రజాభూమి, పులివెందుల

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల అర్బన్ సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో శనివారం లయోలా పాలిటెక్నిక్ కళాశా లలో విద్యార్థులకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించి సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112ను వినియోగించుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి మిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. కళాశాలల్లో ర్యాగింగ్ కు తావులేదని, ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాశాల యాజమాన్యం, అధ్యాపకు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యం - వైఎస్ మనోహర్ రెడ్డి

### పులివెందులలో పలు వార్డుల్లో పర్యటించి సమస్యలపై ఆరా

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ ఇంఛార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి శనివారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, మాజీ కౌన్సిలర్ కోడి రమణలతో కలిసి ఆయన పెద్దరంగాపురం ఎస్సీ కాలనీ, యర్రగుడిపల్లి, నగరిగుట్ట ప్రాంతాల్లో పర్యటించారు. పెద్దరంగాపురం ఎస్సీ కాలనీలో తాగునీటి మోటార్ పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సొంత నిధులతో మోటార్ మరమ్మతు చేయించి నీటిని అందేలా చేశారు. దీంతో కాలనీ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమైంది. యర్రగుడిపల్లి లో నెలకొన్న యూజీడీ సమస్యపై మున్సిపల్ అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. నగరిగుట్ట ఎస్సీ కాలనీలో తాగునీరు కలుషితమవుతున్న సమస్యను స్థానికులు దృష్టికి తేగా వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రెడ్డమ్మ వీధి, నగరిగుట్ట ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా రావడం లేదని ప్రజలు విన్నవించగా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఇబ్బందులు లేకుండా చూడటమే వైకాపా లక్ష్యమని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి, కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, మస్తాన్, దేని, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివియన్ మాధవ్ కువినతిపత్రం సమర్పించినశింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందు శ్రీనివాసులు రెడ్డి



ప్రజాభూమి, పుట్టూరు.

శింగనమల నియోజకవర్గ కో-కన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి శనివారం రాష్ట్ర అధ్యక్షుడు పివియన్ మాధవ్ ను కలిసి పార్టీ కార్యక్రమాల ప్రణాళికకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ వినతిపత్రంలో పార్టీ కార్యక్రమాలను వారానికి రెండుసార్లు నిర్వహించాలని, అలాగే నెలవారీ క్యాలెండర్ లేదా సంవత్సర క్యాలెండర్ రూపొందించి, ఆ ప్రకారం ప్రోగ్రాములను ముందస్తుగా ప్లాన్ చేయాలని కోరారు. ఇలాంటి ప్రణాళికాబద్ధ కార్యక్రమాల వల్ల పార్టీ సంస్థాగతంగా బలపడి, కార్యకర్తలు, ప్రజల మధ్య నిరంతర సంబంధం ఏర్పడి, పార్టీ ముందుకు సాగుతుందని ఆయన వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పివియన్ మాధవ్ మాట్లాడుతూ ఈ ఆలోచనను మంచి ఆలోచనగా అభివర్ణించారు. "ఇది మంచి ఆలోచన. ఈ ఆలోచన మీకు ఎలా వచ్చింది?" అని ఆయన ప్రశ్నించారు. దానికి కుందూ శ్రీనివాసుల రెడ్డి , వారి బృందం సమాధానం ఇస్తూ మేము వారానికి రెండు ప్రోగ్రాములు చేస్తాము" అని సమాధానం ఇచ్చారు. పార్టీ కార్యక్రమాలను క్రమం తప్పకుండా, ముందస్తు ప్రణాళికతో నిర్వహించడం ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహం పెరుగుతుందని, ప్రజా సమస్యలపై పార్టీ నిరంతరం పనిచేయగలదని, నాయకులకు-కార్యకర్తలకు మధ్య సమన్వయం మెరుగుపడుతుందని ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తమైంది. నెల లేదా సంవత్సర క్యాలెండర్ ప్రకారం కార్యక్రమాలు జరగడం వల్ల ఏ స్థాయిలో ఎప్పుడు ఏ కార్యక్రమం ఉందో ముందుగానే తెలుస్తుంది. దీనివల్ల నియోజకవర్గ, మండల, శాఖ స్థాయిలో సమన్వయం సులభమవుతుంది. పార్టీని ముందుకు నడిపించడంలో ఇది ఉపయోగకరంగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ వినతిపత్రం సమర్పణతో పార్టీ కార్యక్రమాల ప్రణాళికపై చర్చ మొదలైంది. ఈ కార్యక్రమములో పుట్లూరు మండల నాయకుడు రామిరెడ్డి నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని గ్రామోత్సవంలో పాల్గొన్న అతికారి కృష్ణ

### భక్తులను ఆకట్టుకున్న కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలోని గాంధీ వీధి, జంగాలపల్లె ఎస్సీ కాలనీలో నిర్వహించిన వినాయకుని గ్రామోత్సవంలో జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొన్నారు. శనివారం రాత్రి గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఆయన ఉత్సవాల్లో పాల్గొనగా, కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ 13 రోజులుగా గణనాథుని పూజలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరువలేనని తెలిపారు. గ్రామోత్సవంలో నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది గణేష్ ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరిపై గణనాథుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, చిన్నకొండు విజయ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు, గంగాధర్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత - ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి

### తొండూరు అంబేద్కర్ గురుకుల హాస్టల్ ను సందర్శించి విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్సీ



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల హాస్టల్ లో కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి హాస్టల్ ను సందర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను స్వయంగా అంబులెన్స్ లో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు, పాఠశాల, హాస్టల్ సిబ్బంది, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా వైద్య సేవలు, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం - గురుకుల ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి

**కల్తీ ఆహారంతో 20 మంది విద్యార్థినుల అస్వస్థత**

**- జిల్లా అధ్యక్షుడు దినేష్ డిమాండ్**



ప్రజాభూమి, పులివెందుల

తొండూరులోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో భోజనం చేసిన అనంతరం 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందడం దారుణమని ~~~~ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఆరోపించారు. కల్తీ ఆహారంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, బాధ్యులైన ప్రిన్సిపాల్, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గురుకులంలో ఆహారం, తాగునీరు, బాత్రూంలు, పారిశుధ్య సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలే దన్నారు. 500 మందికి పైగా విద్యార్థినులు ఉన్న హాస్టల్ లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో గతంలో కొంతమంది పాఠశాలను విడిచి వెళ్లిన పరిస్థితి కూడా ఉందన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెద్దరంగాపురంలో ప్రజా సమస్యలపై మనోహర్ రెడ్డి దృష్టి

### ఎంపీ నిధులతో మోటార్ మరమ్మతు, జేసీబీతో చెత్త తొలగింపు



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో మున్సిపల్ ఇంఛార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి శనివారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో తాగునీటి మోటార్ పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని వెంటనే ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సొంత నిధులతో మోటార్ మరమ్మతు చేయించారు. దీంతో కాలనీ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్త, బురద కుప్పలను జేసీబీ సహాయంతో తొలగించారు. పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైకాపా నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోడి రమణ, కిషోర్, నాగేశ్వర రెడ్డి, వెంగళ రెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

పోలవరం 11

ఆదివారం 27 సెప్టెంబరు 2026

# బడికి వెళ్లాలంటే ప్రాణాలకు తెగించాల్సిందే

- భయం భయంగా కాలవ దాటుతున్న చిన్నారులు
- భయపు నీడలో బాల్యం ఉధృత వాగులో విద్యార్థుల ప్రాణాల పందెం!
- వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాత్కాలిక బాట కొట్టుకుపోయింది.
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని క్షణక్షణం నరకం.





ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.

ఒకవైపు వర్షం మరోవైపు నింగినంటేలా పొంగిపొర్లుతున్న వాగు ఆ ఉధృతికి నిలువునా కొట్టుకుపోయిన రహదారి! అయినా తప్పని పరిస్థితిలో, ఏక్షణం ఏ ముప్పు ముంచుకొస్తుందో తెలియక భయం భయంగా కాలవ దాటుతున్న చిన్నారులు! ఇది మండలంలోని మడివి గుంపు - సిరియ గుంపు గ్రామాల మధ్య రోజూ కనిపిస్తున్న దయనీయ దృశ్యం. అధికారుల ఘోర నిర్లక్ష్యం, అంతులేని అలసత్వానికి గ్రామస్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముల్కనపల్లి పంచాయతీ పరిధిలోని మడివి గుంపు - సిరియ గుంపుల మధ్య ఉన్న కాలువకు గండిపడి, తాత్కాలిక బాట కొట్టుకుపోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ముఖ్యంగా బడికి వెళ్లే చిన్న పిల్లలు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తోంది. ప్రమాదం కాచుకూర్చున్న ఈ రహదారిపై పిల్లలను బడికి పంపాలంటేనే తల్లిదండ్రులు వణికిపోతున్నారు. "ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని క్షణక్షణం నరకం చూస్తున్నాం" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రత ఇన్ని రోజులుగా కళ్లముందే కనిపిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం కనీసం ఆ వైపు చూడకపోవడంపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణమైనా ఘోరం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తాత్కాలికంగా రాకపోకలకు వీలుగా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలని, అలాగే భవిష్యత్తులో ఈ తిప్పలు తప్పేలా శాశ్వత వంతెన నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని హెచ్చరిస్తున్నారు. ఇరు గ్రామస్తులు కుంజ బుజ్జి, జల్లి రామయ్య, అప్పారావు, మడివి శ్రీల త, గుంజ రాజయ్య, భద్రయ్య, సుబ్బమ్మ, వినోద్, మడివి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవం

-పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన




ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అడ్డతీగల మండల కేంద్రంలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక మహిళలు, చిన్నారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తుఫాను వేళల్లోనూ విద్యుత్ సిబ్బంది విశేష సేవలు

భారీ వర్షాల్లోనూ వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

విద్యుత్ శాఖ ఏఈ సుదర్శన్, సిబ్బందిపై ప్రజల ప్రశంసలు




ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

తుఫాను ప్రభావంతో అడ్డతీగల మండలంలో గత కొన్ని రోజులుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తుఫాన్ల సమయంలో విద్యుత్ పునరుద్ధరణకు రోజులు పట్టేదని, ఈసారి కొన్ని గంటల్లోనే సరఫరాను పునరుద్ధరించారని తెలిపారు. భారీ వర్షాలకు పలుచోట్ల విద్యుత్ లైన్లు, స్తంభాలు దెబ్బతిన్నప్పటికీ ఏఈ సుదర్శన్ పర్యవేక్షణలో సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమించి మరమ్మతులు చేపట్టారని ప్రశంసించారు. మారుమూల ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఈ సుదర్శన్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, స్తంభాలు వంగినా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

## కార్యకర్తలను బెదిరిస్తే సహించేది లేదు

-ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూముల పరిరక్షణ కోసం చట్టబద్ధంగా పోరాడుతున్న తమ కార్యకర్తలపై దాడులు, బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను హెచ్చరించారు. అడ్డతీగల మండలం డి.భీమవరం గ్రామంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ గిరిజనుల భూములు, గ్రామకంఠం, ఆర్‌అండ్‌బీ, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. వీటిపై తమ సంఘం చట్టపరంగా పోరాడుతూ ఎల్‌టీఆర్‌పీ కేసులు నమోదు చేయిస్తోందన్నారు. అధికారుల నుంచి నోటీసులు అందుకున్న కొందరు గిరిజనేతరులు అమాయక గిరిజనులను రెచ్చగొట్టి తమ కార్యకర్తలపై దాడులకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మోడిద నూకరాజు, కోఆర్డినేటర్ పీట ప్రసాద్, నాయకులు కోటం రాజన్నదొర, కాల్ వరుణకుమారి, మోడిద దేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిటీల ఎన్నికల్లో కూటమి నాయకులు పాల్గొనాలి

సమర్థవంతంగా పనిచేసే వారిని ఎన్నుకోవాలి

టీడీపీ మండల అధ్యక్షుడు జర్తా వెంకటరమణరెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 29వ తేదీ మంగళవారం నిర్వహించనున్న విద్యా కమిటీల ఎన్నికల్లో కూటమి నాయకులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని అడ్డతీగల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జర్తా వెంకటరమణరెడ్డి పిలుపునిచ్చారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమర్థవంతంగా పనిచేసే వ్యక్తులను విద్యా కమిటీలకు ఎన్నుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక సదుపాయాల కల్పనలో విద్యా కమిటీల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేసే వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గ్రామస్థాయిలో కూటమి నాయకులు సమన్వయంతో వ్యవహరించి విద్యా కమిటీల ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని ఆయన ఆకాంక్షించారు.

## గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

పోలవరం జిల్లా డీ సీ హెచ్ ఎస్ :డా. కె సాంబశివరావు



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని తుపాను, వరదల మూలంగా ఇబ్బందులు పడకుండా ముందస్తు వైద్య సేవలు అందించేందుకు కూనవరం మండలం కోతులగుట్ట సీ హెచ్ సీ కి తరలించిన గర్భిణీ లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పోలవరం జిల్లా డీ సీ హెచ్ ఎస్ డా. కె సాంబశివరావు తెలిపారు. సాయంత్రం ఆయన కోతులగుట్ట సీ హెచ్ సీ ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాలనుండి ఆసుపత్రి కి వచ్చిన గర్భిణీ లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందుబాటులో గైనకాలజిస్టు ను నియమించడం జరిగిందని తెలిపారు. వీరికి రెగ్యులర్ గా వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. అనంతరం వరరామచంద్రాపురం మండలం ఒడ్డిగూడెం గ్రామానికి చెందిన ముత్యాల దుర్గా భవాని అనే మహిళ విద్యుత్ షాక్ కు గురై కోతులగుట్ట సీ హెచ్ సీ లో వైద్యం పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి ని అయన అడిగి తెలుసుకున్నారు. అలాగే అదే మండలం ఉమ్మడివరం కు చెందిన నరేష్ అనే యువకుడు పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న ఆ యువకుడి ఆరోగ్య పరిస్థితి ని కూడా అడిగి తెలుసు కున్నారు. ఈ ఇద్దరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె మహేష్ బాబు, గైనకాలజిస్ట్ డా శశికళ, డా. తేజ, డా. ప్రజ్వల, హెడ్ నర్స్ బొజ్జి, వైద్య సిబ్బంది పలీనా, రాజేశ్వరి, ఎన్ ఆర్ సీ కౌన్సిలర్ కె. రమేష్, జై. శ్రీనివాస రెడ్డి, రవితేజ రెడ్డి, బాలరాజు, అమరావతి జీవన్,తదితరులుపాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో మహిళా టీడీపీ కార్యకర్తకు అస్వస్థత



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలోని వడ్డిగూడెం గ్రామం ముత్యాల భవాని (టిడిపి కార్యకర్త )అనే మహిళ ఇంటి ఆవరణలో దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్ షాక్ కి గురై కోతులు గుట్ట హాస్పిటల్ లో చేరారు. వారిని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ టీడీపీ బృందం బాధితురాలిని సందర్శించి పరామర్శించారు. ఆమె ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బొర్ర నరసింహారావు, ముత్యాల చంద్రశేఖర్, ఆదినారాయణ, ముత్యాల శంకర్రావు, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఒకే రోజు ఇద్దరు ఆప్తులను కోల్పోవడం తీరని లోటు

మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించిన ఎమ్మెల్యే శిరీషాదేవి





ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

ఒకే రోజు ఇద్దరు ఆప్తులను కోల్పోవడం అత్యంత బాధాకరమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం లబ్బర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త విసంశెట్టి కొండమ్మ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. అదే విధంగా సీతారామపురం గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త కోపూరి అమ్మాజీ ఆకస్మికంగా మృతి చెందారు. వారి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి శనివారం కూటమి శ్రేణులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించిన ఎమ్మెల్యే శిరీషాదేవి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇద్దరు ఆప్తులను ఒకే రోజు కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ ఉపాధ్యక్షులు సూరిశెట్టి సురేష్, వానపల్లి చిట్టిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌లో చిత్రలేఖనం



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 25 సంవత్సరాల సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా అడ్డతీగల మండలంలో చిత్రలేఖన కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల జడ్పీ హైస్కూల్, ఎల్లవరం హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన చిత్రలేఖన కార్యక్రమానికి మండల ఎంఈఓ శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం భీముడుపాకలు, పాపంపేట అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలను సన్మానించి, సమాజానికి అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి హాజరయ్యారు. కూటమి కార్యకర్తలు పీ. ఆదిలక్ష్మి (ఎక్స్ఎంపీటీసీ), బటాని వరలక్ష్మి (మహిళా నాయకురాలు), బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడ్డతీగలలో ఘనంగా వినాయక శోభాయాత్ర



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

వినాయక చవితి సందర్భంగా అడ్డతీగల ప్రసన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న వినాయక విగ్రహాన్ని శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు.

ఆలయం నుంచి స్వామివారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మద్దిగడ్డ ప్రాజెక్టులో విగ్రహ నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ బి. వినోద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## వరద పరిస్థితిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- 135 పునరావాస కేంద్రాలు, 161 గ్రామాల్లో ప్రత్యేక బృందాలు సిద్ధం
- కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లో కలెక్టర్ కే. దినేష్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన





ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల నేపథ్యంలో శబరి, గోదావరి నదుల వరద పరిస్థితిపై ప్రజలు రానున్న 24 నుంచి 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని పోలవరం జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు పునరావాస కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శనివారం చింతూరు డివిజన్ పరిధిలోని కూనవరం, వి.ఆర్.పురం ప్రాంతాల్లో కలెక్టర్ కే. దినేష్ కుమార్, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో శుభం నొక్వల్, ఓ ఎస్ డి జావలి ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించి, వరద ప్రభావం, రహదారులు, రాకపోకలు, ప్రజల భద్రత, పునరావాస ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురవడం, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు శబరి నది పరివాహక ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదవడంతో శబరి నదికి భారీగా వరద ప్రవాహం వచ్చిందని కలెక్టర్ తెలిపారు. గతంలో 1986లో నమోదైన సుమారు 5.4 లక్షల క్యూసెక్కుల చారిత్రాత్మక వరదను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందుగానే అప్రమత్తమై చర్యలు చేపట్టిందన్నారు.

చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 43.5 అడుగులకు చేరిందని, ఇది సుమారు 3.5 నుంచి 4 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహానికి సమానమని తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ అక్కడి వరద నీరు దిగువ ప్రాంతాలకు చేరడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు.

వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ, ఐటీడీఏ, పంచాయతీరాజ్ తదితర శాఖల సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ మైకుల ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. చింతూరు డివిజన్‌లో సుమారు 135 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, 161 గ్రామాల్లో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 124 మంది గర్భిణీలను గుర్తించి, ప్రసవ సమయం సమీపించిన 10 మందికి పైగా గర్భిణీలను ముందుగానే ప్రసవ కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ బృందాలను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. రానున్న 24 నుంచి 48 గంటలు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సాయంత్రం నుంచి గోదావరి నీటిమట్టం కూడా పెరిగే అవకాశం ఉన్నందున మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి ప్రవాహం పెరిగినప్పుడు శబరి వరద నీరు దిగువకు వెళ్లే వేగం తగ్గి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయిన గ్రామాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకుల కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని బియ్యం, కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, వంటనూనె తదితర నిత్యావసర సరుకులను బాధిత ప్రజలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల తరలింపు, పునరావాసం, ఆహారం, తాగునీరు, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత వరకు నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు .

ప్రజాభూమి
జనరల్
ఆదివారం, సెప్టెంబర్ 27, 2026


# బధిరుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
సంచాలకులు, వివిధ ప్రతిభావంతులు, పాఠశాలలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బధిరుల దినోత్సవం మరియు సంజ్ఞల భాషా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శనివారం విజయవాడలోని ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ముఖ్య అతిథి గా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇ లక్కియ మాట్లాడుతూ, బధిరులు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువ చ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బధిరులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఎటువంటి సంకోచం చెందాల్సిన అవసరం లేదని, వారి అవసరాలు, సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు తాము అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బధిరులు సమా జం లో సమాన అవకాశాలతో ముందుకు సాగేందుకు అవసరమైన సహాయాన్ని అందిం చడంతో పాటు, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్స హిం చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ జిల్లా స్థాయి కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని వివిధ బధిరుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు మరియు ఇన్సైట్ ఇండియా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది బధి రులు ఈ కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో భాగంగా బధిరుల ప్రతిభను ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఇద్దరు బధిరులకు టచ్ ఫోన్లు, ఐదుగురికి వినికిడి యంత్రాలు వెరసి రూ.50,000/- విలువ చేసే ఉపకరణాలు అందిచడమైనది.ఈ కార్యక్ర మంలో విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరి యు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచా లకులు వాగ్దేవు కామరాజు, జిల్లా అధికా రులు, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ ప్రతినిధులు, పాఠశాలల సిబ్బంది, బధిరుల సంఘాల ప్రతినిధులు, ఇన్సైట్ ఇండియా సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. బధిరుల సంక్షేమం, వారి హక్కులు, అవసరమైన సహాయ సహకారాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు.



## స్వచ్ఛతా ర్యాలీతో ప్రజలకు అవగాహన

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి
స్వచ్ఛత హి సేవ–2026' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగరపాలక సంస్థ, రిలయన్స్ జియో సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నగరంలో స్వచ్ఛతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చోడే వీర వెంకట సత్య బాపిరాజు ప్రోత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, రిలయన్స్ జియో ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నగరంలో పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ర్యాలీ చేపట్టారు. స్వచ్ఛతపై అవగాహన కల్పించే నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి చెత్తను తొలగించారు.ఈ సందర్భంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అడపా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రైవేటు సంస్థలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. మచిలీపట్నం నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి, ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి మాత్రమే అందించాలని సూచించారు.రోడ్లు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పారిశుధ్య సమస్యలతో పాటు ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కే. నాగరాజు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అడపా సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ కళాకేశవ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ అవినాష్, రిలయన్స్ జియో ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :
గ్రామ రెవెన్యూ సహాయకుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు చేపట్టిన సహాయ నిరాకరణ కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు శనివారం దీక్షలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మచిలీపట్నం ఉత్తర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకులు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా తమ వేతనాల్లో ఒక్క రూపాయి కూడా పెరుగుదల లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుతున్న రూ.10,500 గౌరవ వేతనంతో కుటుంబాలను పోషించుకోవడం అత్యంత కష్టంగా మారిందన్నారు. తక్కువ వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నామని తెలిపారు.తమ సమస్యలను ప్రభుత్వం అనేకసార్లు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే అమలు చేయాలని కోరారు.

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు

**ఈవో వి.కె. శీనా నాయక్‌తో కలిసి క్యూలైన్లు, పూజా ప్రాంగణాలు, మహా మండపం క్షేత్రస్థాయి తనిఖీ ..భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతే ప్రథమ ప్రాధాన్యం: సీపీ**

ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి:
శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో రానున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల భద్రత మరియు ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు శనివారం సాయంత్రం ఇంద్రకీలాద్రిని సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్‌తో కలిసి ఆయన కొండపైన, పరిసర ప్రాంతాలలో భక్తుల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపై ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల మార్గాలు, బారికేడింగ్ పటిష్టత, వివిధ పూజలు నిర్వహించే ప్రదేశాలను సీపీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా రద్దీ తీవ్రంగా ఉండే సమయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా మహా మండపంలోని ఖాళీ ప్రదేశాలలో భక్తులను వేచి ఉంచేందుకు గల అవకాశాలను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు.సామాన్య భక్తులు ప్రశాంత వాతావరణంలో శ్రీ అమ్మవారిని దర్శించుకునేలా పోలీస్, దేవస్థానం సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తున్నామని, ఈ ఉత్సవాల్లో అధునాతన సాంకేతికత వినియోగిస్తున్నామని సీపీ పేర్కొన్నారు. సీసీటీవీ కెమెరాలు, ఏఐ నిఘా వ్యవస్థ ద్వారా భక్తుల రక్షణను 24 గంటలూ పర్యవేక్షిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్ టౌన్ సీఐగుణ రామ్, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.రమ, ఆలయ వైదిక కమిటీ సభ్యులు వి.శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులంతా క్షేమం

**ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం**
**AP SWREIS కార్యదర్శి బి. లావణ్య వేణి**

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :
కడప జిల్లా తొండూరులోని డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థత చెందిన ఘటనపై AP SWREIS కార్యదర్శి బి. లావణ్య వేణి స్పందించారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గురుకులంలో పలువు రు విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థత చెందిన విషయం తమ దృష్టికి వచ్చిన వెంట నే స్పందించామని తెలిపారు. విద్యార్థులను ఆసుపత్రిలో చేర్పించి DMHO ఆధ్వర్యంలో ప్రత్యేక చికిత్స అంది స్తున్నామని, ప్రస్తుతం విద్యార్థులంతా ఆరోగ్యంగానే ఉన్నారని అన్నారు. కడప జిల్లా AP SWR EIS DCO ఆసుపత్రిలోనే ఉండి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు ఆమె తెలిపా రు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, అంబేద్కర్ గురుకుల పాఠశాలల సిబ్బంది ఎవరైనా సరే విద్యార్థుల పట్ల అలసత్వం, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని లావణ్య వేణి అన్నారు.

## కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి పెను ముప్పు



**❖ ఆర్టికల్ 324ను కాలరాసి వన్ మ్యాన్ ఆటోక్రసీ నడుపుతున్నారు ❖ కమిషనర్ల 14 అభ్యంతరాలను తొక్కిపెట్టిన సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి: మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ❖ తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి**

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:
ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఎన్నికల సంఘం పనితీరు, దాని పారదర్శకతపై తీవ్రస్థాయిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఈసీఐనెట్ (ECINet) నిర్వహణ, ఓటర్ల జాబితాలపై తోటి ఎన్నికల కమిషనర్లే పలుమార్లు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు రావడం యావత్ దేశ ప్రజల్లో అనేక సందేహాలను రేకెత్తిస్తోందని తెలిపారు. 2024 ఆంధ్రప్ర దేశ్ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజు నమోదైన శాతానికి, ఆ తర్వాత నాలుగు రోజులకు ఈసీ అధికారికంగా ప్రకటించిన శాతానికి మధ్య అనూహ్యమైన భారీ వ్యత్యాసం ఉండటం ట్యాంపరింగ్ అనుమానాల కు బలం చేకూరుస్తోందని ఆయన స్పష్టం చేశారు. కమిషనర్ల మధ్య నెలకొన్న భేదాభిప్రాయాలపై ప్రజలకు తగిన వివరణ ఇవ్వాలని, గత ఎన్నికల్లో జరిగిన గణాంకాల తేడాలు, వ్యవస్థాగత లోపాలపై విస్తృత చర్చ జరిగి సమగ్ర రీ-ఎగ్జామినేషన్ నిర్వహించాలని, అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థపై పౌరులకు సంపూర్ణ నమ్మకం కలుగుతుందని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఆయన ఏమన్నారంటే..."భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘంలోని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), మిగతా ఇద్దరు కమిషనర్లు సమానమైన హోదా, అధికారాలు కలిగిన వ్యక్తులు. సీఈసీ మొదటి వాడే కావచ్చు కానీ అందరికంటే అధికుడు కాదు. ఎలాంటి నిర్ణయాలైనా మెజారిటీ అభిప్రాయం లేదా ఏకగ్రీవంగా జరగాలని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. కానీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తోటి కమిషనర్ల అభిప్రాయాలను బేఖాతరు చేస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. తోటి కమిషనర్లు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోకుండా, ఎన్డీయే కూటమికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారు. రాజ్యాంగ నిబంధనలను కాలరాసి వన్ మ్యాన్ ఆటోక్రసీ నడుపుతున్న సీఈసీని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పదవి నుంచి తప్పించాలి..2024 మే 13న ఏపీలో పోలింగ్ ముగిసిన రోజు రాత్రి 11:45 గంటలకు 76.50 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) స్వయంగా వెల్లడించారు. తీరా మే 17 నాటికి అది 81.66 శాతానికి ఎలా పెరిగింది? పోలింగ్ ముగిసిన రోజు రాత్రి 11:45 నుండి అర్ధరాత్రి 2 గంటల మధ్య—కేవలం 2 గంటల 15 నిమిషాల వ్యవధిలోనే రాకెట్ కంటే వేగంగా 17,19,482 ఓట్లు ఎలా ఈవీఎంలలో నమోదయ్యాయి? సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల మధ్య పోలింగ్ శాతం కేవలం 0.08 శాతంగా ఉంటే, అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా ఓట్లు కుప్పలుతెప్పలుగా ఎలా వచ్చిపడ్డాయి? ఈ లెక్కలపై ఇప్పటివరకు రాష్ట్ర సీఈఓ గానీ, కేంద్ర ఎన్నికల సంఘం గానీ స్పష్టమైన వివరణ ఎందుకు ఇవ్వలేదు?.ఏపీ ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై విచారణకు అవకాశం లేకుండా హడావుడిగా వీవీప్యాట్ స్లిప్పులను ఎందుకు కాల్చేశారు? పోలింగ్ కేంద్రాల్లో రికార్డైన వెబ్‌కాస్టింగ్ వీడియో క్లిప్పింగులను బహిర్గతం చేయమంటే ఈసీ ఎందుకు వెనుకాడుతోంది? కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరి, అనుమానాస్పద విధానాల వల్ల అత్యధికంగా నష్టపోయింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే. ప్రజల్లో నెలకొన్న ఈ తీవ్రమైన అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీపై లేదా?.మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు చెప్పినట్లుగా.. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పారదర్శకత కనిపించాలి. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక చట్టాన్ని కేంద్రం పునఃసమీక్షించాలి. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (CJI), లోక్‌సభ ప్రతిపక్ష నేత (LoP)లతో కూడిన తటస్థ కమిటీని తిరిగి పునరుద్ధరించాలి. పరీక్ష రాసే విద్యార్థే పరీక్షకుడిని ఎంపిక చేసుకునే విధానం ఉంటే నిష్పాక్షికత ఉండదు. స్వతంత్ర కమిటీ ఉంటేనే రాజ్యాంగ సంస్థలపై గౌరవం, విశ్వాసం పెరుగుతాయి.ఓట్ల తొలగింపు, చేర్పుల ప్రక్రియను పూర్తిగా ఢిల్లీ స్థాయిలోనే కేంద్రీకరించి లోపభూయిష్టంగా మార్చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి. బతికున్న పౌరుల పేర్లను తొలగించి తీవ్ర అన్యాయం చేస్తున్నారు. మాజీ మంత్రినైన నాకు, నా భార్యకు కూడా పేర్లలో అనుమానాలున్నాయంటూ నోటీసులు ఇచ్చారంటే పరిస్థితి ఎంత దారు ణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పేదలు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ఓటు హక్కును హరించే కుట్ర జరుగుతోంది. ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) మరియు స్థానిక సంస్థల డివిజన్ల పునర్విభజనలో అధికార కూటమి చేసిన దుర్వినియోగంపై మేం చేసిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదు.రాష్ట్రంలో లక్షలాది డబుల్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు ఉన్న పాత ఓటర్ల జాబితాతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం కోర్టుకు చెప్పడం అత్యంత దారుణం. చనిపోయిన వ్యక్తుల పేర్లతో నామినేషన్లు వేస్తే అంగీకరిస్తారా? ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉండేలా ఎన్నికలు నిర్వహిస్తారా? ఇలాంటి అక్రమాలను అరికట్టి, తప్పులను సరిదిద్దే వరకు ప్రజాక్షేత్రంలో, న్యాయస్థానాల్లో వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని సాకే శైలజానాథ్ స్పష్టం చేశారు.



## వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరికలు

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో వైసీపీ సీనియర్ నాయకులు అరజా వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. అడపావారిపాలెం సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో వారు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పార్టీ కండువాలతో జనసేనలోకి స్వాగతం పలికారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి స్వాగతం పలికారు.

## పెదప్రోలులో వైభవంగా 'అంగన్వాడీ ఉత్సవం'

**పోషకాహారంపై అవగాహన సదస్సు**




ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని, 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా పెదప్రోలు పంచాయతీ మీటింగ్ హాల్ నందు అంగన్వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై సలహాలు, సూ చనలు మరియు అభిప్రాయాలను సేకరించారు. అనంతరం అధికా రులు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులు ఆరోగ్యంగా ఉండటానికి పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని తల్లులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి కౌలు రైతుల రాష్ట్ర నాయకులు జె.వి. నగరాయులు , అల్లూరి శ్రీనివాస్ , సి డి పి ఓ ఇ. వాణి , సూపర్ వైజర్ ఎండి. షహనాజ్ బేగం లతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎం ఎల్ పి హెచ్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామీణ లబ్ధిదారులు పాల్గొన్నారు.



Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

# దర్గా దారంతా విద్యుత్ వెలుగులే..!

### -బాలకృష్ణ చొరవతో మలిరెడ్డిపల్లి నుంచి దర్గా వరకు నూతన విద్యుత్ లైన్

### -కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం-బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య

ప్రజాభూమి, హిందూపురం టౌన్

లేపాక్షి మండలం నాగేపల్లి సమీపంలోని హజరత్ పీర్ భక్తర్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు కులమతాలకు అతీతంగా సాగిన ఈ వేడుకల్లో గోవాకు చెందిన చాంద్ అతీష్, హైదరాబాద్‌కు చెందిన షాఫియా వారసి బృందాల ఖవ్వాలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఖవ్వాలి కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళాకారులను అభినందించారు. ముగింపు వేడుకలకు బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రనాయక్, డీఈఈ జ్యోత్స్న , ఏఈ వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, టీడీపీ మండల కన్వీనర్ అభిషేక్ తదితరులు హాజరయ్యారు. తొలుత అతిథులు హజరత్ పీర్ భక్తర్ వలిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మలిరెడ్డిపల్లి నుంచి దర్గా వరకు ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ లైన్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. విద్యుత్ దీపాలతో దర్గా మార్గం వెలుగులతో నిండిపోయింది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ, దర్గా వద్దకు వచ్చే భక్తులకు గతంలో సరైన రహదారి, విద్యుత్ సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. దర్గా కమిటీ విజ్ఞప్తి మేరకు బాలకృష్ణ చొరవతో 2018లో మలిరెడ్డిపల్లి నుంచి దర్గా వరకు రూ.30 లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అదే సమయంలో విద్యుత్ సౌకర్యం కల్పించే చర్యలు ప్రారంభమైనా ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో వారం రోజుల క్రితం దర్గా కమిటీ సభ్యులు బాలకృష్ణను ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడు రాత్రివేళ దర్గా మార్గంలో విద్యుత్ దీపాలు లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారని వీరయ్య తెలిపారు. సమస్యను తెలుసుకున్న వెంటనే బాలకృష్ణ అధికారులను అప్రమత్తం చేసి ఉత్సవాలు ప్రారంభమయ్యేలోపే ప్రత్యేక స్తంభాలు ఏర్పాటు చేసి నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు వేగంగా స్పందించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలకృష్ణ స్ఫూర్తితో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు, పూలకుంట మాజీ సర్పంచ్ మంజునాథ్ ముందుకొచ్చి దర్గా వద్ద విద్యుత్ దీపాలను అందించడం అభినందనీయమని వీరయ్య అన్నారు. దీంతో ఉరుసు వేడుకల సందర్భంగా దర్గా పరిసరాలు విద్యుత్ వెలుగులతో కళకళలాడాయని తెలిపారు. దర్గా ఆవరణలో సీసీ ప్లాట్‌ఫామ్ లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కమిటీ నిర్వాహకులు వీరయ్య దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి త్వరలో సీసీ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. బాలకృష్ణ ఎక్కడ ఉన్నా ప్రజల యోగక్షేమాలు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై నిత్యం ఆరా తీస్తుంటారని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా దర్గా ఉరుసు ఉత్సవాలను నిర్వహించుకోవడం సంతోషకరమని వీరయ్య అన్నారు. ఇలాంటి ఉత్సవాలు ప్రజల్లో సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం దర్గా కమిటీ నిర్వాహకులు అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు మస్తీ ఆర్.ఖాన్, శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ షరీఫ్, బాబాజాన్, సమీవుల్లా, క్రిష్టప్ప, నరసింహప్ప, మహబూబ్ దౌల, డాక్టర్ వారిస్, షబ్బీర్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



## ఎక్సైజ్ స్టేషన్‌లో అధికారుల ఆకస్మిక తనిఖీ

### -మూడు షాపులకు టెండర్ల ఆహ్వానం

### -అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు దరఖాస్తులకు అవకాశం

### -అక్టోబర్ 5న పుట్టపర్తిలో లక్కీ డ్రా



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.కె.డి.వి. ప్రసాద్, శ్రీ సత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి బి.నరసింహులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, సంబంధిత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం రెన్యువల్ కాని మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ జారీ చేసిన జిల్లా గెజిట్ నోటిఫికేషన్ వివరాలను అధికారులు వెల్లడించారు. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గెజిట్ నంబర్ 50 హిందూపురం మున్సిపాలిటీ, 56 చిలమత్తూరు మండలం, 58 పరిగి మండలాలకు సంబంధించిన మొత్తం మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు హిందూపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు గడువు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హిందూపురం ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌ను సైతం పరిశీలించారు. ప్రతి మద్యం దుకాణానికి నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 5న శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే ఆసక్తిగల వారు గడువులోగా నిబంధనల ప్రకారం దరఖాస్తులు సమర్పించాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు.

## టీడీపీ నుంచి వైకాపాలోకి 10 కుటుంబాలు - కండువాలు కప్పి ఆహ్వానించిన ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ వేంపల్లి మారుతి నగర్ కు చెందిన టీడీపీ నాయకులు శనివారం పులివెందులలో వైకాపాలో చేరారు. పులివెందుల పట్టణంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో గండి మాజీ చైర్మన్ కావలి కృష్ణ తేజ ఆధ్వర్యంలో 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైకాపాలోకి చేరాయి. వారికి ఎంపీ అవినాష్ రెడ్డి వైకాపా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలు నచ్చకే వారు వైకాపాలోకి వచ్చారన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైకాపా గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## రూ.22 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ -అభివృద్ధికి పెద్దపీట

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నాయకత్వంలో పట్టణ అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని కూటమి నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా మోడల్ కాలనీలో రూ.22 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శనివారం మాజీ కౌన్సిలర్, బీజేపీ హిందూపురం పట్టణ అధ్యక్షురాలు అంజలి రమేష్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతినిధి సురేంద్ర, వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మాజీ చైర్మన్ డీఈ రమేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు రమేష్‌రెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే బాలకృష్ణ నాయకత్వంలో హిందూపురం పట్టణంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తూ ప్రధాన రహదారులు, కాలువలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి హిందూపురం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా ఎగురవేయడానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చంద్రశేఖర్, సతీష్, నవీన్, రాజు, భార్గవ్, అశోక్, రామాంజనేయులు, అమీన్, రవి, మురళి, ఫాజిల్, శ్రీనివాసులు, అయూబ్, వెంకటేష్, దస్తగిరి, లోకేష్, సరస్వతమ్మ, గంగరత్న, శివప్ప, అశ్వర్థ, ఈశ్వర్, రంగప్ప, నరసప్ప, జనార్ధన, డాలేశ్వర్, రమేష్, మంజు, ప్రతాప్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ వాడకంపై ఫిర్యాదు

### - ఆహార భద్రతా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వినతి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని పలు హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో ఇడ్లీల తయారీలో ప్లాస్టిక్ షీట్లు, ప్లాస్టిక్ పదార్థాలను వినియోగిస్తున్నారని పేర్కొంటూ స్థానికులు అందెల రఘునాథ్ రెడ్డి, కదిరి మహేష్, గోవిందు నీలకంఠ, సింగం హరీష్‌రెడ్డిలు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో), వేంపల్లె స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య, ఎంపీడీవో కుళాయమ్మ సమక్షంలో డిప్యూటీ ఎంపీడీవో రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇడ్లీలను ఆవిరిపై ఉడికించే సమయంలో ప్లాస్టిక్ పదార్థాలు అధిక ఉష్ణోగ్రతకు గురై ఆహారంతో నేరుగా తాకుతున్నందున ప్రజారోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వేంపల్లె, పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేసి, ఆహార తయారీలో ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ పదార్థాలు సురక్షితమైనవేనా అనే విషయాన్ని పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సురక్షితమైన ప్రత్యామ్నాయ పదార్థాల వినియోగంపై ఆహార వ్యాపారులకు అవగాహన కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి -కమిషనర్ తనూజ కు వైకాపా నేతల వినతి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పురపాలక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో కొత్తగా ఏర్పడిన 40 వార్డుల పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేయగా, అందులో పలు అభ్యంతరాలు ఉన్నాయని వైకాపా నాయకులు తెలిపారు. శనివారం పురపాలక కమిషనర్ తనుజ కు వైకాపా పట్టణ ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి, శివలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4,13,19, 23,34వ వార్డుల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేం దుకు ఇబ్బందులు పడతారన్నారు. వాటిని పునఃపరిశీలించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వినతిపత్రంలోని అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

## కరువు జిల్లాగా ప్రకటించాలి

### -రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

### -సహాయ చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున పోరాటం

### -సిపిఎం జీపుజాతలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

శ్రీ సత్యసాయి జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక జిల్లా వ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. కరువు పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత శనివారం పరిగి మండలాన్ని ముగించుకుని హిందూపురం చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణతో పాటు జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాసులు, హరి, ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది అత్యంత లోటు వర్షపాతం నమోదైందని ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని వారు తెలిపారు. జిల్లాలో సుమారు 12.60 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, కేవలం 2.74 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయని పేర్కొన్నారు. దాదాపు 10 లక్షల ఎకరాలకు పైగా భూముల్లో పంటలు వేయలేని దుస్థితి నెలకొందన్నారు. సాగు చేసిన పంటలు సైతం చేతికొచ్చే పరిస్థితి లేదని, పండ్ల తోటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సాధారణంగా 280 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 87.04 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని తెలిపారు. భూగర్భ జలాలు 10 మీటర్లకు పైగా పడిపోవడంతో వందలాది గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ చూడని స్థాయిలో కరువు పరిస్థితులు నెలకొనడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కరువు కారణంగా పంటలు ఎండిపోవడం, తాగునీటి సమస్య, పశువులకు మేత--నీటి కొరత వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు గ్రామాలు, పంట పొలాల వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. తక్షణమే కరువు పరిస్థితులను అంచనా వేసి రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజలను ఆదుకునేలా ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరువు జిల్లాగా ప్రకటించడంతో పాటు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేసి రైతులకు పంట నష్టపరిహారం, సాగునీరు, తాగునీరు, పశువులకు మేత, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కరువు నివారణ చర్యలు చేపట్టకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం హిందూపురం నాయకులు విఆర్ రాము, జోతమ్మ, రమణ, మురళి, మూర్తి, బాలాజీ, మడకశిర నాయకులు రామాంజనేయులు, యోగానంద, వీరేష్, పుట్టపర్తి నాయకులు బాబా, సోమందేపల్లి నాయకులు కొండ వెంకటేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతోనే హెచ్ఐవీ రహిత సమాజం సాధ్యం - ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య

### బాలికల డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు




ప్రజాభూమి, పులివెందుల

సత్ప్రవర్తన, సరైన అవగాహన, బాధ్యతాయుత జీవన విధానంతోనే హెచ్ఐవీ రహిత సమాజ నిర్మాణం సాధ్యమని పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య అన్నారు. స్నేహిత అమృత హస్తం సేవా సమితి, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ విభాగం, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పులివెందుల ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో విద్య, వైద్య, పర్యావరణ సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ పై సమాజంలో ఇంకా అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు యువత ముందుకు రావాలన్నారు. రక్త మార్పిడి, అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషిత సూదుల వల్ల మాత్రమే హెచ్ఐవీ సోకుతుందని, సాధారణ సామాజిక సంబంధాల ద్వారా వ్యాపించదని వివరించారు. హెచ్ఐవీ బాధితులను చిన్నచూపు చూడకుండా అండగా నిలవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సిలింగ్ సేవలు వినియోగించుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ అనీత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగేంద్రమ్మ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ యువతలో ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం విద్యార్థినులకు అవగాహన ప్రతిజ్ఞ చేయించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, నేత్ర సేకరణ కేంద్ర టెక్నీషియన్ అరవింద్, రెడ్ రిబ్బన్ క్లబ్ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం

### – ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన




ప్రజాభూమి, వేంపల్లె

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో కెమికల్ ఇంజినీరింగ్ విభాగం గ్రీన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్--4 సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం--2026ను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్--4 ప్రోగ్రామ్ ఆఫీసర్ కోటేశ్వరి మార్గదర్శకత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేసి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం పరిసరాల్లో మొక్కలు నాటారు. ఇప్పటికే చేపట్టిన 100 మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను నిరంతరం సంరక్షించాలని నిర్ణయించారు. కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపొందించడం, ప్రకృతి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు

## అంగన్వాడీ కార్యకర్తలకు ఘన సన్మానం




ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం బిజెపి, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి పోషణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం బిజెపి అసెంబ్లీ కన్వీనర్ నల్లపేట ఆదర్శ కుమార్, సిడిపిఓ సుధా వరలక్ష్మి, సూపర్‌వైజర్ శాంతి తదితరులు పాల్గొని అంగన్వాడి కార్యకర్తలను , ఏఎన్ఎంలు ఆరోగ్య కార్యకర్తలను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాధ్యతల స్వీకరించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు చిన్నారులు కోసం కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంగాపురంలో స్వచ్ఛ రథం.. దసరా ధమాకాకు ప్రజల స్పందన

ప్రజా భూమి నార్పల,

స్వచ్ఛ రథం--దసరా ధమాకా కార్యక్రమంలో భాగంగా నార్పల మండలం రంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని రంగాపురం, జంగంరెడ్డిపల్లి, మూగేతిమ్మంపల్లి గ్రామాల్లో స్వచ్ఛ రథం పర్యటించింది. ఈ సందర్భంగా దసరా ప్రత్యేకంగా పెంచిన ధరలకు డ్రై వేస్ట్‌ను కొనుగోలు చేస్తామని ప్రజలకు అవగాహన కల్పించారు. 10 కిలోల కంటే ఎక్కువ డ్రై వేస్ట్ అందించిన వారికి లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందజేస్తామని అధికారులు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛ రథానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించగా, ఒక్కరోజులోనే 413 కిలోల డ్రై వేస్ట్ సేకరించారు. అదేవిధంగా అక్షరాంధ్ర కార్యక్రమంలోనూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మమత, డిప్యూటీ ఎంపీడీవో శ్యామల, పంచాయతీ కార్యదర్శి కీర్తనతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అసంక్రమిత వ్యాధులపై అవగాహనతో ఆరోగ్య పరిరక్షణ



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొద్దనపల్లి హెల్త్ సెంటర్‌లో శనివారం సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి వైద్యురాలు డాక్టర్ సాయి సుధ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల తెదేపా అధ్యక్షులు నక్కనబోయిన వేణు, హరిబాబు పాల్గొని ప్రజలకు మధుమేహం, రక్తపోటు తదితర అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి సుధ మాట్లాడుతూ ప్రజలు అసంక్రమిత వ్యాధులపై అవగాహన పెంచుకుని క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉప్పు, చక్కెర, నూనెను తగిన మోతాదులో మాత్రమే తీసుకుంటూ, ప్రతిరోజూ సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. శిబిరంలో 151 మందికి ఆరోగ్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి సుందరయ్యనగర్‌లో స్థానికులు ఏర్పాటు చేసిన వినాయక స్వామివారిని నూజివీడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారణ చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్‌తో రవాణా రహదారుల శాఖ మంత్రి ఆదేశం.

**ప్రజా భూమి బ్యూరో-ఏలూరు జిల్లా.**

ఏలూరు జిల్లాలో జాతీయ రహదారిపై 'బ్లాక్ స్పాట్స్' గుర్తించి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శి కోన శశిధర్ కు చెప్పారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో శనివారం రాష్ట్ర సచివాలయం నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కోన శశిధర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కోన శశిధర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా తనిఖీ, ప్రమాదాల డేటాను ఉపయోగించి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి ఇంజనీరింగ్ లోపాలను సరిచేయడం, రహదారి అంచులలో గీతలు మరియు మధ్య గీతలతో సహా, స్పష్టంగా కనిపించే, మన్నికైన థర్మోప్లాస్టిక్ గుర్తులను



ఉపయోగించడం, సరైన ముందస్తు హెచ్చరిక మరియు దిశానిర్దేశ సమాచారంతో కూడిన రెట్రో-రిఫ్లెక్టివ్ సంకేతాలను ఏర్పాటు చేయడం, పాఠశాలలు, మార్కెట్లు మరియు నివాస ప్రాంతాల సమీపంలో ఫుట్‌పాత్‌లు, పాదచారుల క్రాసింగ్‌లు, ఆశ్రయ ఐలాండ్‌లు వద్ద తగిన లైటింగ్ సౌకర్యాలు అందించడం, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్, క్షతగాత్రులకు వెంటనే వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకుని ప్రమాదాలు నియంత్రణ, మరణాలు నివారణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రమాదాలు ఎక్కువగా సంభవించే బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాదాల నివారణలో హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యత, రహదారి భద్రతా నియమాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ రహదారులపై స్పీడ్ గన్‌లతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించి వేగ పరిమితిని మించి వెళ్లే వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

# జర్నలిస్టులపై దాడిని ఉపేక్షించేది లేదు

**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

నూజివీడులో శుక్రవారం రాత్రి జర్నలిస్టులపై జరిగిన దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే విలేకరులపై దాడి జరగడంపై జర్నలిస్టు వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంటూ, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

**ఘటనపై మంత్రికి వినతిపత్రం**

నూజివీడులో జర్నలిస్టులపై జరిగిన దాడి ఘటనపై విజయవాడ, పెనమలూరు నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టులు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. దాడికి సంబంధించిన వివరాలను మంత్రికి వివరించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన



మంత్రి పార్థసారథి నూజివీడు డీఎస్పీకి ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను ప్రభుత్వం ఉపేక్షించదని, జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల గొంతుకగా నిలిచే విలేకరులకు రక్షణ కల్పించాలి. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం. పగలనకా, రాత్రనకా కష్టపడుతూ క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించి, ప్రజలకు అవసరమైన వార్తలను అందించేందుకు విలేకరులు నిరంతరం శ్రమిస్తుంటారు. ప్రజల ఇబ్బందుల ను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తుంటారు. సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టులపై దాడులు జరగడం ఆందోళన కరం. విలేకరులపై దాడులు వారి వ్యక్తిగత భద్రతకే కాకుండా, ప్రజా సమస్యలను స్వేచ్ఛగా వెలుగులోకి తీసుకువచ్చే ప్రక్రియకు కూడా ఆటంకం కలిగించే ప్రమాదం ఉంది. జర్నలిస్టులు నిర్భయంగా విధులు నిర్వహించే లా రక్షణ కల్పించడంతో పాటు, దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు వర్గాలు కోరుతున్నాయి. మంత్రి పార్థసారథి స్పందించి పోలీసులను చర్యలకు ఆదేశించడంతో, నూజివీడు ఘటనలో బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న దానిపై జర్నలిస్టు వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఆమని చెరువు ఆయకట్టు రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

### రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ వెట్రిసెల్వి

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆమని చెరువు ఆయకట్టు రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శనివారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. సగ్గూరు గ్రామంలో ఆయకట్టు రైతులను కలిసి సాగునీటికి సంబంధించిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆమని చెరువు నీటిని తమ ప్రాంతంలోని పొలాలకు అందించేందుకు ఇతర ప్రాంతాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పరిశీలించి సాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, కృష్ణా జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ గునకరరావు, ఈఈ కె. బాబు, మత్స్యశాఖ సహాయ సంచాలకుడు బి. రాజ్‌కుమార్, తహశీల్దారు పి.ఎన్.వి. ప్రసాద్, ఎంపీడీవో అబ్దుల్ సలామ్, నీటిపారుదల శాఖ ఏఈ జి. వెంకటేష్, రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, పోలీసు శాఖల అధికారులు, రైతు నాయకులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.





# రామచంద్రపురం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

రామచంద్రపురం పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. ఆర్. రాజు, డిఈ శ్రీకాంత్ లు శనివారం కూటమి పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మంత్రి వాసంశెట్టి





సుభాష్ ప్రత్యేక కృషితో రామచంద్రపురం పట్టణం, నియోజవర్గం, శర వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సుమారు 70 కోట్లకు పైగా నిధులతో పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో కాలువలు, సీసీ రోడ్లు, కల్వర్టులు వంటి మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. 21.39 లక్షల రూపాయలు విలువ గల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో మరిన్ని అభివృద్ధి పనులను కూడా దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి సూర్యనారాయణ, కట్టా నాగేశ్వరరావు, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, కడియాల రాఘవన్, సలాది నాయుడు, బుంగా రాజు, అంగర శ్రీను, పోలిశెట్టి పెదబాబు, బరగాటి రాంబాబు, ఏలూరు ఏసుదాసు, మనోజు, బల్ల శివ, నాగేశ్వరరావు, చింతాకుల ప్రకాష్, బల్ల లక్ష్మీ, వజ్రపు రాజేశ్వరి, టేకుమూడి రామకృష్ణ, మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు ఆదర్శం: యాట్ల



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.**

మహాత్మ జ్యోతిరావు పూలే దంపలు తనకు ఆదర్శమని రామచంద్రపురం నియోజకవర్గ ఎం.బీ.సీ.సంఘం అధ్యక్షులు యాట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అపూర్వమైన సామాజిక విప్లవానికి పునాది వేసి అట్టడుగు వర్గాల విముక్తి కోసం ఆధిపత్య వర్గాల దోపిడి సంకెళ్ళను చేధించడంకోసం మహాత్మా జ్యోతిరావు పూలే కులవ్యవస్తకు వ్యతిరేకంగా1873 సెప్టెంబర్ 24 న సత్యశోధక్ సమాజ్ స్థాపించి నేటికి 153 సంవత్సరాలు అయిన సందర్భంగా ద్రాక్షారామ మసీదు సెంటర్ లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే ఆయన భార్య భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు శ్రీమతి సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నియోజకవర్గం ఎం.బి.సి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పూలమాలలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సత్యశోధక్ సమాజ్ అంటే సత్యాన్ని వెతికేవాడని అర్థం అని తెలిపారు. అనంతరం ఈ నెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరిగే వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సుబ్బారావు, మాచవరపు సత్యనారాయణ పాల్గొన్నారు

## అంగన్‌వాడీ ఉత్సవాలకు పండుగ వాతావరణం

-రావులపాలెం నేహ్రూ స్ట్రీట్ కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు.



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.**

రావులపాలెం నేహ స్ట్రీట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో ఎ. గజలక్ష్మి ఆదేశాల మేరకు శనివారం అంగన్‌వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొనగా, తల్లులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పోషణ, మాతృ సంరక్షణ, సామాజిక సేవలు, టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజూ నిర్వహించే ఈసిసిఈ (ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య) కార్యక్రమాలు, గర్భిణులకు అందించే సేవలు, సీమంతం వంటి కార్యక్రమాల గురించి వివరించారు. చిన్నారులకు పోషకాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమానికి మండల మహిళా పోలీసు సఫియా ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కోట సోమేష్, కొవ్వూరి అచ్చిరెడ్డి, వడ్లమూడి రామారావు, వెల్‌నెస్ సిబ్బంది ప్రసన్న కుమారి, ఎంఎల్‌హెచ్‌వీ అనూరాధ, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది పి. నాగేశ్వరరావు, సీహెచ్. సునీల్ జోషి, ఎన్ శేఖర్ బాబు, దుర్గ, అంగన్‌వాడీ టీచర్ పి. లక్ష్మికళ, హెల్పర్ కె. నాగలక్ష్మి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు కేంద్రం ఊరట

### ఫలించిన ఎంపి పుట్టా మహేష్ కుమార్ కృషి

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



అదనంగా పండించిన పొగాకును ఎలాంటి పెనాల్టీ లేకుండా వేలం కేంద్రాల్లో విక్రయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయానికి కృషి చేసిన కేంద్ర ప్రభుత్వం, పొగాకు బోర్డుకు ఆయన కృతజ్ఞ తలు తెలిపారు. బార్న్‌కు రూ.50 వేల చొప్పున వడ్డీ లేని రుణానికి కూడా ఆమోదం లభిం చిందని, దీంతో సుమారు 44 వేల మంది రైతులకు రూ.220 కోట్ల వరకు ఉపశమనం కలుగు తుందని ఎంపీ తెలిపారు. అదనపు పొగాకు విక్రయాల కోసం తాను కేంద్ర మంత్రులు, అధికారులను కలిసి చేసిన విజ్ఞప్తులకు స్పందనగా తాజా ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ధరల స్థిరీకరణ పథకం కింద లో గ్రేడ్, ఆఫ్ గ్రేడ్ పొగాకుకు కిలోకు రూ.10 చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు రూ.94 కోట్లు మంజూరు చేసిందని ఆయన వెల్లడించరు.

## మున్సిపల్ ఎన్నికలకు జనసేన సన్నద్ధం

### కూటమి స్ఫూర్తితో సమన్వయంగా పనిచేయాలి: రెడ్డి అప్పలనాయుడు

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఏలూరు పార్లమెంటరీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇంచార్జీ రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఏలూరు జనసే న పార్టీ కార్యాలయంలో 62 డివిజన్ల ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కూటమి స్ఫూర్తికి విఘాతం కలగకుండా మూడు పార్టీల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గతంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో స్థానిక పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, ఎదురైన సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు త్వరలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.

## వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



వినాయక చవితి సందర్భంగా ఏలూరులోని విజయ విహార్ సెంటర్‌లో నాని ఫ్రూట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షు లు, ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ ఎం సి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, మాజీ కార్పొరేటర్ కత్తిరి రామ్మోహన్ రావు, డివిజన్ ఇంచార్జ్ పిల్లారిశెట్టి సంధ్యా సురేష్, నాయకులు ఆర్నెపల్లి తిరుపతి పాల్గొన్నారు.

## ఏలూరులో పారిశుద్ధ్య పనులు ముమ్మరం

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



భారీ వర్షాల నేపథ్యంలో ఏలూరు నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నగర పాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్, అధికారులను ఆదేశించా రు. శనివారం చాటపర్రు రోడ్డులోని బాలాజీనగర్‌లో ఆయన ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రైన్లలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, సిల్ట్ తొలగించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలని సూచించారు. దోమల నివారణకు పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలాజీనగర్ ముంపు సమస్యకు పరిష్కారం చాటపర్రు రోడ్డులోని బాలాజీనగర్‌లో పెద్ద డ్రైన్‌లో మురుగునీ రు, సిల్ట్ తొలగించడంతో భారీ వర్షాల వరద నీరు సైతం సాఫీగా దిగువకు వెళ్లిపోయింది. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక ప్రజలు జాయింట్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కొర్లకుంట లో కుటుంబాన్ని వెలివేసిన గ్రామ పెద్దలు

**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**



ముసునూరు మండలం కొర్లగుంట గ్రామంలో ఇటీవల వినాయకుడి ఊరేగింపు జరిగింది. ఆ ఊరేగింపులో టపాసులు వేసిన మాగంటి రాజేష్ పై మాగంటి పండు కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఆ సమయంలో మేనల్లుడు రాజేష్ ని రక్షించేందుకు మేనత్త పై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనలు రాజేష్ మేనత్తని బట్టలు పీకేశారు. ఈ విషయంపై కొర్లగుంట గ్రామంలో కుల పెద్దలైన పిన్ని బోయిన రంగారావు, మాగంటి రంగారావు, గరికిపూడి పెద్ద వెంకటేశ్వరావు కుమారుడు శ్రీను, గరికపూడి చిన్న వెంకటేశ్వర కుమారుడు శ్రీను, గరికపూడి శివన్నారాయణ, గరికపూడిసత్యనారాయణ, పల్లపోతు వీరబాబు, కాత్రు సాంబయ్య, పల్లపోతు సీతారామయ్య, గోళ్ల గురవయ్య, గోళ్ల వెంకటరామయ్య, గోళ్ల శ్రీను, గురవయ్య మరి కొంతమంది కుల పెద్దలు కలిసి శనివారం అర్ధరాత్రి వరకు కుల పంచాయతీ నిర్వహించారు. రూ 5000 తప్పుగా చెల్లించాలని కుల పెద్దలు తీర్పు చెప్పారు. దానికి బాధితులు ఒప్పుకోకపోవడంతో కులంలో నుండి బహిష్కరిస్తున్నట్లు కుల పెద్దలు తీర్పు చెప్పారు. జరిగిన సంఘటనపై ముసునూరు పోలీస్ స్టేషన్ కూడా ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.